గిద్దలూరులో టీడీపీ జెండా రెపరెపలాడిస్తాం

ముత్తుముల అశోక్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి



గిద్దలూరు టౌన్, మార్చి 14 : 'గిద్దలూరు నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో టీడీపీ జెండా రెపరెపలాడుతుంది. ఈ సారి నేను గెలిచి చంద్రబాబునాయుడికి ఈ గెలుపును కానుకగా ఇస్తాం. ఐదేళ్ల జగన్ పాలనలో అభివృద్ధి లేదు. వారితో జనం విసిగిపోయారు. 2014-19 టీడీపీ హయాంలో నేను నియోజకవర్గంలో రూ.1300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాను. అవన్నీ ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత టీడీపీ పాలన, ఇప్పటి జగన్ పాలన బేరీజు వేసుకుంటున్నారు. అభివృద్ధి అప్పుడే జరిగింది. ఇప్పుడేమి జరగలేదని జనం గుర్తించి చెబుతున్నారు.' అని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు.



గిద్దలూరులో బాణసంచా కాలుస్తున్న టీడీపీ శ్రేణులు

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల ఎంపికలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు చేసిన కసరత్తు ఫలించింది. రెండు విడతల్లో కలిపి ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల అభ్యర్థులను ప్రకటించగా, అన్ని చోట్ల పార్టీశ్రేణుల నుంచి సానుకూలత వ్యక్తమైంది. తొలి జాబితాలో ఏడు స్థానాలకు ప్రకటించగా, గురువారం ప్రకటించిన రెండో జాబితాలో మరో మూడుచోట్ల అభ్యర్థులను ఎంపిక చేశారు. తాజా జాబితాలో గిద్దలూరుకు ముత్తుముల అశోక్‌రెడ్డి, మార్కాపురానికి కందుల నారాయణరెడ్డి, కందుకూరుకు ఇంటూరి నాగేశ్వరరావును ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులు పూర్తికాగా, దర్శి, చీరాలపై కసరత్తు కొనసాగుతోంది. అధికార వైసీపీలో దాదాపు అన్ని స్థానాల్లో అభ్యర్థుల ఎంపికలో లొల్లి ఇంకా కొనసాగుతుండగా, టీడీపీ అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి అసంతృప్తులు, అసమ్మతులు లేవు.

నమ్మకం నిలబెట్టింది!

ఫలించిన బాబు కసరత్తు

జిల్లాలో టీడీపీ అభ్యర్థుల ఎంపికపై అంతా సానుకూలమే

పార్టీ శ్రేణులు, ప్రజలతో మమేకమయ్యే వారికే అవకాశం

రెండో విడతలో ముగ్గురికి ఖరారు

ఇక మిగిలింది రెండు అసెంబ్లీ స్థానాలే

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇటు పార్టీ శ్రేణులు, అటు ప్రజలతో మమేకమై పనిచేస్తున్న వారికే తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసే అవకాశం లభించింది. గత ఐదేళ్ల నుంచి జిల్లాలోని టీడీపీ నేతలు అన్ని అంశాల్లో సమైక్యంగా ముందుకుసాగుతూ రాష్ట్రంలో ఆదర్శవంతంగా నిలిచిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వారీ పరిస్థితులను సమీక్షించుకుంటూ పార్టీ ఇన్‌చార్జులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని హెచ్చరిస్తూ ఆయా విభాగాల్లో ఉన్న మార్పులు వేస్తూ అధినాయకత్వం తగు చర్యలు తీసుకుంది. తదనుగుణంగా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాల్లోనూ ప్రజల పక్షాన పని చేస్తూ వైసీపీ ప్రభుత్వ దమనకాండపై పోరాడిన నేతలకు ఆయన అవకాశమిచ్చారు. తొలి జాబితాలో ఏడుగురికి తిరిగి అభ్యర్థులుగా ప్రకటించారు. ఆ సమయంలో ఎక్కడా ఇసుమంతా అసంతృప్తిగానీ, వ్యతిరేకతగానీ వ్యక్తం కాలేదు. తాజాగా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికలోనూ అదే రకమైన సానుకూలత వ్యక్తమైంది. కందుకూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో ఒకరిద్దరు నేతలు కొంత అయిష్టతను వ్యక్తం చేసినా ముందుగానే వారందరికీ సూచనలు చేసి అభ్యర్థుల ఎంపికను సాఫీగా నిర్వహించారు.

పార్టీశ్రేణుల సంబరాలు

రెండో జాబితాలో ప్రకటించిన ముగ్గురికి మద్దతుగా గురువారం ఆ పార్టీశ్రేణులు నియోజకవర్గాల్లో సంబరాలు చేసుకున్నారు. ఆ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, కందుకూరు ఇన్‌చార్జి నాగేశ్వరరావులు



వైసీపీకి చెందిన పామూరు 2 ఎంపీటీసీ వెంకటేష్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఉగ్ర

మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా సమన్వయంతో ముందుకెళ్లి విజయం సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు. ఇక దర్శి, చీరాల అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానం తుది కసరత్తు చేపట్టింది. తొలుత దర్శిని జనసేనకు కేటాయించినప్పటికీ తాజాగా ఆ స్థానం టీడీపీకి దక్కడంతో అక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న వారిపై పార్టీశ్రేణులు, ప్రజల నుంచి అభిప్రాయం తెలుచుకునే సర్వేలు చేపట్టారు. బలహీనవర్గాలకు చెందిన నాయకుడిని చీరాల నుంచి రంగంలోకి దింపే క్రమంలో భాగంగా ప్రస్తుత ఇన్‌చార్జి కొండయ్యవైపే అధిష్ఠానం మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. అక్కడ ఉన్న కొన్ని పరిస్థితుల నేపథ్యంలో మరికొన్ని అంశాల ఆధారంగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన కుమారుడు రాఘవరెడ్డి వారి అనుచరులతో కలిసి శనివారం టీడీపీలో చేరనున్నారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా రాఘవరెడ్డి పేరును ఖరారు చేశారు. బాపట్ల ఎంపీ అభ్యర్థిగా మాదిగ సామాజిక వర్గం నుంచి కొత్త అభ్యర్థిని రంగంలోకి దింపే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఈ కసరత్తు కూడా పూర్తిచేసి శనివారం సాయంత్రానికి మిగిలిన రెండు అసెంబ్లీ స్థానాలు, లోకసభ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది.



మార్కాపురంలో కందుల నివాసం వద్ద బాణసంచా కాల్చుతున్న టీడీపీ శ్రేణులు

టీడీపీలో భారీ చేరికలు

కనిగిరి, గిద్దలూరు, వైపాలెంలో వైసీపీకి షాక్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో టీడీపీలోకి ప్రారంభమైన వలసల పరంపర రోజురోజుకూ పెరిగిపోతోంది. గురువారం కనిగిరి, గిద్దలూరు, వైపాలెం నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, ఎరిక్షన్‌బాబుల సమక్షంలో పెద్దసంఖ్యలో వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. కనిగిరి నియోజకవర్గం పామూరులో ఒక ఎంపీటీసీ సభ్యుడు, అతని అనుచరులు టీడీపీలో చేరగా, వెలిగండ్ల మండలం వెల్లలచెరువు, మొగళ్లూరులో వైసీపీకి గుడ్‌బై చెప్పిన వందలాది మంది టీడీపీలో చేరారు. గిద్దలూరు నియోజకవర్గంలోని పాపినేనిపల్లిలో ఒక ఎంపీటీసీ సభ్యునితోపాటు కంభం మండలంలోని రెండు గ్రామాలకు చెందిన వందలాది మంది అధికార పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. వైపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండలం తెల్లగట్ల, గంగవరం, కొత్తూరు గ్రామాల్లో బలహీనవర్గాలకు చెందిన వందలాది మంది ఎరిక్షన్‌బాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే ఎర్రగొండపాలెం మండలం అమానుగుడిపాడులోనూ పలు కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ కండువాలు కప్పుకున్నారు.

ముగిసిన జూనియర్ ఇంటర్ పరీక్షలు



పరీక్షలు ముగియడంతో కేరింతలు కొడుతున్న విద్యార్థినులు

ఒంగోలు(విద్య), మార్చి 14 : ఇంటర్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. కీలకమైన అన్ని సబ్జెక్టుల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 22,626 మంది హాజరుకావాల్సి ఉండగా సుమారు వెయ్యి మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఒక్క విద్యార్థి కూడా కాపీయింగ్‌కు పాల్పడుతూ డీబార్ కాలేదు. పరీక్షల నిర్వహణపై ఎటువంటి ఫిర్యాదులు, అభియోగాలు రాలేదు. మొత్తం 69 కేంద్రాలను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తూనే ఉన్నారు. పరీక్షలు ముగియడంతో మొదటి సంవత్సరం విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. పరీక్ష ముగియగానే కేరింతలు కొడుతూ కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. ఒంగోలులో హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులతో స్వగ్రామాలకు వెళ్లిపోయారు.

పేద మహిళలకు అండగా ప్రభుత్వం



చెక్కును అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14 : కులమతాలకు అతీతంగా పేద మహిళలందరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చెప్పారు. ఈబీసీ నేస్తం పథకంలో భాగంగా మూడో విడత అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాలో సీఎం గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లిలో బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వెంకాయమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అగ్రవర్ణాలకు చెందిన పేద మహిళలు 38,001 మందికి రూ.57.11 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, మేయర్ గంగాడ సుజాత, మెప్మా పీడీ రవికుమార్, సచివాలయాల నోడల్ ఆఫీసర్ ఉషారాణి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

రేపు బాబు సమక్షంలో టీడీపీలో చేరిక



ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒంగోలులో జరిగే శుక్ర, శనివారాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ఉండవల్లిలో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నివాసంలో తనయుడు రాఘవరెడ్డి, అనుచరులతో కలిసి ఆయన తెలుగుదేశం పార్టీలో చేరుతారు.

టెన్త్ విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులు నడపాలి

ఒంగోలు(విద్య), మార్చి 14: జిల్లాలో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి కోరారు. రవాణా సౌకర్యం లేని కారణంగా ఏ విద్యార్థి నష్టపోకూడదన్నారు. టెన్త్ పరీక్షల ఏర్పాట్లు, విద్యార్థులకు రవాణా సౌకర్యాలు తదితర అంశాలను ఆమె గురువారం సమీక్షించారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి వై.వెంకట్రావు, ఎంఈవో పి.సరస్వతి, ఆర్టీసీ మేనేజర్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ మాధురి, బీసీ సంక్షేమశాఖ అధికారి అంజలా, జగన్నాథం, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాస్ దినేష్ పాల్గొన్నారు.

హైవేకు రాజకీయ గ్రహణం

ట్రాఫిక్‌తో అవస్థలు పడుతున్న ప్రజలు

పుష్కరకాలం దాటినా పూర్తికాని రోడ్డు

కనిగిరి, మార్చి 14 : కనిగిరికి ప్రధాన హైవే రోడ్డుకు రాజకీయ గ్రహణం పట్టింది. ఈ మార్గం అసంపూర్తిగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పుష్కర కాలం దాటినా హైవే మార్గం పూర్తి కాకపోవడంతో భూములు కోల్పోయిన రైతులు నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. 2011లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నకరేకల్ నుంచి తిరుపతి మీదుగా ఏర్పేడు వరకు నేషనల్ హైవేను మంజూరు చేసింది. అప్పట్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరవ తీసుకొని ఈ రహదారిని కనిగిరి పట్టణానికి దగ్గరగా నియోజకవర్గం నుంచి వెళ్లేందుకు కృషి చేశారు. హైవే నిర్మాణం జరిగితే కనిగిరి అభివృద్ధికి తోడ్పడుతుందని భావించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోకి చినారికట్ల జంక్షన్ నుంచి పెదారికట్ల మీదుగా నందనమారెళ్ల, చల్లగిరగల, దిరిశవంచ, కాశిరెడ్డి కాలనీ, దేవాంగనగర్, టకారిపాలెం మీదుగా చెరువు సమీపంలోని ట్రాక్టర్ షోరూం వరకు హైవే నిర్మాణం జరిగింది. అక్కడి నుంచి 1,300 మీటర్ల దూరం రైతుల పరిహారం విషయంలో నెలకొన్న సమస్యతో ఆగిపోయింది. తిరిగి కొత్తూరు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి నిర్మాణం జరిగింది.



అసంపూర్తిగా ఆగిపోయిన హైవే రోడ్డు నిర్మాణం

ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా రోడ్డు

డాక్టర్ ఉగ్ర ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో మంజూరైన రోడ్డు పుష్కర కాలం దాటినా అసంపూర్తిగానే మిగిలిపోయింది. హైవే నిర్మాణంలో భూమిని కోల్పోయిన వారికి తొలుత ఎకరాకు రూ.30లక్షల నష్టపరిహారం ఇచ్చేందుకు హైవే అథారిటీస్ ముందుకు రాగా అందుకు రైతులు నిరాకరించి కోర్టును ఆశ్రయించారు. టీడీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల చొరవతో ఎకరా రూ.76లక్షలకు పెంచేలా హైవే అథారిటీస్ నుంచి ఒప్పందం చేశారు. ఈలోపు 2019లో ఎన్నికలు రావడంతో దానికి బ్రేక్ పడింది. ఆతర్వాత ఎమ్మెల్యేగా గెలిచిన మధుసూదన్‌యాదవ్ నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా నిరాదరణకు గురైంది. దీంతో కనిగిరి ప్రాంత వాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు.

నిత్యం నిలిచి పోతున్న ట్రాఫిక్

కడప, బెంగళూరు, తిరుపతి తదితర ప్రధాన నగరాల నుంచి హైవేపై భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. అసంపూర్తిగా మిగిలిపోయిన హైవే కారణంగా ఆయా వాహనాలు పట్టణంలో నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో నిత్యం కనిగిరికి ప్రధాన సెంటరైన పామూరు బస్టాండ్ కూడలి వద్ద ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ కారణంగా ప్రజలు, వాహనదారులు నరకాన్ని చవిచూస్తున్నారు. అంతేకాకుండా పామూరు బస్టాండ్ సెంటరు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరగడంతో భారీ వాహనాలు మలుపు తిప్పే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం అసంపూర్తిగా ఉన్న హైవేనిర్మాణాన్ని పూర్తి చేసి ట్రాఫిక్ కష్టాలను తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారంలోకి రాగానే పూర్తి



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రజలు ఇబ్బందులు పడుతుండడం చూస్తున్నాను. నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో హైవేకు శ్రీకారం చుట్టాం. కనిగిరి ప్రాంతం నుంచి రవాణా సౌకర్యం ఉండాలన్న ఉద్దేశంతో నేను ఇక్కడి నుంచి హైవే వెళ్లేలా చొరవ తీసుకున్నా. ఇన్నేళ్లయినా పనులు పూర్తికాలేదు. 2024 ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన వెంటనే హైవే 565 రోడ్డును పూర్తి చేస్తా.

ఎన్నికలు సజావుగా జరిగేలా

పటిష్ట చర్యలు చేపట్టాలి

కలెక్టర్ దినేష్‌కుమార్

కనిగిరి, మార్చి 14: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. తొలుత ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేకంగా ఎన్నికల సామగ్రి కోసం ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులు, నోడల్, సెక్టార్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈసీ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. అనంతరం మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితా కీలకమని, వివిధ రాజకీయ పార్టీల నుంచి, ప్రజల నుంచి ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి క్లియర్ చేసినట్లు చెప్పారు. కనిగిరి నియోజకవర్గంలో స్ట్రాంగ్ రూంల ఏర్పాటు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వేశ్వరరావు, రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జాన్‌ఇర్విన్ పాల్గొన్నారు.



ఎన్నికల స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు ప్రభుత్వ హైస్కూల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

గెలుపు కోసం

వైసీపీ అభ్యర్థుల దొడ్డిదారి వ్యూహాలు

వారితో ఓటర్లకు నగదు పంపిణీకి సన్నాహాలు

కట్టడి చేయాలని ప్రజలు, ప్రతిపక్షాల విజ్ఞప్తి

వలంటీర్లు, వీవోఏలకు తాయిలాలు



ముండ్లమూరు వైకేపీ కార్యాలయంలో వీవోఏలకు పంపిణీ చేసేందుకు ఉంచిన డిన్నర్‌సెట్లు

దర్శి, మార్చి 14 : అధికార పార్టీ గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతోంది. తమ గెలుపునకు పని చేయాలని వలంటీర్లకు, వీవోఏలకు తాయిలాలు అందజేస్తోంది. కొన్నిచోట్ల అంగన్‌వాడీ కార్యకర్తలను తమవైపు తిప్పుకునేందుకు అధికారపార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సన్నాహాలను ముమ్మరం చేస్తున్నారు. మధ్యవర్తులుగా వలంటీర్లను, వైకేపీలో పనిచేస్తున్న వీవోఏలను వినియోగించుకునేందుకు ఎర వేస్తున్నారు. వలంటీర్లకు రూ.5వేలు నగదు, డిన్నర్ సెట్, వాటర్ బాటిల్‌ను బహుమతులుగా వైసీపీ అభ్యర్థులు అందజేస్తున్నారు. వీవోఏలకు కూడా డిన్నర్ సెట్లు పంపిణీ చేశారు. ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో ఇప్పటికే పంపిణీ పూర్తయింది. మిగిలిన మండలాల్లో కూడా దశలవారీగా ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు నేతలు సిద్ధమవుతున్నారు. అనేకచోట్ల ఏకంగా వైకేపీ కార్యాలయాల్లోనే గిఫ్ట్‌ల నిల్వలను ఉంచినట్లు సమాచారం. ముందుగా వారిని సంతృప్తిపరిచి వారి ద్వారా ఓటర్లకు డబ్బులు, మద్యాన్ని పంపిణీ చేసేందుకు వ్యూహాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే వలంటీర్లు, వీవోఏలలో చాలామందికి తాయిలాలు అందాయి. మిగిలిన వారికీ అందజేసి ఆ తర్వాత ఓటర్లకు తాయిలాలు అందజేసేందుకు వీరిని వాడుకోనున్నారు. కాగా కొంతమంది వీవోఏలు తాయిలాలు తీసుకునేందుకు నిరాకరించినట్లు సమాచారం. ఇదిలావుండగా ఎలక్షన్ కమిషన్ నిబంధనలను ఏమాత్రం లెక్కచేయకుండా వైసీపీ నేతలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లను అడ్డుకోవాలని ప్రతిపక్షాలు కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవటం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరగాలంటే అక్రమాలు జరగకుండా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.

బహుమతుల మోత

పీసీపల్లి, మార్చి 14 : ఎన్నికల్లో వలంటీర్లను వాడుకునేందుకు వారికి ఆకర్షణీయమైన బహుమతులను పంచుతున్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వైసీపీ నాయకులు వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. 4వవిడత చేయూత చెక్కుల పంపిణీ అని వీవోఏలను పిలిచారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ వలంటీర్లు, వీవోఏలతో మాట్లాడారు. అనంతరం మోయలేని బరువుతో ఉన్న బహుమతులను అందజేశారు.



వైసీపీ నాయకులు పంపిణీ చేసిన డిన్నర్ బాక్సులను తీసుకెళ్తున్న వీవోఏలు

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగ నియామకపత్రాలతో విద్యార్థులు

ఒంగోలు(విద్య), మార్చి 14: ఒంగోలులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 31 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. పలుప్రైవేటు కంపెనీలు నిర్వహించిన ఈ ప్రాంగణ ఎంపికలో ఒంగోలు, ఈతముక్కల, కందుకూరు ప్రభుత్వ పాలి టెక్నిక్లు, ప్రైవేటు పాలిటెక్నిక్ విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన 31 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి రూ.3లక్షల వార్షిక వేతనం, భోజన వసతి, ప్రయాణసదుపాయం కల్పిస్తారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను శివప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి ఎం.శ్రీనివాసరావు, విభాగాధిపతులు మోహన్‌బాబు, పి.శ్రీనివాసరావు, అనుపమ, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల విజయకేతనం


అభివాదం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14: ఒంగోలు నగరం లాయర్‌పేటలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ఐఎస్‌టీఎస్‌వో రెండో దశ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేసినట్లు ప్రిన్సిపాల్ జోసెఫ్ తంబి తెలిపారు. గ్రాండ్ ప్రైజ్‌ను నాల్గవ తరగతి విద్యార్థి మొలక తనిష్క, మొదటి బహుమతిని టి.వీక్ష, ద్వితీయ బహుమతి వై.హసీష్, నాల్గవ బహుమతిని కె.నాగఅచ్యుత, వైభవ్‌రావ్, ఎ.వాణి, ఐదో బహుమతి బి.వెంకటకిరణ్ వైష్ణవి, జి.నాగవెంకటరిత్విక సాధించినట్లు పేర్కొన్నారు. ప్రోత్సాహక బహుమతులు 71 మంది సాధించగా, 176 మంది బంగారు పతకాలు సాధించినట్లు వెల్లడించారు. గురువారం స్థానిక స్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఏజీఎం అంజయ్య, ఆర్.అనిల్‌కుమార్, సమన్వయకర్త శ్రీనివాసులు, వైస్‌ప్రిన్సిపాల్ శివపార్వతి, డీన్ బాలసుబ్రహ్మణ్యం, ప్రైమరీ జోనల్ కోఆర్డినేటర్ సువర్ణ, ప్రైమరీ ఇన్‌చార్జి రజనీకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

పుస్తకావిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14: మహిళా ఉద్యమనేత బృందాకారత్ జ్ఞాపకాలను రీటా నేర్పిన పాఠం అనే పేరుతో పుస్తకం ప్రచురించడం అభినందనీయమని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పేర్కొన్నారు. ఒంగోలులోని ఐద్వా కార్యాలయంలో గురువారం ఈమేరకు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ బృందాకరత్ ఉద్యమ నేపథ్యం, తన బాల్య జీవితం, తను ఎంచుకున్న మార్గం వైపు పయనించడానికి ఎదురైన ఆటంకాలు, దాని తీసిన పరిస్థితులు ఈ పుస్తకంలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ పి.కల్పన, ప్రజాశక్తి బుక్ హౌస్ నిర్వహకురాలు పి.రజని, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మీ, ఎన్.మాలతి, జి.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, పెద్దగోవిందమ్మ పాల్గొన్నారు.

ఘనంగా టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు


సినీ గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సంతనూతలపాడు, మార్చి 14: సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని బీవీ.సుబ్బయ్య హైస్కూల్లో గురువారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన పదో తరగతి ప్రీపబ్లిక్ పరీక్షలు, పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లోను ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలను కూలంకషంగా అధ్యయనం చేస్తే ఆయా సబ్జెక్టుల్లో ఉత్తమ మార్కులు సాధించే అవకాశం ఉందని హైస్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ బి.కోటిలింగం పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హైస్కూల్ సలహాదారు ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.క్రిష్ణారావు, ప్రొఫెసర్ రవిప్రసాద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.230

సంతనూతలపాడు, మార్చి 14: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో గురువారం పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.230 పలికింది. చిలకపాడు నుంచి 957 పొగాకు బేళ్లు రాగా 827 బేళ్లు అమ్ముడయ్యాయి. 130 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.220 పలికింది. సరాసరి ధర రూ.227.98 వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి


రికార్డులను పరిశీలిస్తున్న బేబీరాణి

నాగులుప్పలపాడు, మార్చి 14 : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని పశుసంవర్ధకశాఖ జేడీఏ బేబీరాణి సూచించారు. బినిడమనూరు గ్రామీణ పశువైద్యశాలను ఆమె గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాలలోని కృత్రిమ గర్భధారణ ఇంజెక్షలను నిలువ చేసే ఎల్ఎన్ క్యాన్లను, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఈ నెలాఖరు నాటికి ప్రభుత్వం నిర్దేశించిన కృత్రిమ గర్భధారణ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వాక్సినేషన్లు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకూడదని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జేవీవో హనుమంతరావు, సహాయకులు కుమార్ ఆల్గొన్నారు.

చంద్రన్న సంక్షేమరాజ్యం రాబోతోంది !

టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి బీఎన్ • 20 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరిక • సాదరంగా ఆహ్వానించిన విజయ్‌కుమార్


వైసీపీ నాయకులను టీడీపీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్న బీఎన్


కరపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్

సంతనూతలపాడు, మార్చి 14: త్వరలో పేద, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే చంద్రన్న సంక్షేమరాజ్యం రాబోతుందని, వైసీపీకి ప్రజలు చరమగీతం పాడనున్నారని నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి బీఎన్.విజయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో పేర్నమిట్ట పరిధిలోని 40, 41, 42 డివిజన్‌లలోని వైసీపీకి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారందరికీ బీఎన్ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన బత్తుల శ్రీను, ఎం.చిరంజీవి, కె.వెంకట్రావు, కృష్ణారెడ్డి, ఎం.సుబ్బారావు, ఎస్.కొండయ్య నజీర్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గంలో బీఎన్.విజయ్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలుపు తథ్యమని, భారీ మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో వివరం గోవిందు, కరిచేటి శ్రీనివాసరావు, పి.శ్రీను, టి.వెంకటేశ్వర్లు, కె.శ్రీను, బ్రహ్మయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధిగా సేవలందిస్తా..

చీమకుర్తి: పేదల పెన్నిధిగా సేవలందించే అవకాశం కల్పించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం చీమకుర్తి పట్టణంలోని వెంకటేశ్వరనగర్, బండకాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్‌కు స్థానికులు ఘనస్వాగతం పలికారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగేనే అమలు చేసే పథకాల కరపత్రాలను విజయ్‌కుమార్ ఇంటింటికి తిరుగుతూ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు , సూరంపల్లి హనుమంతరావు, పరాల శ్రీను, నలబోతుల శ్రీను, కుంచాల ఆంజనేయులు, యడ్లపల్లి రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్, దరిమడుగు నాగరాజు, తాతినేని శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మన్నం శేషయ్య మృతికి సంతాపం

నిప్పట్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మన్నం శేషయ్య మృతి పట్ల బీఎన్.విజయ్‌కుమార్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. గురువారం శేషయ్య భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

మాజీ మున్సిపల్ చైర్మన్‌కు పరామర్శ

చీమకుర్తి పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్రపు రాఘవరావును గురువారం ఆయన ఇంటికి వెళ్లిన బీఎన్ పరామర్శించారు. ఇటీవల రాఘవరావు ఆసుపత్రిలో వైద్యసేవలు పొంది తన ఇంట్లో విశ్రాంతి పొందుతున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్థిక అసమానతలు తొలగించేందుకు ప్రధాని కృషి

• మాజీ కేంద్రమంత్రి పూర్ణేష్ మోదీ


సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణేష్ మోదీ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14: దేశంలో ప్రజల ఆర్థిక అసమానతలు తొలగేలా ప్రతి ఒక్కరికి మేలు చేకూర్చేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ కేంద్రమంత్రి పూర్ణేష్ మోదీ పేర్కొన్నారు. ఒంగోలు నగరం భాగ్యనగర్‌లో ఒంగోలు పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆంకాంక్షలకు అనుగుణంగా పని చేస్తోందన్నారు. రక్షణ విభాగాన్ని బలోపేతం చేసి ప్రపంచంలోనే బలమైన శక్తిగా దేశం ఎదిగిందన్నారు. వెనుకబడివర్గాల అభివృద్ధి కోసం 18 రకాల వృత్తుల వారికి పలు పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం క్విస్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన మేధావుల సమావేశంలో పూర్ణేష్‌మోదీ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల దేశంలో అనేక మంది అక్రమ చొరబాటుదారులు చేరి దేశ రక్షణకు ముప్పు కలిగించే విధంగా తయారయ్యారన్నారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్, మయన్మార్ తదితర దేశాలలో పలు ఇబ్బందులు పడుతున్న ముస్లిమేతరులు శరణార్థులుగా భారత్‌కు వచ్చి దేశ పౌరసత్వం ఇవ్వడానికి పౌరసత్వ చట్టంలో మార్పులు చేశారన్నారు. దీని వల్ల భారతీయ ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, మాజీ అధ్యక్షుడు శిరసనగండ్ల శ్రీనివాసులు, యోగయ్యయాదవ్, రవిశంకర్, సురేంద్రరెడ్డి, సరోజిని, కుంచాల శ్రీనివాసరావు, తన్నీరు శ్రీనివాసరావు, తీగల సత్యవతి, విజయరావు, కృష్ణవేణి, తిరుమల, శివకుమారి, సుల్తాని, లక్ష్మి పాల్గొన్నారు.

మునిసిపల్ సెల్ కన్వీనర్‌గా శ్రీనివాసరావు

బీజేపీ ఒంగోలు పార్లమెంట్ మునిసిపల్ సెల్ కన్వీనర్‌గా కాట్రగడ్డ శ్రీనివాసరావును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఒంగోలులో మాజీ కేంద్రమంత్రి పుర్ణేష్‌మోదీ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనతకు పదవి వచ్చేందుకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమలులో కేంద్రం పూర్తిగా విఫలం

• సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ రంగారావు


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పలు సంఘాల నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14: దేశంలోని రైతులకు ఇచ్చిన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు విమర్శించారు. ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న మహా పంచాయితీ కార్యక్రమానికి సంఘీభావంగా గురువారం ఒంగోలులో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసనలో రంగారావు మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమ విరమణ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వామినాథన్ సిఫార్సుల మేరకు సమగ్ర పంటల ఉత్పత్తి ఖర్చులు, 50శాతం కలిపి మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, కానీ ఇంత వరకు అమలు చేయలేదని ఆరోపించారు. ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్‌మీటర్లు బిగించే ఆలోచనను కేంద్రం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ 60 సంవత్సరాలు నిండిన పేద రైతుకు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.6వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌డీ.సర్దార్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను తిరిగి అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎస్. లలితకుమారి, బి.సుబ్బారావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు, కల్పన, ఆంజనేయులు, చావలి సుధాకర్, దాసరి సుందరం, కంకణాల రమాదేవి, వీవీఆర్.చౌదరి, రమేష్, పెంట్యాల హనుమంతరావు, రాజశేఖర్, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో జనసేన కీలకపాత్ర

• జిల్లా అధ్యక్షుడు రియాజ్



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు, చీమకుర్తిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పేర్కొన్నారు. జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఒంగోలులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మహనీయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రియాజ్ మాట్లాడుతూ బడుగ, బలహీనవర్గాల అభివృద్ధే జనసేన లక్ష్యమన్నారు. వారికి రాజ్యాధికారం దక్కినప్పుడే నిజమైన అభివృద్ధి జరిగినట్లని చెప్పారు. ప్రజా సమస్యలపై ఎప్పుడూ జనసేన పార్టీ పోరాటం చేస్తుందని, అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పార్టీ శ్రేణులందరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చనపతి రాంబాబు, మలగా రమేష్, జడ బాలనాగేంద్రయాదవ్, ముత్యాల కళ్యాణ్, రాయని రమేష్, మహ్మద్ యూనిస్, బొందిల శ్రీదేవి, దండే అనిల్, ఆర్‌కే.నాయుడు, పల్లప్రమీల, కోసూరి శిరీష తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి : జనసేన పారీ ఆవిర్భావ వేడుకలు చీమకుర్తిలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. ఎస్‌కేఆర్ పాఠశాలలో దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి అన్నదానాన్ని జరిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లపు శివప్రసాద్, పట్టణ అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, నాయకులు యాదాల కోటి, తోట సుధాకర్, చందు, శ్రీను, పవన్ తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు పత్రాల పంపిణీ


పత్రాలను అందజేస్తున్న మంత్రి నాగార్జున

నాగులుప్పలపాడు, మార్చి 14 : ఉప్పుగుండూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గురువారం జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలను లబ్ధిదారులకు మంత్రి మేరుగ నాగార్జున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలపై చిత్తశుద్ధితో ఉన్న సీఎం జగన్ ఇల్లు లేని వారందరికీ జగన్న కాలనీలను ఏర్పాటు చేశారని చెప్పారు. అందులో భాగంగానే లబ్ధిదారులకు శాశ్వత భూహక్కును కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి యాదల అశోక్‌బాబు, ఎంపీపీ నలమలపు అంజమ్మ, ఎంపీడీవో మహలక్ష్మి సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీలు మున్నంగి వెంకట్రావు, తాటి అనురాధ, నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, మారెళ్ల బంగారుబాబు, పోలినేని కోటేశ్వరరావు, పోలవరపు శ్రీమన్నారాయణ, మాదాసు రాంబాబు, ఉప్పుగుండూరు వాసుప్రసాద్, ఇమ్మిశెట్టి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి ట్రైసైకిల్ అందజేత


ట్రైసైకిల్‌ను అందిస్తున్న నాయకులు

చీమకుర్తి, మార్చి 14: చీమకుర్తిలో శివం ఫౌండేషన్, టీడీపీ ఆధ్వ ర్యంలో ఏలూరివారిపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు అనపర్తి ఏలియాకు గురువారం రాత్రి ట్రైసైకిల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపూడి శ్రీహరి, నాయకులు గోగినేని రాజా, కిలారు శ్రీను, మన్నం సుబ్బారావు, మన్నం వెంకట్రావు, మన్నం వెంకటసుబ్బయ్య, మన్నం హరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో అధికారుల దాడులు

కొత్తపట్నం(ఒంగోలునగరం), మార్చి 14: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది 35 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 100 విద్యుత్ చౌర్యం కేసులు, 16 కేటగిరీ మార్పు సర్వీసులు, 198 అదనపు లోడ్ గుర్తించి మొత్తం రూ.7,38,000 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో డీపీఈ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, ఆపరేషన్స్ ఈఈ పి.శ్రీనివాసులు, డీఈఈ ఆర్.మోహనరావు, కొత్తపట్నం ఏఈఈ చంద్రకాంత్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

హమాలీల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14 : జిల్లాలోని సివిల్ సప్లయీస్ స్టాక్ పాయింట్ల వద్ద పనిచేస్తున్న హమాలీల సమస్యలను పరిష్కరించాలని సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. గురువారం ఒంగోలులో సివిల్ సప్లయీస్ మేనేజర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ చౌకదుకాణ డీలర్లకు వద్దకు స్టాకు చేర్చే సమయంలో ఇవ్వాల్సిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో హమాలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గోడౌన్ బిల్లులు, డీలర్ బిల్లులు ప్రతినెలా మొదటి వారంలో ఇచ్చేలా చర్యలు తీసకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు, బిందే ఆంజనేయులు, బత్తుల గోపాలరావు, పి.శ్రీనివాసరావు, వెంకటయ్య, మురళీ, రామకోటయ్య. సురేష్, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట బహిరంగ సభకు తరలిరావాలి


మాట్లాడుతున్న జయంత్‌బాబు, మొయిద్దీన్‌బాషా

మద్దిపాడు, మార్చి 14: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ఈనెల 17న చిలకలూరిపేట సమీపంలో జరిగే బహిరంగసభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని టీడీపీ నాయకుడు షేక్ మొహిద్దీన్ బాషా పిలుపునిచ్చారు. గురువారం గుండ్లాపల్లిలో తెలుగుదేశం పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొప్పూడి వద్ద నిర్వహిస్తున్న కూటమి సభకు వేలాదిమంది పార్టీలకతీతంగా తరలిరావాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామాలకు వెళ్లి కార్యకర్తలతో పాటు ప్రజలతో మమేకమై సమీకరించాలన్నారు. ఈసభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ హాజరవుతారని తెలిపారు. మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ బహిరంగ సభకు మండలం నుంచి భారీగా తరలి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీఏఏను రద్దు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14 : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సిటిజన్ అమెండెమెంట్ యాక్ట్ (సీఏఏ)ను వెంటనే రద్దు చేయాలని సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ డిమాండ్ చేశారు. స్థానిక బిలాల్‌నగర్ జంక్షన్‌లో గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తుందని, ఈ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇమ్రాన్, జిలాని, మునీర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1,391 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 14 : జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 1391 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు మొత్తం 22,626 మందికి 21,235 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ ఒంగోలు నగరంలోని ఐదు పరీక్షా కేంద్రాలను, ఇతర అధికారులు 47 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

పేస్‌లో ఆర్టిన్ డిజైన్‌పై శిక్షణ


శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

ఒంగోలు(విద్య), మార్చి 14: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆర్టిన్ డిజైన్ శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎస్‌వీ.నరేష్ ఆర్టిన్ డిజైన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతోగాను ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత


అట్టలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు(విద్య), మార్చి 14 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలు విద్యార్థులకు పూర్వ విద్యార్థులు (1984-85) గురువారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి ఈపూరి శివ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. అనంతరం విద్యార్థులకు లామినేటెడ్ గ్రూప్ ఫొటో ఫ్రేమ్‌ను కూడా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్రావు, రమణ, శ్రీనివాస్, సురేష్, కనకమహాలక్ష్మి, మాధూరి, రాజ్యలక్ష్మి, పద్మశ్రీ, సువర్చల, కె.రవి, శేషగిరి, సుధాకర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

ఒంగోలు(విద్య), మార్చి 14 : విద్యార్థులు అనవసర విషయాలకు సోషల్ మీడియాకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ సూచించారు. ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, స్టెప్ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెక్నికల్ కోర్సులతో పాటు కొన్ని పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులు నేర్చుకొని తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ.హనుమంతరావు, కళాశాల వైస్‌చైర్మన్ డాక్టర్. ఎన్.గాయత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఏకు ప్రభుత్వ గుర్తింపు


ఒంగోలు(విద్య), మార్చి 14 : వైఎస్సార్‌టీఏ(యంగ్ మైండెడ్ సైంటిఫిక్ అండ్ రియలస్టిక్ టీచర్స్ అసోసియేషన్)కు ప్రభుత్వ గుర్తింపు లభించింది. ఈమేరకు ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ పోలా బాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్‌టీఏకు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వడం పట్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.మహేశ్వరరావు, పర్వత రమణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సంఘానికి గుర్తింపు ఇచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14: ఒంగోలు నగరంలో పనిచేస్తున్న పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ మునిసిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ జశ్వంత్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. నగర పాలక సంస్థలో శానటరీ విభాగంలో పనిచేస్తున్న కార్మికులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలని చెప్పారు. పర్మినెంట్ కార్మికుల తరహాలో వీరికి కూడా సరెండర్ లీవులు, జీపీఎఫ్ అకౌంట్లు అమలు చేయాలన్నారు. కార్మికులకు దుస్తులు, చెప్పులు, సబ్బులు, కొబ్బరినూనె అందించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌డీ.సర్దార్, శ్రీరామ్ శ్రీనివాసరావు, పీవీఆర్.చౌదరి, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న వెంకట్రావు

సంతనూతలపాడు, మార్చి 14: స్వామినాథన్ కమిషన్ మేరకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. గంగవరం గ్రామంలో గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల ఉద్యమసమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించడం దారుణమని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వర్లు, బి.లక్ష్మీనారాయణ, ఎ.వెంకటేశ్వర్లు, సుబ్బారావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

రైతు పోరాటానికి మద్దతుగా నిరసన

కొండపి, మార్చి 14 : ఢిల్లీలో జరుగుతున్న రైతు పోరాటానికి మద్దతుగా కొండపిలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం రైతు నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. రైతులకు మద్దతుగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు వై. చంద్రశేఖర్, ఆర్. లక్ష్మి, ముప్పరాజు చిన బ్రహ్మయ్య, ఏసుపోగు రూబెన్, దేవూరి బ్రహ్మయ్య, శ్రీనివాసులు, బ్రహ్మారెడ్డి, మరియదాసు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలసిన శ్రీనివాసరావు

చీరాల, మార్చి 14: టీడీపీ చీరాల అసెంబ్లీ టిక్కెట్ ఆశిస్తున్న తిరువీధుల శ్రీనివాసరావు గురువారం ఉండవల్లిలో ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. గత కొంతకాలంగా చీరాల నియోజకవర్గం లో తాను నిర్వహించిన కార్యకలాపాలను లోకేష్‌కు వివరించినట్లు ఆయన అనుయాయులు చెప్పారు.



లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసరావు

చీరాల వైసీపీలో ఆమంచి కలకలం!

చీరాల, మార్చి 14: గత కొంతకాలంగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ వేస్తున్న అడుగులపై వైసీపీలో కలకలం సాగుతోంది. ఆమంచి అనుచరులకు కూడా స్పష్టత లేకుండా పోతోంది. రోజుకో పుకారు షికారు చేస్తోంది. వైసీపీ నుంచి వైదొద లిగినట్లా, కొనసాగుతున్నట్లా, వైదొలిగితే ఏపార్టీ నుంచి పోటీ చేస్తారు.. ఇండిపెం డెంట్‌గా పోటీ చేస్తారా అనే అంశాలపై చర్చ సాగుతోంది. ఈనేపథ్యంలో గురువారం ఆయన సమీప బంధువు చీరాల కూరగాయల మార్కెట్ సెంటర్లో ఏర్పాటు చేసిన నూతనమాల్ ప్రారంభోత్సవానికి ఆమంచి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు పలువురు ఆమంచి అనుచరులు ఆయన వాహనానికి ముందు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈక్రమంలో స్థానిక ప్రజల్లో ఆమంచి వర్గం అడుగులుపై చర్చ జరిగింది. ఇప్పటికే ఆమంచి వర్గంలోని పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్‌లతో జతకట్టారు. అయితే మిగిలిన వర్గం ఆమంచినే అ నుసరిస్తున్నారు. ఈనేపథ్యంలో వైసీపీ కలహాల కాపురంగానే కొనసాగుతుందని భావిస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా చక్రవర్తి బాధ్యతల స్వీకరణ

చీరాల మున్సిపల్ నూతన కమిషనర్‌గా కె.చక్రవర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. చక్రవర్తి విశాఖ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎన్నికల నియమావళి నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న విజయసారధి పాలకొల్లుకు బదిలీపై వెళ్లారు. నూతంగా బాధ్యతలను స్వీకరించిన చక్రవర్తికి కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ. 231

టంగుటూరు, మార్చి 14 : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన పొగాకు కొనుగోళ్లలో గరిష్ఠ ధర రూ.231 రైతులకు దక్కింది. వేలం కేంద్రంలో మొత్తం 192 పొగాకు బేళ్లు ఉంచగా అందులో 188 బేళ్లను వ్యాపారులు కొన్నారు. 4బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. రైతులకు దక్కిన గరిష్ఠ ధర రూ.231 కాగా కనిష్ఠ ధర రూ.230 పలికింది. సరాసరి ధర రూ.230.01 ఉంది. కొనుగోళ్లలో 16 కంపెనీలు పాల్గొన్నాయి.

ఎన్నికల విధులను అవగాహనతో నిర్వహించాలి

కలెక్టర్ దినేష్‌కుమార్
నియోజకవర్గస్థాయి నోడల్ అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కొండపి, మార్చి 14 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కేటాయించిన విధులను పూర్తిస్థాయి అవగాహనతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. గురువారం మధ్యాహ్నం కొండపిలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్‌రూమ్‌ను సందర్శించారు. ఈసందర్భంగా నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణమైనా రావచ్చని, నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు చేయాలని చెప్పారు. తగినవిధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అధికారులు మార్గదర్శకాలను అర్థంచేసుకుని విధులను బాధ్యతతో నిర్వర్తించాలన్నారు. ముఖ్యంగా సచివాలయాల పరిధిలోని వీఆర్వోలు, మహిళా పోలీసులు నోడల్ అధికారులకు అందుబాటులో ఉండి ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ గోగినేనివారిపాలెంలోని మండల పరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై తహసీల్దార్ బి. కిరణ్‌కుమార్‌కు తగిన ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, కొండపి నియోజకవర్గ ఈఆర్వో ఎ. కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వేశ్వరరావు సెక్టార్ అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ఎన్నికల విధుల్లో పాల్గొనేవారికి మరింత శిక్షణ

ఎన్నికల విధుల్లో పాల్గొనేవారికి మరింత శిక్షణ అవసరమని, ఆ మేరకు తగిన శిక్షణ అందిస్తామని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. గురువారం మధ్యాహ్నం ఆయన నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సిబ్బందికి ప్రిలిమినరీ శిక్షణతో పాటు మరికొంత శిక్షణ ఇస్తామన్నారు. నోటిఫికేషన్ వచ్చాక ఎన్నికల విధులను ఎలా నిర్వహించాలనే విషయాలపై సిబ్బందికి సూచనలు చేశామన్నారు. అదేవిధంగా ఆర్వోకి ప్రత్యేకంగా నియోజకవర్గ కేంద్రంలో కార్యాలయం ఏర్పాటు చేశామని చెప్పారు. మొత్తంగా ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై సిబ్బందికి పూర్తిగా అవగాహన కలిగించే కార్యక్రమాలు చేస్తామని కలెక్టర్ వివరించారు.

ఓటర్లకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి

టంగుటూరు : టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7 పోలింగ్ కేంద్రాలు ఉన్నందున పోలింగ్‌కు వచ్చే ఓటర్లకు విషయం తెలిసేలా ఆ రోజు ఓటర్ల హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఎన్నికల అధికారులకు సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆ రోజు ఓటర్లకు కేంద్రాలు సులువుగా తెలిసేందుకు నంబర్లను ప్రదర్శించాలన్నారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, కొండపి ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వేశ్వరావు ఉన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు పుల్లారెడ్డి

చిలకలూరిపేట సభను విజయవంతం చేయాలి

● టీడీపీ పరిశీలకుడు భేరి పుల్లారెడ్డి

పొన్నలూరు (కొండపి), మార్చి 14 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో 17వ తేదీన జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు భేరి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. పొన్నలూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడనున్నారని చెప్పారు. పేట సభకు మండలం నుంచి భారీగా ప్రజలు తరలిరావాలని కోరారు. కొండపి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు అడకా స్వాములు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం ఖాయమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు నెలలపాటు క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు మండవ ప్రసాద్, సీనియర్ నాయకులు కర్షా కోటిరెడ్డి, పిల్లి వెంకటరమణారెడ్డి, సన్నమూరి నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ



రాత అట్టలు అందజేస్తున్న దాతలు

జరుగుమల్లి (కొండపి), మార్చి 14 : మండలంలోని చతుకుపాడు గ్రామానికి చెందిన ద్వారకా ఫౌండేషన్ ద్వారా కామేపల్లి జడ్పీస్కూల్ విద్యార్థులు 103 మందికి రాత అట్టలు, పెన్సిల్స్, రబ్బరు, ఇతర మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ దాతల సాయాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు విద్యాభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు తన్నీరు మాధవీలత, గోపిశెట్టి సురేష్, నలగట్ల కామేశ్వరి పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

సింగరాయకొండ, మార్చి 14 : అదనపు కట్నం కోసం భర్త పెడుతున్న వేధింపులు తాళలేక భార్య ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన స్థానిక పంచాయతీ పరిధిలో స్టాలిన్ నగర్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని టీపీనగర్‌కు చెందిన షేక్ రేష్మాను సింగరాయకొండకు చెందిన ఉస్మాన్‌బాషాకు ఇచ్చి రెండేళ్లకితం వివాహం చేశారు. వివాహ సమయంలో రేష్మా కుటుంబ సభ్యులు రూ. 2 లక్షల నగదును కట్నంగా ఇచ్చారు. దీంతో పాటు అదనంగా రూ.30 వేల ఇంటి సామగ్రిని కూడా సమకుర్చారు. వీరికి 10 నెలల నౌషాద్ అను బాలుడు ఉన్నారు. కొంతకాలంగా ఉస్మాన్‌బాషా, వారి తల్లిదండ్రులు అదనపు కట్నం కోసం రేష్మాను వేధిస్తున్నారు. వారు పెడుతున్న హింసలను తట్టుకోలేక బుధవారం రాత్రి ఇంటిలోని స్లాబ్ ఉక్కుకు చీరతో ఉరివేసుకుంది. గమనించి ఆమెను స్థానిక ఒక ప్రైవేట్ ఆసుపత్రికి అక్కడ నుంచి కందుకూరు మరో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రేష్మా(20) మృతిచెందినట్లు వైద్యుడు తెలిపారు. రేష్మా తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉస్మాన్‌బాషా, వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీరామ్ తెలిపారు. కేసును డీఎస్పీ కిషోర్‌బాబు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్

గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, మార్చి 14: రాష్ట్రంలో గిరిజనుల బలోపేతం లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ పని చేస్తుందని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. గురువారం మండలంలోని ఇసుకదర్శిలోగల క్యాంపు కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ గిరిజన ఆత్మీయ సమావేశంలో ఏలూరి మాట్లాడారు. గిరిజనులను ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేయడమే టీడీపీ లక్ష్యమన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసేందుకు టీడీపీ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. వచ్చే తెలుగుదేశం ప్రభుత్వంలో గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్టీలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా వారి ఆర్థిక పరిపుష్టి కోసం కృషి చేస్తామన్నారు. సమావేశానికి నియోజకవర్గం నుంచి భారీగా గిరిజనులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు తిరుమల శెట్టి శ్రీనివాసరావు, పాలపర్తి కోటేశ్వరరావు, రాచూరి కుమార్, పొన్నరసు వెంకటేశ్వర్లు, పాలపర్తి శ్రీనివాసరావు, ఆవుల వెంకటేశ్వర్లు, కుంభ ప్రసాద్, సూర్య నాయక్, యండేటి కోటేశ్వరరావు, మల్ల వెంకటేశ్వర్లు, అద్దూర్ వెంకటేశ్వర్లు, ఇండ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సమాజం యువత ఓటుతోనే సాధ్యం

మెరుగైన సమాజం కావాలంటే నవతరం, యువతరం ఓటర్లు తమ ఓటును వజ్రాయుధంలాగా ఉపయోగించి సమాజాభివృద్ధికి కృషిచేసే వారిని ఎన్నుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం మార్టూరులోని వీరగంధం శ్రీనివాస డిగ్రీ కళాశాలలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకునే యువతీ యువకులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు యువత తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉందన్నారు. సమాజం పట్ల బాధ్యత గలిగిన వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. ఉపాధి కోసం యువత వలసబాట పట్టడానికి సీఎం జగన్ కారణ మన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి పదవిలోకి వచ్చిన జగన్ అరాచకపాలనకు భయపడిన కంపెనీలు రాష్ట్రం నుంచి పరారయ్యాయన్నారు. అమరావతి రాజధానిగా ఉన్నట్లయితే ఎంతో మంది యువతకు మనదగ్గరే ఉపాధి లభించేదన్నారు. ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్రానికి దూరదృష్టి గలిగిన ముఖ్యమంత్రి అవసరమన్నారు. ఎంతో కష్టపడి చదువుకుని, సమాజానికి ఏదైనా చేయాలనే లక్ష్యంతో సొంతంగా వ్యవసాయ అనుబంధ పరిశ్రమ ఏర్పాటుచేసి వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించానని చెప్పారు. కార్యక్రమానికి విచ్చేసిన ఏలూరి సాంబశివరావుకు క శాశాల డైరెక్టర్ వీరగంధం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పొగడదండ రవి కుమార్, కన్నెగంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఏలూరిని సత్కరిస్తున్న పర్చూరు నియోజకవర్గ గిరిజనులు

రసాభాసగా మున్సిపల్ సమావేశం

అధికార పార్టీ కౌన్సిలర్ల అత్యుత్సాహం
టీడీపీ కౌన్సిలర్లు సమస్యలపై ప్రశ్నిస్తుండగా జోక్యం
మధ్యలోనే ముగించి వెళ్లిన చైర్‌పర్సన్

అద్దంకిటౌన్, మార్చి 14: అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. గురువారం కౌన్సిల్ హాల్‌లో జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశం కేకలు, అరుపులతో ప్రారంభమైన కొద్దిసేపటికే ముగిసింది. సమావేశానికి చైర్‌పర్సన్ ఏస్తేరమ్మ అధ్యక్షత వహించారు. ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్లు తిరుపతమ్మ, రజినీ సమస్యలపై గళమెత్తారు. అయితే, జీరో అవర్ సమయంలోనే సమస్యలను తెలియజేయాలని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. జీరో అవర్‌లో సభ్యులెవరూ ఉండకపోతుండటంతో ఆయా వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ముందుగా వివరిస్తున్నట్టు చెప్పారు. ఆ సమయంలో 20వ వార్డు అధికార పార్టీ కౌన్సిలర్ కోటేశ్వరరావు జోక్యం చేసుకుని సిబ్బంది అందరూ పనిచేస్తున్నారని కేకలు వేయడంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. తమ సమస్యలపై చైర్‌పర్సన్, అధికారులు స్పందించకుండా అధికార పార్టీ కౌన్సిలర్ స్పందించడంతో టీడీపీ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ సమయంలోనే మిగిలిన వైసీపీ కౌన్సిలర్లు కూడా మాట్లాడటంతో టీడీపీ కౌన్సిలర్లు కల్పించుకోవడంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. దీంతో సమావేశంలో ఏమి జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకోంది. ఈక్రమంలో చైర్‌పర్సన్ ఏస్తేరమ్మ సమావేశంలో పెట్టిన 15 అంశాలను ఆమోదిస్తున్నట్టు చెప్పి సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో సమావేశంలో సభ్యులందరూ మిన్నకుండడంతో సమావేశం ముగిసింది.



మున్సిపల్ సమావేశంలో వాదులాడుకుంటున్న అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు

ఏపీపీఎస్సీ అక్రమాల బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

» టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర డిమాండ్
» వెంటనే జగన్‌రెడ్డి రాజీనామా చేయాలి

పామూరు, మార్చి 14 : ఏపీపీఎస్సీ గ్రూప్ మెయిన్స్‌లో అక్రమాలకు పాల్పడిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని శిక్షించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. డిప్యూటీ కలెక్టర్‌లు, డీఎస్పీ పోస్టులను జగన్‌రెడ్డి అండ్ కో సంతలో పశువులను అమ్మినట్లు రేటు కట్టి కోట్లాది రూపాయల కుంభకోణానికి పాల్పడినట్లు ఉగ్ర ఆరోపించారు. పువ్వాడి ఫంక్షన్ హాలులో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో తమకు అనుకూలమైన వ్యక్తులకు పోస్టులు రాకపోవడంతో 25 ఆర్డీవో పోస్టులను ఒక్కొక్కటీ రూ.2.50కోట్లకు, 25 డీఎస్పీ పోస్టులను ఒక్కొక్కటీ రూ.1.50కోట్లకు అమ్మేశారన్నారు. జగన్‌రెడ్డి అక్రమాలపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో మాన్యువల్ పద్ధతిలో మూల్యాంకనం చేయాలని 2021 అక్టోబర్‌లో తీర్పునివ్వడంతోపాటు 3 నెలల్లోపు ఫలితాలు ప్రకటించాలని ఆదేశించిందని తెలిపారు. ఇంతటి మోసాలకు పాల్పడిన ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు, చైర్మన్ గౌతమ్‌సవాంగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, జగన్‌రెడ్డి తక్షణమే పదవికి రాజానామా చేయాలని ఉగ్ర డిమాండ్ చేశారు.

కూటమి సభకు తరలిరండి

● బాలాజీ పిలుపు

దర్శి, మార్చి 14 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నిర్వహిస్తున్న బహిరంగ సభకు దర్శి నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో తరలిరావాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ కోరారు. టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఈనెల 17వ తేదీన చిలకలూరిపేట సమీపంలో జరిగే బహిరంగ సభకు ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పాల్గొంటారని చెప్పా రు. అన్ని గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీ జేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రవికుమార్ మాట్లాడుతూ తనకు కట్టబెట్టిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిపోయిందని విమర్శించా రు. ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వటానికి చేతకాలేదని నిరంతరం కోర్టు మొట్టికాయలు వేసినా సిగ్గులేదన్నారు. జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సి ద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మంచౌదరి. శాసనాల వీరబ్రహ్మం, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు నేతలు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం

మర్రిపూడి, మార్చి 14 : సుపరిపాలన అందించడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని పురపాలకశాఖ మంత్రి సురేష్ చెప్పారు. గురువారం మండలంలోని తంగెళ్ల, జువ్విగుంట, మర్రిపూడి, చిమట గ్రామాలలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా, ఆరోగ్యకేంద్ర భవనాలను అయన ప్రారంభించారు. అనంతరం పొదిలి కొండరోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అవసరమైన అటవీ అనుమతుల కోసం డీఎఫ్‌వోతో మాట్లాడారు. ఆ తర్వాత మండల పరిషత్ కార్యాలయంలో వివిధగ్రామాల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కదిరి భాస్కర్‌రావు, ఎంపీడీవో సుదీపా, పంచాయతీరాజ్ డీఈలు శ్రీధర్‌రెడ్డి, రవిబాబు, ఏఈ జాలయ్య కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు ఇనుకొళ్లు సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మాచేపల్లి నాగయ్య, క్రిష్ణారెడ్డి, మస్తాన్, నరసింహారావు, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపీపీ వెంకటరెడ్డి మంత్రి సురేష్ పర్యటన ముగింపులో పాల్గొన్నారు.

కీలక నేతలు గైర్హాజరు

మంత్రి సురేష్ పర్యటనలో పలువురు కీలక నేతలు కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. జడ్పీటీసీ సభ్యురాలు మాకినేని సుధారాణి, మర్రిపూడి, చిమట సొసైటీ అధ్యక్షులు బీవీ భాస్కర్‌రెడ్డి, ఎం వెంకట్రావు, కీలకనేత బోదా రమణారెడ్డి పాల్గొనకపోవడం చర్చకు దారితీసింది. మండల వైసీపీ అధ్యక్షుడు దద్దాలి మల్లికార్జునరావు కేవల తంగెళ్లలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం మీద ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కీలకనేతలు గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది.

స్టేట్ బ్యాంకు ఉద్యోగి కిరణ్ మృతి

టంగుటూరు, మార్చి 14 : టంగుటూరు అంబేడ్కర్‌నగర్‌కు చెం దిన స్టేట్ బ్యాంకు ఉద్యోగి కసుకుర్తి కిరణ్‌కుమార్(35) బుధవారం రాత్రి పొద్దుపోయాక మృతి చెందారు. కిరణ్ స్వగ్రామం మండలంలోని అనంతవరం కాగా వారి తల్లితండ్రులు కొన్నేళ్లుగా టంగుటూరులో స్థిరపడ్డారు. అతనికి ఏడాది క్రితం అనారోగ్యం ఏర్పడింది. ఆసుపత్రిలో చూయించుకొని చికిత్స పొందాడు. తాజాగా మళ్లీ అనారోగ్యం పాలవడంతో కొద్దిరోజుల క్రితం తిరిగి ఆసుపత్రిలో చేరాడు. అతనిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి చేయిదాటి పోయిందని, ఇంటికి తీసుకుపోవాలని సూచించారు. ఇంటి వద్ద చికిత్స పొందుతున్న కిరణ్ కన్నుమూశారు. కిరణ్‌కు భార్య, బాబు, పాప ఉన్నారు. ఆయన విధులు నిర్వర్తించిన టంగుటూరు, మార్కాపురం, కొండపి స్టేట్ బ్యాంకు ఉద్యోగులు, స్టేట్ బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు గురువారం టంగుటూరులోని అంబేడ్కర్ నగర్‌లోని తన నివాసంలో ఉన్న కిరణ్ పార్థివదేహానికి నివాళులర్పించారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే స్వామి సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.



కిరణ్‌కుమార్ (ఫైల్)

ప్రజాసంక్షేమమే టీడీపీ ధ్యేయం

- ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి
- టీడీపీలోనికి భారీగా చేరికలు



వెంకటసుబ్బమ్మను ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 14 : ప్రజాసంక్షేమమే టీడీపీ ధ్యేయం అని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు మీనిగ వెంకటసుబ్బమ్మ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆమెకు, అనుచరులకు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కలిసికట్టుగా అందరూ పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో మీనిగ రంగకాశయ్య, నగరూరి వెంకటేశ్వర్‌రెడ్డి, బొల్లు సోమిరెడ్డి, ఆరవీటి అశోక్ ఉన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు వడ్లమూడి ఆంజనేయులుయాదవ్, వియ్యాల నారాయణ, సూరె కిట్టయ్య, లాకా రమణయాదవ్ పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో కంభం మండలం కందులాపురం గ్రామానికి చెందిన 20 యాదవ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు, 20 మైనారిటీ కుటుంబాలు ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కేతం శ్రీను ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు షైలగాని రాజుయాదవ్, బొర్రా కిరణ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులు కె.పులిభద్రుడు, మైనారిటీ నాయకులు షేక్ అలీముస్తాఫా, జి.రంగారావు, ఎం.కాశయ్య, డి.రంగస్వామి తదితరులు ఉన్నారు.

కొమరోలు : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం తథ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతలపల్లి గ్రామంలో శంఖారావం, 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో స్థానికుడినైన తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. గిద్దలూరు నియోజవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా తనను ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మరియు బీజేపీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. సైకిల్‌గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. గిద్దలూరు జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబా మాట్లాడుతూ అశోక్‌రెడ్డిని గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. అశోక్‌రెడ్డి గురించి ప్రతి గ్రామంలో తెలియని వారు అంటూ లేరని, అశోక్‌రెడ్డి ఈ మండల వాసిగా అందరికి సుపరిచితుడన్నారు. స్థానికుడికి ఎన్నుకోవడం వల్ల జరిగే ప్రయోజనాలు చాలా ఉంటాయన్నారు. మీరు అశోక్‌రెడ్డిని మంచి మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తుముల సంజీవరెడ్డి, ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బిజ్జాల తిరుమలరెడ్డి, సీనియర్ నాయకులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, జనసేన మండల అధ్యక్షులు గజ్జలకొండ నారాయణ, నాయకులు రామ వెంకటేశ్వర్లు(సీఎం), కొంకాల కొండయ్య, వెంకనిమెల వెంకటసుబ్బయ్య, సారె ఎల్లాలనాయుడు, మరియదాసు, ఉతా రాముడు, మేడంరెడ్డి జ్యోతి రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ నబీ, పెనుగొండ రమణ, స్వామిరంగయ్య, ఎస్ వెంకటయ్య, బిజ్జం నరశింహులు, కాంట్రాక్టర్ క్రిష్ణమోహన్‌రెడ్డి, చలిచీమల శ్రీనివాస చౌదరి, చికెన్‌కొట్టు ఖాజావలి,మాజీ సొసైటీ అధ్యక్షులు పులకుర్తి వెంకటేశ్వర్లు, వీరశేఖర్, బీసీ నాయకులు పందరబోయిన గోపాలక్రిష్ణ, నాయకులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.



కొమరోలులో హాజరైన కార్యకర్తలు



బేస్తవారపేటలో ముత్తుములకు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

టీడీపీలో చేరికలు

అర్ధవీడు మండలం నాగులవరం గ్రామానికి చెందిన పది కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారిని ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో బొబ్బా వెంకటసుబ్బారెడ్డి, సాకం రంగారెడ్డి, ఆసుపల్లి రామచంద్ర రెడ్డి, వల్లెపు గుర్రయ్య, తమ్మిశెట్టి సుబ్బరాయుడు, చిలకల వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, రమణ, వెంకటేశ్వర్లు, రంగయ్య తోపాటు మండలపార్టీ అధ్యక్షులు బి.ఆంజనేయులు యాదవ్, ప్రధాన కార్యదర్శి కె.రంగారెడ్డి, డి.ఇంద్రసేనారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ఎం.రంగారెడ్డి పాల్గొన్నారు.

బేస్తవారపేట : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోపై మండలంలోని చెట్టిచెర్ల గ్రామంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆ గ్రామ మాజీ సర్పంచ్ తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక నియంత పాలన నడుస్తోందని, ఆ నియంతను రాష్ట్రం నుంచి పారద్రోలడానికే శంకారావం పూరించినట్లు తెలిపారు. బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం, యువత భవిష్యత్ కోసం, మహిళా సాధికారత కోసం రాష్ట్ర భవిష్యత్తు కోసమే బీజేపీ, జనసేనాలతో టీడీపీ కలిసి ముందుకుపోతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జీ బెల్లంకొండ సాయిబాబు, పూనూరు భూపాల్‌రెడ్డి, చింతం చిన్న వెంకటయ్య లంకా నరశింహరావు, కె.బాలరంగయ్య, మదుసుదన్‌రెడ్డి, పాల్గొన్నారు.

కంభం : జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు మొండిచేయి చూపించి మోసం చేశారని, గత ఎన్నికల్లో బీసీ ఓట్లను దండుకున్నారని కంభం మండల టీడీపీ అధ్యక్షులు తోట శ్రీనివాసరావు తెలిపారు. గురువారం రాత్రి కంభం మండలం దర్గా గ్రామంలో టీడీపీ, జనసేనల ఉమ్మడి మానిఫెస్టో సూపర్‌సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే బీసీ చట్టం తెస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీ బలపరచిన అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. సైకిల్‌గుర్తుపై ఓటువేసి అశోక్‌రెడ్డి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కంభం మండల నాయకులు, దర్గా ప్రజలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

కష్టపడి కాకుండా ఇష్టపడి చదవండి



పరీక్ష అట్టలు అందజేస్తున్న కమిషనర్

గిద్దలూరు టౌన్, మార్చి 14 : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు ఉంటాయని గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు ఏ విధంగా సంసిద్ధం కావాలనే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎం.రాంభూపాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలా నాగభూషణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినులకు ఒంగోలుకు చెందిన సరస్వతి జూనియర్ కళాశాల యాజమాన్యం సమకూర్చిన పరీక్ష అట్టలను విద్యార్థులకు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా అందరినీ అలరించాయి.

దివ్యాంగురాలికి 'హెల్పింగ్ హ్యాండ్స్' సాయం



దుకాణం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కొమరోలు, మార్చి 14: దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓ దివ్యాంగురాలికి ఉపాధి కల్పించాలనే సదుద్దేశ్యంతో కిరాణా బంకును ఏర్పాటు చేశారు. ఈ ఘటన మండలంలోని బాదినేనిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకొంది. మండలంలోని బాదినేనిపల్లి గ్రామానికి చెందిన వర్రా సాంబశివ కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. సాంబశివకు భార్య నర్సకుమారి, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. దివ్యాంగురాలైన నర్సకుమారి ఏ పనిచేసుకునే పరిస్థితి లేకపోయింది. పిల్లలను చదువించుకునే స్తోమత కూడా లేదు. దీంతో దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజర్ నిర్వాకులు లోక్కు శరత్‌కుమార్ పరిస్థితిని తెలిసుకున్నారు. ఆమెకు భరోసా ఇచ్చారు. ఆ మేరకు శరత్‌కుమార్ దాతల సహకారంతో నర్సకుమారికి రూ.50వేల ఆర్థిక సాయంతో బంకు, అందులో కిరాణా సామాగ్రిని అందించి చేయుతనిచ్చారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ ద్వివ్యాంగులు, అనాథలకు తమ సేవా సంస్థ ద్వారా చేయూతనిస్తున్నట్లు తెలిపారు. తమకు సహకరించిన దాతలను కొనియాడారు. నర్సకుమారి మాట్లాడుతూ తన కుటుంబానికి జీవనోపాధి కల్పించిన దివ్య హెల్పింగ్ సభ్యులకు దాతలకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సిద్ధయ్య, కారుమంచి చిన్న పీరయ్య, కామూరి శివరాంరెడ్డి, పోలెబోయిన చంద్రశేఖర్, లోక్కు దావీదు, కత్తి ప్రాన్సీస్, పుల్లయ్య గ్రామ సమైఖ్య సభ్యురాలు పోలెబోయిన మయూరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొదిలి, మార్చి 14 : త్వరలో జరగనున్న సర్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఓటును ఎలా వేయాలని ప్రజలకు అవగాహన కార్యక్రమం గురువారం ఎంపీయూపీ స్కూల్‌లో నిర్వహించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారు, పాత ఓటర్లు ఏవిధంగా ఓటవేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ మస్తాన్‌వలి, ఏఎన్ఎం విజయ వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల భవనం ప్రారంభం

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు),మార్చి 14: ఎర్రగొండపాలెంలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ వైద్యశాలను వై.పాలెం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాసరావులు ప్రారంభించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్యశాలను ప్రారంభించారు. పేదలకు కార్పోరేట్ స్థాయిలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, వైసీపీ నాయకులు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో పలు కుటుంబాలు చేరిక



కేడర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామిరెడ్డి

మార్కాపురం రూరల్, మార్చి 14: పట్టణంలోని 14వ వార్డులో చెన్నారాయుడుపల్లిలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడు తూ.. మార్కాపురం ప్రత్యేక జిల్లా కావాలంటే కందుల నారాయణరెడ్డితోనే సాధ్యమన్నారు. ప్రత్యేక జిల్లాతోనే తమకు భవిష్యత్తు ఉంటుందని గ్రహిం చామని వైసీపీ తమకు మాయమాటలు చెప్పి గత ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని వదిలేసిందన్నారు. అందుకే తెలుగుదేశం పార్టీలో చేరామని తెలి పారు. నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ రామిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచకాలతో ప్రజలు విసుగెత్తిపోయారని ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారన్నారు. అనంతరం వార్డులో మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతమ్మ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సాధిక్, పట్టణ తెలుగుదేశం నాయకులు, జనసేన నాయకులు, 14వ వార్డు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ భూమికే ఎసరు

- పట్టపగలే కబ్జాకు వైసీపీ నేత యత్నం



ఆక్రమణను పరిశీలిస్తున్న అధికారులు

పొదిలి, మార్చి 14 : మండలంలోని కంబాలపాడు పంచాయతీలోని వార్డు సచివాలయం సచివాలయం భూమిని వైసీపీకి చెందిన ఓ నాయకుడు ఆక్రమించారు. విలువైన ఆ భూమి చుట్టూ ఏకంగా కంచె ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టాడు. ఎన్నికల కోడ్ తరుముకొస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ నేతలు కుందురు వెంకటసుబ్బయ్య ప్రభుత్వ భూమిని కొల్లగొట్టేందుకు ప్రయత్నించడం పట్టణంలో చర్చాంశనీయమైంది. ఒంగోలు నంద్యాల ప్రధాన రహదారిని ఆనుకొని 45-1 సర్వే నెంబర్లో 2.11ఎకరాలు కుంట భూమి ఉంది ఈ భూమిని గతంలో ప్రభుత్వ వార్డు సచివాలయ నిర్మాణాలకోసం ఒక ఎకరం కేటాయించారు. ఆ స్థలంలో సచివాయంతోపాటు, రైతుభరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. ఒకవైపు సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో ఉండగా దౌర్జన్యంగా ప్రభుత్వ భూమిలోకి ప్రవేశించి ఎస్కవేటర్‌తో సచివాలయానికి అడ్డుగా గోతులు తీయడం అధికారపార్టీ నేత దౌర్జన్యానికి పరాకాష్టగా నిలిచింది. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ, నగరపంచాయతీ సిబ్బంది హుటాహుటినా ప్రాంతానికి చేరుకొని అడ్డుకున్నారు. సచివాలయ భూమిలో అక్రమంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడమే కాకుండా తమపై దర్జాషలాడారని ఆయన ఆరోపించారు. గతంలో కూడా ఒకసారి ఇలాంటి సంఘటన జరిగిందని అప్పుడు నోటీసులు ఇచ్చామని పంచాయతీ కార్యాదర్శి శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. అయినా మరోసారి ఆక్రమణ చేసేందుకు వచ్చారని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఉన్నతాధికారులు సత్వరమే జోక్యం చేసుకోకపోతే కోట్లాది రూపాయల స్థలం అన్యాక్రాంత అవుతుందని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఈ తీరుకు వ్యతిరేకంగా ఉద్యోగుల ధర్నా



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మార్కాపురం రూరల్, మార్చి 14: విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వరరావు ప్రవర్తనను వ్యతిరేకిస్తూ ఆ శాఖ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించిన విద్యుత్ ఉద్యోగులు మాట్లాడుతూ డి.నాగేశ్వరరావు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఏకపక్ష నిర్ణయాలతో తమ కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. లైన్‌లో ట్రాన్స్‌ఫర్‌లలో యుటిలైజేషన్ విధానం ఉపయోగించి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాలలో శాఖపరమైన నిబంధన లు పాటించకుండా తాను ఇష్టానుచారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. నిరససన కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన సమావేశం

గిద్దలూరు, మార్చి 14 : వినియోగదారుల హక్కులు, విధులు, రక్షణ పొందే విషయాలపై విద్యార్థులకు వినియోగదారుల సంఘం నాయకులు అవగాహన కల్పించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘం అధ్యక్షులు వి.వీరారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వరరావు, సభ్యులు పిచ్చయ్య, కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 14: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల రాష్ట్ర పరిశీలకులు ప్రసన్నకుమార్ ఆదేశించారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చీఫ్ సూపరింటెండెంట్ల డివిజన్ స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. పదోతరగతి పరీక్షకేంద్రాలన్నీ నో సెల్ ఫోన్ జోన్‌గా ప్రకటించారన్నారు. పరీక్ష విధులలో ఉన్న ఏ వ్యక్తి వద్ద సెల్‌ఫోన్ ఉండవద్దన్నారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దన్నారు. ఉదయం 8:45ని.లకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఒక్క విద్యార్థి కూడా నేలమీద కూర్చొని పరీక్ష రాయకూడదన్నారు. పరీక్షా కేంద్రాలలో బల్లలు, ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇన్విజిలేటర్లకు ప్రతీపరీక్షా కేంద్రంలో 17న సమావేశం నిర్వహించి పరీక్షల నిర్వాహణకు సంబంధించిన సూచనలు చేశారు. సమావేశంలో డీఈవో సుభద్ర, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ ఎ.శివకుమార్‌రెడ్డి, మార్కాపురం, ఒంగోలు డిప్యూటీ డీఈవోలు చంద్రమౌళీశ్వర్, రోజారాణి పాల్గొన్నారు.

చేయూత చెక్కుల పంపిణీ

పొదిలి, మార్చి 14 : వైఎస్‌ఆర్ చేయూత నాలుగవ విడత చెక్కులను వైసీపీ మార్కాపురం సమన్వయకర్త అన్నా రాంబాబు గురువారం పంపిణీ చేశారు. పొదిలి, కొనకనమిట్ల మండలాలకు సంబంధించిన లబ్ధిదారులకు స్థానిక మంజునాథ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో వీవోఏలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ప్రకటనపై టీడీపీ శ్రేణుల సంబరాలు

గిద్దలూరులో అశోక్‌రెడ్డి, మార్కాపురంలో నారాయణరెడ్డి అనుచరుల హర్షం



కంభంలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

గిద్దలూరు టౌన్ :టీడీపీ అధిష్టానం గిద్దలూరు నియోజకవర్గ అభ్యర్థిగా, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి పేర్లు ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు, సంబరాలు చేసుకున్నాయి. గిద్దలూరు మండలంలోని పలుకూడళ్లలో కార్యకర్తలు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. గిద్దలూరులోని రాచర్లగేటు కూడలిలో టీడీపీ శ్రేణులు భారీగా బాణాసంచా పేల్చి అశోక్‌రెడ్డి విజయం తథ్యమని నినాదాలు చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, అశోక్‌రెడ్డిలకు జిందాబాద్ కొడుతూ సంఘీభావం తెలిపారు.

కొమరోలు : కొమరోలు మండలంలో టీడీపీ శ్రేణులు స్థానిక ఆంజనేయస్వామి గుడి కూడలిలో టీడీపీ నాయకులు, కార్యాకర్తలు పెద్దఎత్తున బాణసంచాకాల్చి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీటీసీ ముత్తుముల సంజీవరెడ్డి నివాసంలోని సంజీవరెడ్డికి పూలమాలలు వేశారు. నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు తినిపించుకుని సంతోషం వ్యక్తంచేశారు. మండలంలోని తాటిచర్ల మోటులో టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టపాసులు కాల్చి హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు ఓబుల్‌రెడ్డి, తిరుమలరెడ్డి, చికెన్‌కొట్టు ఖాజావలి, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ నబీ, వార్డుమెంబర్ సుభాని, సిద్దయ్య పాల్గొన్నారు.

కందుల నియామకంపై హర్షం

మార్కాపురం రూరల్, మార్చి 14 : మార్కాపురం నియో జకవర్గ టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి పేరును అధికారికంగా ప్రకటించడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని ఆయన ఇంటి వద్ద బాణసంచాకాల్చి స్వీట్లు పంచుకొని ఆనందంతో సంబరాలు చేసుకున్నారు. కందుల నారాయణ రెడ్డి తనయుడు విఘ్నేష్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు పట్టణంలోని ప్రధాన వీధులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సెవెన్ హీల్స్ సెంటర్, సప్తగిరి సెంటర్, కాలేజీ రోడ్డు, గడి యారం సెంటర్, కోర్టు సెంటర్‌లలో బైక్ ర్యాలీ నిర్వహించి ఆనందోత్సవాలతో సంబరాలు జరుపుకున్నారు. రానున్న ఎన్నికలలో విజయం మనదే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోల్ మేనేజ్మెం ట్ ఇన్‌చార్జ్ రామిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ వక్కలగడ్డ మల్లికార్జున, పట్టణ అధ్యక్షులు మౌలాలి, పార్టీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

పొదిలి : కందుల నియామకంపై పొదిలి టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. పట్టణంలో పందు చికెన్‌సెంటర్, పార్టీ కార్యాలయం, విశ్వనాధపురం, పెద్దబస్టాండ్, చిన్న బస్టాండ్ కూడళ్లలో బానసంచాకాలుస్తూ మిఠాయిలు పంచుకున్నారు.

ముత్తుముల అశోక్‌రెడ్డి బయోడేటా

పేరు	: ముత్తుముల అశోక్‌రెడ్డి
తల్లిదండ్రులు	: రామచంద్రరెడ్డి, లక్ష్మీదేవమ్మ
పుట్టిన తేది	: 15-07-1968
విద్యార్హత	: బీఈ
భార్య	: పుష్పలీల
కుమారులు	: దివ్యేష్ రెడ్డి, భవజ్ఞ రెడ్డి
స్వగ్రామం	: కొమరోలు



- 2014లో గిద్దలూరు నుంచి ఎమ్మెల్యేగా తొలిసారిగా గెలుపొందారు. 2019లో టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. ప్రజా క్షేత్రంలో పార్టీ వాణిని బలంగా వినిపించారు. ప్రజాసమస్యలపై స్పందించడం పార్టీ విధేయులుగా ఉన్నారు. దీంతో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గం నుండి మరోమారు పోటీ చేసే అవకాశం టీడీపీ కల్పించింది.

వైసీపీని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలి

వై.పాలెం టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు



టీడీపీలో చేరుతున్న నాయకులు

పుల్లలచెరువు, మార్చి 14 : అవినీతి తప్ప అభివృద్ధి చేయని వైసీపీని రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలని వైపాలెం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు .గురు వారం పుల్లలచెరువు మండలం ముటకుల పంచాయతీ తెల్లగట్లలో 100 కుంటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి ఆయన పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం గ్రామాభివృద్ధి జరగలేదన్నారు. గ్రామంలో సీసీ రోడ్డులు, డ్రేనేజీ లేక తాండలో అభివృద్ధి కనిపించడంలేదని అన్నారు. గ్రామానికి ప్రధానరోడ్డులో గుంతలు పడి ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు వేలాది మందికి ఐటి రంగం ద్వారా ఉద్యోగాలు కల్పించారని అన్నారు. సీఎం రాష్ట్రానికి ఒక్క పరిశ్రమైన తెచ్చారా..? అని ప్రశ్నించారు. జగన్ సొంత బాబాయిని చంపిన అవినాశ్‌రెడ్డిని వదిలేసి ఆ నింద చంద్రబాబుపై మోపి గత ఎన్నికల్లో సానుభూతి పొందరాన్నరు. వైసీపీని రానున్న ఎన్నికల్లో రాష్ట్రం నుంచి పారదోలాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మండల నాయకులు శనగా నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య,మేడికొండ లక్ష్మీ నారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), మార్చి 14:మండలంలోని అమాని గుడిపాడులో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి ఎరిక్షన్ బాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైసీపీపై విరక్తి చెంది ప్రతి ఒక్కరూ టీడీపీలోకి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బయ్య, టీడీపీ మండల నాయకులు వెంగళ్‌రెడ్డి, మంత్రునాయక్, సత్యనారాయణ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



మార్కాపురంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 14: జనసేన నియోజకవర్గ కార్యాలయంలో జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు పి.శ్రీనివాసులు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసైనికులు సుబ్బిశెట్టి, దుగ్గి రామిరెడ్డి, ఎం.శీను, పి.రామకృష్ణ, వీరమహిళలు లక్ష్మీరాజ్యం, లక్ష్మీ, బాలాబాయ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆటోనగర్‌లో జనసేన పార్టీ ఆవిర్భావం నిర్వహించి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి సురేష్‌బాబు, ఆటోనగర్ జనసైనికులు పి.శ్రీనివాసులు, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : జనసేనా పార్టీ 11వ అవిర్భావ దినోత్సవం సందర్భంగా గిద్దలూరు నియోజక ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబు ఆధ్వర్యంలో బేస్తవారపేటలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సంక్షేమం, అభివృద్ధి కోసంటీడీపీ, బీజేపీతో కలసి ఉమ్మడిగా ఎన్నికల్లో పొత్తు తీసుకోవడం చాలా మంచి ఆలోచన అని అన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఈ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో లంకా నరశింహరావు, తాడిశెట్టి ప్రసాద్, మధుసుధన్‌రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి

- మలన్‌షావలిగా గుర్తింపు
- నెల్లూరు జిల్లాలో ఘటన



బేస్తవారపేట, మార్చి 14 : గిద్దలూరు డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న బేస్తవారపేట గ్రా మానికి చెందిన దూదెకుల మలన్‌షావలి(52) గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. గిద్దలూరు నుంచి చెన్నైకి బయలుదేరిన బస్సు జాతీ య రహదారిపై నెల్లూరు జిల్లాలో చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా సమీపంలో తెల్లవారుజామున సూమారు 3 గంటలకు ప్రమాదం జరిగింది. బస్సుకు ఉన్న ముందుచక్రం టైర్ పంచర్ కావడంతో జాతీయ రహదారి వెంబడి ఒక ప్రక్కకు బస్సును నిలిపి డ్రైవర్ మలన్‌షావలి టైరు మారుస్తున్నారు. ఈ క్రమంలో వెనుక చక్రం కింద బండరాళ్లు పెడుతుండగా, అటుగా తాడేపల్లిగూడెం నుండి చెన్నైకు వెళుతున్న కారు ఆగి ఉన్న బస్సును ఢీ కొట్టింది. కారులోని వారు వైద్యం కోసం చెన్నై వెళుతున్నారు. దీంతో బస్సు కింద ఉన్న డ్రైవర్ దూదెకుల మలన్‌షావలి అక్కడిక్కడే మృతిచెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి ఘటన స్థలంలోనే మృతి చెందారు. మలాన్‌షా వలి 15 ఏళ్లగా చెన్నై బస్‌రూట్‌లో డ్రైవర్‌గా వెళుతున్నాడు. దూదెకుల మలన్‌షావలి మృతితో ఆ ఇంట విషాదం నెలకొంది. రెండేళ్ల క్రితం డ్రైవర్ మలన్‌షావలి కుమారుడు సుహెల్ (20) గుంటూరులో మోటార్ బైక్‌పై వెళుతూ.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ ఘటన ఆ ఇంటిలో మరవకముందే రోడ్డు ఇంటి పెద్దను బలితీసుకొంది. దీంతో ఆ ఇంట విషాధచాయలు అలుముకున్నాయి.

జగన్ చేతగాని పాలనతో అప్పుల్లో ఆంధ్ర

» టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర » సైకిల్ ఎక్కిన వైసీపీ ఎంపీటీసీ సభ్యునితో సహా 100 మంది » వెలిగండ్లలో 75గురు

పామూరు, మార్చి 14 : ఒక్కచాన్స్‌తో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి పాలన చేతగాక రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి, ప్రజలపై ధరల భారాన్ని మోపారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ వైసీపీని వీడి సుమారు 100 మంది తన అనుచరులతో ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. పువ్వాడి రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ పట్టణ ఎన్నికల కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ముందుగా కందుకూరు, తూర్పు బైపాస్ రోడ్డు నుంచి టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు 300 బైకులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, మీ పిల్లల భవిష్యత్ కోసం చంద్రబాబు జనసేన, బీజేపీతో జగకట్టారన్నా రు. ఈ కూటమిని ప్రజలు ఆశీర్వదించాలని ఉగ్ర విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ సభ్యుడు వెంక టేష్, రియలర్టర్ రమణయ్య, నీరుకట్టు నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి 100 కుటుంబాలు సైకిల్ ఎక్కారు. వారందరికీ ఉగ్ర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్‌రెడ్డి పాలన, వైసీపీ నాయకుల విధానాలు నచ్చకే టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. డాక్టర్ ఉగ్ర నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్‌తోపాటు ఇద్దరు వార్డు సభ్యులు, మాజీ వార్డు మెంబర్ ఉన్నారు. అనంతరం ఉగ్ర, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, విశ్రాంత ఐఏఎస్ పిడుగు బాబూరావును గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ దశరథరాములు, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.హుసేన్‌రావు, రాష్ట్ర, జిల్లా, పట్టణ కమిటీ సభ్యులు ఏ ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, వైప్రసాద్‌రెడ్డి, ఆర్‌ఆర్ రఫి, షేక్ ఖాజారహంతుల్లా, ఏ.హరిబాబు, షేక్ గౌస్‌బాషా, పందిటి హరీష్, ఇర్రికోటిరెడ్డి, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.


వైసీపీ వీడి టీడీపీలో చేరిన వగ్గంపల్లి వాసులు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

వగ్గంపల్లి, తాతయ్యపల్లిలో చేరికలు

పామూరు మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో ఏలిక నారాయణ ఆధ్వర్యంలో 15 కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీ జయరామిరెడ్డి, ఆర్ రమణారెడ్డి, చావా సుబ్బారావు పాల్గొన్నారు. కాగ మండలంలోని బుక్కపురం గ్రామ పంచాయతీ తాతయ్యపల్లి గ్రామంలో కూడా 50 కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు.

వలసల జోరు

వైసీపీని వీడి టీడీపీలో చేరిన 75 కుటుంబాలు

వెలిగండ్ల : వెలిగండ్ల మండలంలో తెలుగుదేశం పార్టీలోకి జోరుగా వలసలు కొనసాగుతున్నాయి. వైసీపీకి చెందిన అనేక మంది నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. గురువారం మండలంలోని వెదుళ్లచెరువు పంచాయతీలో వైసీపీకి చెందిన 10 కుటుంబాలు, నర్సమాంబాపురం లో 15 కుటుంబాలు, మెగళ్లూరు పంచాయతీలో 50 కుటుంబాలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర సమక్షంలో సైకిలెక్కారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి ఉగ్ర ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. అందరూ ధైర్యంగా ముందుకు సాగి తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వర రెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, కర్నాటి వెంకట రెడ్డి, పల్నాటి పెద్ద కోటిరెడ్డి, కోటిరెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మౌలాలీ, అవుల మాలకొండా రెడ్డి, పల్నాటి బాలకోటి రెడ్డి, నరేంద్ర ముదిరాజ్, మజహర్, జిల్లా ఎస్సీసెల్ అధికార ప్రతినిధి సలోమన్ రాజు, కర్నాటి భాస్కర్ రెడ్డి, మీనిగ కాశయ్య, కారంపూడి వెంటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మెటాటి సుబ్బరెడ్డి, కేసరి రమణా రెడ్డి, గంజి రాజశేఖర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ అక్రమాలపై చర్యలు

» బాధ్యులను శిక్షించాలని ఉగ్ర డిమాండ్

» వెంటనే జగన్‌రెడ్డి రాజీనామా చేయాలి

ఏపీపీఎస్సీ గ్రూప్ మెయిన్స్‌లో అక్రమాలకు పాల్పడిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని శిక్షించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. డిప్యూటీ కలెక్టర్‌లు, డీఎస్పీ పోస్టులను జగన్‌రెడ్డి అండ్ కో సంతలో పశువులను అమ్మినట్లు రేటు కట్టి కోట్లాది రూపాయల కుంభకోణానికి పాల్పడినట్లు ఉగ్ర ఆరోపించారు. పువ్వాడి ఫంక్షన్ హాలులో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో తమకు అనుకూలమైన వ్యక్తులకు పోస్టులు రాకపోవడంతో 25 ఆర్డీవో పోస్టులను ఒక్కొక్కటీ రూ.2.50కోట్లకు, 25 డీఎస్పీ పోస్టులను ఒక్కొక్కటీ రూ.1.50కోట్లకు అమ్మేశారన్నారు. మన బిడ్డలను ఉన్నత ఉద్యోగుల కోసం కష్టపడి చదివిస్తుంటే వైసీపీ ఇంతటి నీచమైన పనికి దిగజారిందన్నారు. జగన్‌రెడ్డి అక్రమాలపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో మాన్యువల్ పద్ధతిలో మూల్యాంకనం చేయాలని 2021 అక్టోబర్‌లో తీర్పునివ్వడంతోపాటు 3 నెలల్లోపు ఫలితాలు ప్రకటించాలని ఆదేశించిందని తెలిపారు. ఇంతటి మోసాలకు పాల్పడిన ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్‌ఆర్ ఆంజనేయులు, చైర్మన్ గౌతమ్‌సవాంగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, జగన్‌రెడ్డి తక్షణమే పదవికి రాజానామా చేయాలని ఉగ్ర డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం


జెండాను ఎగురవేస్తున్న నాయకులు

దర్శి, మార్చి 14 : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ కార్యాలయంలో నాయకుడు దిరిశాల యేసురెడ్డి, జిల్లా ప్రోగ్రాం సభ్యుడు పసుపులేటి చిరంజీవి తదితరులు జెండాను ఆవిష్కరించారు. వచ్చే ఎన్నిక ల్లో టీడీపీ, జనసేన, బీజేపీ విజయం తథ్యమన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసమే జనసేన పార్టీ నిరంతరం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుప్పాల రుద్ర, ఉల్లి బ్రహ్మయ్య, సీహెచ్ కొండ య్య, తోటా రామారావు, ఎం.శేషయ్య, కే ప్రసాద్, నాగేంద్రప్రసాద్, కుప్పాల భూలక్ష్మి, కుప్పాల పాపారావు, ఎండీ షఫీఉల్లాఖాన్ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో మేలు


బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న శ్రేణులు

పీసీపల్లి, మార్చి14 : తెలుగుదేశం ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని టీడీపీ నాయకులు అన్నారు. కొత్తపల్లి గ్రామంలో గురువారం రాత్రి పార్టీ శ్రేణులతో కలిసి బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగిన పార్టీ నాయకులు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి పథకాలను వివరించారు. ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించి తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడుతుందని వారు అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ జెండా ఆవిష్కరణ

పామూరు, మార్చి 14 : పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద తెలుగు మ హిళల ఆధ్వర్యంలో టీడీపీ జెండాను ఉగ్ర గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి కే సుభాషిణి, ఎం.రమాదేవి, ఏ రమణమ్మ, షేక్ మున్ని, జే రమణమ్మ పాల్గొన్నారు.

పామూరు మండలంలో వైసీపీ బలమైన నాయకులను టీడీపీ వైపు తిప్పుకోవడంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర సఫలీకృతులవు తు న్నారు. ఇటీవల వైసీపీలో కీలకంగా వ్యవహరించిన పామూరు మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దరిశి రాము, నుచ్చుపొద ఉప సర్పంచ్ గొళ్ల వెంకటేశ్వర్లు, పట్టణ రెండవ ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ టీడీపీలో ఇప్పటికే చేరారు. తాజాగా వైసీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు, ముస్లిం మైనారిటీ వర్గాల్లో కీలకమైన నాయకుడు షేక్ షంషూర్‌ని కలిసి ముచ్చటించారు.

పంట రుణాలు రద్దు చేయాలని రైతుల ధర్నా

కనిగిరి, మార్చి 14: రైతుల పంట రుణాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ స్టేట్ బ్యాంకు ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం రైతులు ధర్నా చేశారు. ఏపీ రైతు సంఘం నియోజకవర్గ సమితి అధ్యక్షుడు గుజ్జుల బాలిరెడ్డి మాట్లాడుతూ దేశ్యాప్తంగా రైతులు పంట సాగుకు తీసకున్న రుణాలను కేంద్రం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించాలని, వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేసి ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వితనిపత్రాన్ని స్టేట్‌బ్యాంకు మేనేజర్ అప్పారావుకు అందచేశారు. కార్యక్రమంలో టీకేఎంయూ నాయకులు జీపీరామారావు, పందిటి మోహన్, ఏఐటీయూసీ నాయకులు పవన్‌కుమార్, ఆచారి, సుజాత, కుమారి, నారాయణమ్మ, అంకమ్మ, సునీత, యోహాను పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

దర్శి, మార్చి 14 : వాహన చోధకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆర్టీసీ పొదిలి డీఎం జే సుందరరావు సూచించారు. దర్శి-కురిచేడు రోడ్డులో గురువారం వారు ఆటోలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఆర్టీసీ, రవాణాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి సభకు తరలిరండి

బాలాజీ పిలుపు

దర్శి, మార్చి 14 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నిర్వహిస్తున్న బహిరంగ సభకు దర్శి నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో తరలిరావాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ కోరారు. టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఈనెల 17వ తేదీన చిలకలూరిపేట సమీపంలో జరిగే బహిరంగ సభకు ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పాల్గొంటారని చెప్పారు. అన్ని గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీ జేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీలో పదవులు, టికెట్ల కేటాయింపుపై చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యమని స్పష్టం చేశారు. ఆయన ఏ బాధ్యత ఎవరికి కట్టబెట్టినా అందుకు కట్టుబడి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పార్టీ నిర్ణయాన్ని దిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రవికుమార్ మాట్లాడుతూ తనకు కట్టబెట్టిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిపోయిందని విమర్శించా రు.


మాట్లాడుతున్న నూకసాని

ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వటానికి చేతకాలేదని నిరంతరం కోర్టు మొట్టికాయలు వేసినా సిగ్గులేదన్నారు. జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మంచౌదరి. శాసనాల వీరబ్రహ్మం, దర్శి, దొనకొండ, కురిచేడు, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల పార్టీ అధ్యక్షులు చిట్టే వెంకటేశ్వర్లు, నాగులపాటి శివకోటేశ్వరరావు, పీ నెమలయ్య, బొమ్మిరెడ్డి ఒబుల్‌రెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, దర్శి నగర పంచాయితీ చైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, మాజీ ఎంపీపీలు మందలపు వెంకటరావు, ఫణిదపు వెంకటరామయ్య పాల్గొన్నారు.



పశుపోషకులకు మెరుగైన సేవలు

తాళ్లూరు, మార్చి 14 : పశు సంవర్ధక శాఖ ద్వారా పశుపోషకులకు మెరుగైన సేవలను అం దించాలని రాష్ట్ర సంచాలకులు డాక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. తూర్పుగంగవరం పశువైద్యకేంద్రంలో దర్శి, ముండ్లమూ రు, తాళ్లూరు వీహెచ్‌ఏలకు గురువారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ బేబీ రాణి, ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌బాబు, సహాయ సంచాలకులు డాక్టర్ పురుషోత్తం రాజు, తూర్పు గంగవరం పశువైద్యాధికారి రాంబాబు పాల్గొన్నారు.



ఆటో నడుపుతూ గుండెపోటు

- కింద పడి డ్రైవర్ మృతి
- కూల్‌డ్రింక్ షాప్‌లోకి దూసుకెళ్లిన వాహనం


యేసేబు

దొనకొండ, మార్చి 14 : ఆటో నడుపుతున్న డ్రైవర్ అకస్మాత్తుగా గుండెపోటుకు గురై ఆటోలో నుంచి కిందపడి మృతి చెందారు. డ్రైవర్ లేక ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కూల్‌డ్రింక్ షాప్‌లోకి దూసికెళ్లిన సంఘటన దొనకొండ సమీపంలోని అడ్డరోడ్డు వద్దగల పెట్రోల్ బంక్ వద్ద గురువారం జరిగింది. దర్శి మండలం చందలూరు ఎస్సీ కాలనీకి చెందిన రాయల యేసేబు(40) అతని బంధువైన దానియేలు ఇరువురూ లగేజీ ఆటోలో కుంట వద్ద గొర్రెలను ఎక్కించుకొని తిరిగి చందలూరుకు వెళ్తున్నారు. యేసేబు ఆటో నడుపుతుండగా దానియేలు ట్రక్కులో గొర్రెల వద్ద కూర్చున్నాడు. ఆటో దొనకొండ అడ్డరోడ్డు వద్దకు చేరుకునే సరికి డ్రైవింగ్ చేస్తున్న యేసేబు అకస్మాత్తుగా గుండెపోటుకు గురై ఆటోలో నుంచి కిందపడ్డారు. డ్రైవర్ లేని ఆటో రోడ్డు పక్కనే ఉన్న పిచ్చయ్య కూల్‌డ్రింక్స్ షాప్‌లోకి దూసుకెళ్లగా షాప్ ముందు వేసిన పందిరిలో నిలపి ఉన్న మోటార్‌సైకిల్, పందిరికి వేసిన ఇనుప పైపును ఆనుకొని ఆటో నిలచింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని కూల్‌డ్రింక్ షాప్ నిర్వాహకులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. రోడ్డుమీద పడిన డ్రైవర్‌ను పరిశీలించగా మృతిచెందినట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై సంపత్‌కుమార్ తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ యేసేబుకు భార్య నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి


సునాథ్ (ఫైల్)

ముండ్లమూరు, మార్చి 14 : రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. మండలంలోని వేముల పంచాయతీ పరిధిలోని రాజగోపాలరెడ్డినగర్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎల్ఎల్ఆర్ సునాథ్(48) గురువారం విధులు ముగించుకొని అద్దంకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. కమ్మవారిపాలెంలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయుడు సుబ్బారావు తన ద్విచక్ర వాహనంపై వస్తూ మార్గమధ్యంలో సునాథ్‌ను ఎక్కించుకున్నారు. ఉల్లగల్లు సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా ఉల్లగల్లు నుంచి వేముల వెళ్తున్న పంది శ్రీను ద్విచక్రవాహనం వెళ్తూ హెచ్‌ఎం సుబ్బారావు వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో వీరి వాహనం రోడ్డపక్కగా పడింది. ఈ ప్రమాదంలో సునాథ్ తలకు గాయమై మృతి చెందగా, సుబ్బారావుకు తీవ్రగాయ్యాయ్యాయి. సునాథ్ భార్య సుభాషిణి కూడా అద్దంకి మం డలంలో ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. ఆ యనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని ఎంఈవో వెంకటేశ్వర్లు, జే సుబ్బారావు, పలువురు ఉపాధ్యాయులు సంఘటనా స్థలానికి వెళ్లారు. ఏఎస్ఐ బీ పవన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభు త్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.


క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు,ప్రజాప్రతినిధులు

క్రీడాకారులకు అభినందనలు

తాళ్లూరు, మార్చి 14 : జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనపరిచిన బొద్దికూరపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు గురువారం అభినందించారు. హైస్కూల్ హెచ్‌ఎం పీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనపరిచిన 25 మంది క్రీడాకారులను, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనపరిచిన 3గ్గురు క్రీడాకారులను, క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ రవి ప్రసాద్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మందాశ్యామ్‌సన్, ఉప సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు వి.ఆంజనేయులు, హైస్కూల్ ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి

దర్శి, మార్చి 14 : ఎన్నికల విధులను అధికారులు నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో నిబంధనలకు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. నిర్లక్ష్యవైఖరి, పక్షపాత వైఖరి అవలంబించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఈఆర్‌వో ఎంవీఎస్ లోకేశ్వరరావు, డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారుల దృష్టికి లేదా తమ దృష్టికి తేవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సమశ్యాత్మక గ్రామాలను గుర్తించి ఎలాంటి అవాంఛనీ య సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. దర్శిలో గురువారం రాత్రి విలేకర్లతో మాట్లాడారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

దొనకొండ, మార్చి 14 : కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి నూతన అడ్మిషన్ల పొందేందుకు ప్రభుత్వం అవకాశం క ల్పించిందని పాఠశాల ప్రత్యేకాధికారి జీ మమత వివరించారు. 6వ తరగతికి 40 అడ్మిషన్లు, ఇంటర్ మొదటి సంవత్సరంకు 40 అడ్మిషన్లు, ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంకు 30 అడ్మిషన్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత, ఆశక్తిగల విద్యార్థులు నేటి నుంచి ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

పశువుల కొష్టాలు ఆహుతి

- 14 గొర్రె పిల్లలు మృతి
- లబోదిబోమంటున్న బాధితులు


తగులబడుతున్న కొష్టాలు


కాలిపోయిన గొర్రె పిల్లలు

ముండ్లమూరు, మార్చి 14 : మండలంలోని బొప్పూడివారిపాలెం గ్రామానికి చెందిన తిరుమల పరమేశు, కొనికి వెంకటేశ్వర్లుకు చెందిన రెండు పశువుల కొష్టాలు గురువారం ఉదయం ప్రమాద వశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి. తోట గంజయ్య తన పశువుల పాకలో సుబాబులు కర్రకు నిప్పు పెట్టగా గాలికి నిప్పు రవ్వలు ఎగిరి కొష్టాలుపై పడి అగ్నిప్రమాదం సంభవించింది. కొనికి వెంకటేశ్వర్లుకు చెందిన పశువుల కొష్టంలో 14 గొర్రె పిల్లలు సజీవ దహనమయ్యాయి. దీంతో బాధితుడు వెంకటేశ్వర్లుకు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లింది. దీంతో బాధితుడు లబోదిబో మంటున్నాడు. వివరాల్లోకి వెళితే గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన తోట గంగయ్య తన పశువుల కొష్టంలో ఉన్న జామాయిల్ కంపను తగులబెట్టారు. గాలికి మంటలు చెలరేగి సమీపంలో ఉన్న తిరుమల పరమేశు, కొనికి వెంకటేశ్వర్లుకు చెందిన పశువుల కొష్టాలకు మంటలు అంటుకున్నాయి. గాలి ఉధృతంగా వీయడంతో కాలనీ వాసులు మంటలను అదుపు చేయలేక పోయారు. రెండు పశువుల కొష్టాలు పూర్తిగా కాలిపోయాయి. దీంతో వెంకటేశ్వర్లలకు చెందిన గొర్రె పిల్లలు మంటల్లో చిక్కుకొని పూర్తిగా సజీవ దహనమయ్యాయి. చని పోయిన గొర్రె పిల్లలను చూసి యజమాని వెంకటేశ్వర్లు కన్నీరు మున్నీరుగా విలపించారు.

65 మందికి వైద్య పరీక్షలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముండ్లమూరు, మార్చి 14 : మండలంలోని నాయుడుపాలెంలో చికున్ గున్యాతో పలువురు మంచం పట్టిన విషయం గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రచురించింది. దీంతో స్పందించిన మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు గ్రామంలో ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు రెండు వందల ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించారు. వీరిలో 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధ పడుతున్న వారికి ఇళ్ల వద్దకు వెళ్లి సిలేన్లు కట్టారు. ప్రధానంగా జలుబు, దగ్గు, కీళ్ల నొప్పులు, నడుముల నొప్పులతో బాధ పడుతున్న వారిని గుర్తించి వారికి మందులను పంపిణీ చేశారు. గ్రామంలోని వైద్య సిబ్బంది పలువురికి రక్త నమూనా పరీక్షలు సేకరించారు. సబ్ యూనిట్ మలేరియా అధికారి బసవారెడ్డి ఇంటిం టి కి వెళ్లి మలేరియా పరీక్ష లు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వేసవిలో తీసుకోవల్సిన జాగ్రత్త లు రోగులకు వివరించారు. కాచి చల్లార్చి న నీటిని తాగాలని తెలియజేశారు. ఎ బేట్ ను పిచికారీ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సీహెచ్ ప్రవీణ్ కు మార్, సూపర్ వైజర్ నాగేశ్వరరావు, హెల్త్ ఎ డ్యుకేటర్ అప్పలరాజు, సిబ్బంది, ఈవోఆర్‌డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి కే సురేష్‌రెడ్డి ఉన్నారు.

నాయుడుపాలెంలో పారిశుధ్యం పనులు

మండలంలోని నాయుడుపాలెంలో పెద్ద ఎత్తున గున్యా జ్వరాలతో ప్రజలు బాధ పడుతుండటంతో ముందస్తు చర్యగా గ్రామంలో పంచాయతీ అధికారులు పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టారు. ఒక వైపు వైద్య ఆరోగ్య శిబిరం జరుగుతుండగా మ రో వైపు పలు వీధుల్లో బ్లీచింగ్, ఎబేట్‌ను పిచి యారీ చేశారు. ఇళ్ల సమీపంలోని నెయ్యి దిబ్బ లు ఉండరాదని, వర్థ పదార్థాలను దూరంగా వేయాలని పంచాయతీ విస్తరణ అధికారి జీ శ్రీదేవి కోరారు. ఆమె గ్రామాన్ని సందర్శించి కార్యదర్శి కే సురేష్‌రెడ్డికి పలు సూచనలు చే శారు. జ్వరాలు అదుపులోకి వచ్చేవరకూ వైద్యశిబిరం, పారిశుధ్య చర్యలు ఉంటాయన్నారు.


రోగికి వైద్య సేవలందిస్తున్న సిబ్బంది



ఉమ్మడిగా.. దూకుడు

- రెండో జాబితాలో నలుగురు పేర్లు
- సంబరాల్లో మునిగిన తెలుగు తమ్ముళ్లు
- పల్నాడులో నరసరావుపేట, బాపట్లలో చీరాల పెండింగ్
- అధికారికంగా అభ్యర్థులను ప్రకటించని వైసీపీ అధిష్ఠానం
- టీడీపీ తొలిజాబితాలో ప్రకటించిన అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే రాజకీయ వేడి రగులుతుండగా ఉమ్మడి అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ దూకుడు పెంచుతోంది. ఇప్పటికే స్పష్టత వచ్చిన స్థానాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇక వైసీపీలో అధికారికంగా అభ్యర్థులు పేర్లు ప్రకటించలేదు. పైగా అసమ్మతితో పలు నియోజకవర్గాలు శ్రేణులు రగలిపోతున్నాయి. సమరోత్సాహంతో టీడీపీ శ్రేణులు దూసుకెళ్తోండగా, అభ్యర్థులపై అయోమయం, అసమ్మతితో ఫ్యాన్ పార్టీలో నిస్తేజం నెలకొంది. టీడీపీ, జనసేన అభ్యర్థులు ఖరారు కావడంతో ఆయా నియోజకవర్గాలో తెలుగు తమ్ముళ్లు, జనసైనికుల్లో సంబరాల్లో మునిగి తేలుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల లోక్‌సభ పరిధిలోకి వచ్చే మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి 20 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు టీడీపీ, జనసేన పార్టీల రెండు జాబితాలను విడుదల చేయగా అందులో 18 మంది అభ్యర్థులను ఖరారు చేశారు. గురువారం చంద్రబాబు ప్రకటించిన రెండో జాబితాలో పల్నాడు జిల్లాకు సంబంధించి పెదకూరపాడు, గురజాల, గుంటూరు జిల్లాకు చెందిన గుంటూరు తూర్పు, పశ్చిమ స్థానాలు ఉన్నాయి. ఆది నుంచి ఉత్కంఠ రేపుతున్న గుంటూరు నగర పరిధిలోని రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసే టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థులు ఎట్టకేలకు ఖరారయ్యారు. దీంతో గుంటూరు లోక్‌సభ పరిధిలోని అన్ని స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తి అయినట్లైంది. తాజాగా విడుదల చేసిన రెండో జాబితాలో గుంటూరు తూర్పు అభ్యర్థిగా ఎండీ నసీర్ అహ్మద్ పేరు ఖరారు చేశారు. ఇక పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి ఎంపిక విషయంలో కొద్ది రోజులుగా సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. వాస్తవానికి ఈ సీటు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కోవెలమూడి నానీకి ఇవ్వాల్సి ఉంది. అయితే ఊహించని విధంగా మంత్రి విడదల రజిని వైసీపీ అభ్యర్థిగా గుంటూరు పశ్చిమకు వలస రావడంతో నానీ అదృష్టం తారుమారైంది. రజినీది బీసీ సామాజికవర్గం కావడంతో అదే సామాజికవర్గం మహిళను బరిలోకి దించాలని టీడీపీ అధిష్ఠానం భావించింది. దీంతో బీసీ సామాజికవర్గానికి చెందిన పిడుగురాళ్ల మాధవి(రజక)ని అదృష్టం వరించింది. ఆమె భర్త, రియల్ ఎస్టేట్ వ్యాపారి గళ్లా రామచంద్రరావు(కమ్మ) కున్న ఆర్థిక అంగ బలాలు ఆమెకు కలిసొచ్చాయి. శ్రీ భ్రమర టౌన్ షిప్స్, వికాస్ హాస్పటల్స్ ఎండీగా కొనసాగుతున్న రామచంద్రరావుకు గుంటూరులో ఉన్న పరిచయాలు కూడా మాధవి అభ్యర్థిత్వం వైపు టీడీపీ అధిష్ఠానం మొగ్గుచూపేలా చేశాయి. గురజాల నియోజకవర్గాలకు పార్టీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు, పెదకూరపాడుకు బాష్యం ప్రవీణ్ పేర్లను ప్రకటించింది.

దూసుకెళ్తోన్న అభ్యర్థులు

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే 20 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి తొలివిడతలో 14 మంది అభ్యర్థులను ఖరారు చేశారు. వారి పేర్లను చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు గతంలోనే ప్రకటించారు. దీంతో ఆయా అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తోన్నారు. మంగళగిరి నుంచి నారా లోకేశ్ పేరు తొలి జాబితాలోనే ప్రకటించగా ఆయన ఇప్పటికే విజయపథం వైపు దూసుకుపోతున్నారు. పొన్నూరు నుంచి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ వరుసగా ఏడో పర్యాయం ఎన్నికల బరిలోకి దిగి ఎన్నికల శంఖారావం పూరించారు. ఇప్పటి వరకు ఐదు విజయాలను చవిచూసిన నరేంద్ర ఆరో పర్యాయం కూడా గెలిచి చట్టసభలోకి అడుగుపెట్టాలనే సంకల్పంతో ఎన్నికల యుద్ధానికి సన్నద్ధమయ్యారు. ఎస్సీ నియోజకవర్గాలైన తాడికొండ, ప్రత్తిపాడు నుంచి టీ శ్రావణ్‌కుమార్, బీ రామాంజనేయులు బరిలోకి దిగి ప్రచార పర్వంలో మునిగిపోయారు. తొలి జాబితాలోనే బాపట్ల లోక్‌సభ పరిధిలోకి వచ్చే ఐదు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి పోటీలో ఉండే అభ్యర్థులను టీడీపీ ప్రకటించగా ఆయా అభ్యర్థులు ప్రచార పర్వంలో ఉన్నారు. పర్చూరు నుంచి ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు. రేపల్లె నుంచి అనగాని సత్యప్రసాద్, అద్దంకిలో గొట్టిపాటి రవికుమార్, వేమూరు నుంచి నక్కా ఆనంద్‌బాబు, బాపట్ల నుంచి తొలిసారి వేగేశన నరేంద్రవర్మ ఇంటింటి ప్రచారంలో అభ్యర్థులు దూసుకుపోతున్నారు. పల్నాడు జిల్లాకు సంబంధించి సీనియర్ నేతలకు టీడీపీ అధిష్ఠానం అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యం ఇచ్చింది. వినుకొండకు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, చిలకలూరిపేట ప్రత్తిపాటి పుల్లారావు, సత్తెనపల్లి కన్నా లక్ష్మీనారాయణ, మాచర్ల జూలకంటి బ్రహ్మారెడ్డిల పేర్లు తొలిజాబితాలోనే అధిష్ఠానం ఖరారు చేసిన విషయం తెలిసిందే. వారు ప్రచారంలో నేరుగా ఓటర్లను కలుస్తున్నారు.


యరపతినేని శ్రీనివాసరావు
గురజాల


జీవీ ఆంజనేయులు
వినుకొండ


ప్రత్తిపాటి పుల్లారావు
చిలకలూరిపేట


కన్నా లక్ష్మీనారాయణ
సత్తెనపల్లి


జూలకంటి బ్రహ్మారెడ్డి
మాచర్ల


భాష్యం ప్రవీణ్, పెదకూరపాడు


అనగాని సత్యప్రసాద్(రేపల్లె), వేగేశన నరేంద్రవర్మ(బాపట్ల), ఏలూరి సాంబశివరావు (పర్చూరు), గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి), నక్కా ఆనందబాబు (వేమూరు)


నారా లోకేశ్, మంగళగిరి


నసీర్ అహ్మద్, గుంటూరు-1


పి.మాధవి, గుంటూరు-2


టి.శ్రావణ్‌కుమార్, తాడికొండ


డి.నరేంద్రకుమార్, పొన్నూరు


ఎన్.మనోహర్, తెనాలి


రామాంజనేయులు, ప్రత్తిపాడు

తొలిసారి.. భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు టీడీపీ అభ్యర్థిగా తుళ్లూరు మండలం పెద పరిమి గ్రామానికి చెందిన భాష్యం ప్రవీణ్ బరిలోకి దిగనున్నారు. వ్యవసాయ కుటుంబం నేపథ్యం కలిగిన లావణ్య, వెంకటరావుల ప్రథమ సంతానం ప్రవీణ్. టీడీపీలో క్రియాశీలకంగా ఉండే ప్రవీణ్‌కు తొలిసారిగా సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని చంద్రబాబు కల్పించారు. తన పేరును అధిష్ఠానం ప్రకటించగానే ప్రవీణ్ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను కలసి సహాయ సహకారాలను కోరారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి ప్రవీణ్‌కు మద్దతు తెలియజేసి ఆయన్ను సత్కరించి అభినందనలు తెలిపారు. కొంతకాలంగా టిక్కెట్ వస్తుందని భావించిన భాష్యం ప్రవీణ్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని క్యాడర్‌ను పరిచయం చేసుకున్నారు. తొలుత ప్రవీణ్ చిలకలూరిపేట నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ పెదకూరపాడుకు అయనను అధిష్ఠానం పంపింది.

ఏడో సారి యరపతినేని

గురజాల నుంచి యరపతినేని శ్రీనివాసరావు ఏడో సారి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగనున్నారు. యరపతినేని 1994లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999, 2004 ఎన్నికల్లో ఓటమి పాలవగా 2009, 2014 ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. దాచేపల్లిలో ఇటీవల అధినేత చంద్రబాబు సభను విజయవంతం చేసి సత్తా చాటారు. దీంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

రెండో సారి నసీర్

మొహమ్మద్ నసీర్ గుంటూరు తూర్పు నుంచి రెండో సారి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. 2019లో పోటీ చేసిన ఆయన స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అయినా పార్టీ పటిష్టతే ధ్యేయంగా నియోజకవర్గంలో పనిచేశారు. పార్టీ కార్యకలాపాలతోపాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేశారు. నియోజకవర్గ పరిధిలో అనేక రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య సహాయం అందజేశారు. ఇక్కడి నుంచి తొలుత కొత్త అభ్యర్థిని దించాలని భావించినప్పటికీ నసీర్ కంటే మెరుగైన అభ్యర్థి దొరకలేదు. దీంతో ఆయన అభ్యర్థిత్వానికే పార్టీ అధినేత చంద్రబాబు ఆమోదం తెలిపారు. గత ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ఈ ఐదేళ్ళపాటు కష్టకాలంలో పార్టీకి అండగా నిలవటం నసీర్‌కు ప్లస్ పాయింట్ అయింది.

సేవారంగం నుంచి రాజకీయాల్లోకి మాధవి

పొన్నూరు నియోజకవర్గంలోని ములుకుదురుకు చెందిన పిడుగురాళ్ల మాధవి బీసీ సామాజికవర్గానికి చెందిన విద్యావంతుల కుటుంబం నుంచి వచ్చారు. ఎంసీఏ పూర్తి చేసి సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమయ్యారు. అనంతరం కొంతకాలం బోధనా వృత్తిలో కొనసాగారు. ఆమె తండ్రి కేంద్ర ప్రభుత్వ సర్వీసులో పనిచేశారు. ఆయన స్ఫూర్తితో మాధవికి ప్రజాసేవపై ఆసక్తిగా వుండేది. శ్రీభ్రమరలో చారిటీ ట్రస్టును స్థాపించి పలు సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

సమ్మతి.. అసమ్మతి

పల్నాడు జిల్లాలో అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ శ్రేణుల్లో సమరోత్సాహం నెలకొంది. టీడీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అయితే అందుకు విరుద్ధంగా వైసీపీలో సమన్వయకర్తల పేరిట జరుగుతున్న తంతుతో అసమ్మతి రేగుతోంది. వైసీపీ అధినేత జగన్ వద్ద పంచాయతీ జరిగినా అసమ్మతి వర్గాలు శాంతించడంలేదు. పల్నాడు జిల్లాలో ఆరుగురు అభ్యర్థులను ప్రకటించగా, వైసీపీ అధికారికంగా ఒక్క అభ్యర్థిని కూడా ప్రకటించలేదు. చిలకలూరిపేట నియోజకవర్గంలో వైసీపీ ఇప్పటికే ఇద్దరు సమన్వయకర్తలను మార్చింది. ఇక్కడ వైసీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. కొత్తగా నియమితులైన గుంటూరు మేయర్ కావేటి మనోహర్‌నాయుడును సమన్వయకర్తగా నియమించడాన్ని వైసీపీ క్యాడర్ వ్యతిరేకిస్తోంది. ఇక నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో కూడా వైసీపీలో అసమ్మతి తారాస్థాయికి చేరింది. ఈ రెండు నియోజకవర్గాలకు సంబంధించి సీఎం జగన్ చెప్పినా అసమ్మతి నేతలు మెట్టు దిగిరాలేదని తెలుస్తోంది.

నరసరావుపేట, చీరాలపై ఉత్కంఠ

బాపట్ల జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఒక్క చీరాల మాత్రమే పెండింగ్‌లో ఉంది. గురువారం విడుదల చేసిన రెండోజాబితాలో చీరాలతో పాటు పల్నాడు జిల్లా నరసరావుపేటకు చోటు దక్కలేదు. దీంతో ఈ రెండు సీట్ల విషయంలో టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. నరసరావుపేట అభ్యర్థి విషయంలో టీడీపీ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేరుతో ఐవీఆర్‌ఎస్ సర్వే నిర్వహించింది. అయినా అభ్యర్థి విషయంలో అధిష్ఠానం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

బొప్పూడి సభ.. భారీగా సన్నాహాలు

- ఏర్పాట్లపై ఉమ్మడిగా కసరత్తు
- శరవేగంగా సభా వేదిక పనులు
- భద్రతా చర్యలపై ఎస్పీజీ బృందం సమీక్ష


చిలకలూరిపేట, మార్చి 14: టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు ఖరారు అయిన తర్వాత తొలిసారి చిలకలూరిపేట మండలం బొప్పూడి వేదికగా 17వ తేదీ ఆదివారం జరిగే బహిరంగ సభకు భారీగా సన్నాహాలు జరుగుతున్నాయి. సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరుకానున్న నేపథ్యంలో ఎస్పీజీ బృందం రంగంలోకి దిగింది. పటిష్ఠమైన బందోబస్తుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. భారీగా భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. వేదిక వద్ద ఏర్పాట్లను ఎస్పీజీ బృందం గురువారం పరిశీలించింది. భద్రతా చర్యలపై కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డిలతో ఎస్పీజీ బృందం సమీక్షించింది. టీడీపీ నేతల నుంచి సభా ప్రాంగణానికి సంబంధించిన వివరాలను ఎస్పీజీ అధికారులు తీసుకున్నారు. ఉమ్మడి సభ వేదికగా ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఈ క్రమంలో సభను విజయవంతం చేసేందుకు మూడు పార్టీల నాయకులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. దాదాపు 15 లక్షల మంది సభకు హాజరయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. బొప్పుడి వద్ద జాతీయ రహదారికి అనుకుని ఉన్న 200 ఎకరాల్లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సభా వేదిక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు రోజులే సమయం ఉండటంతో యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఎక్కువగా జనసమీకరణ చేయాలని నేతలు నిర్ణయించి ఆ మేరకు ప్రణాళికలు రూపొందించారు. సభకు హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగని రీతిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. హెలికాప్టర్లలో రానున్న ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కోసం ప్రత్యేకంగా హెలిప్యాడ్‌లను సిద్ధం చేస్తున్నారు. ఏర్పాట్లను మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పర్యవేక్షిస్తున్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రామారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితర టీడీపీ నేతలు పరిశీలించారు.


బందోబస్తుపై టీడీపీ నేతలతో చర్చిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీజీ అధికారులు


సభావేదిక నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

కడవకుదురు శాండ్ ఫీల్డ్స్


- రైల్వేట్రాక్ సమీపంలో యథేచ్ఛగా తవ్వకాలు
- ఇసుక దిబ్బలు మాయమవుతున్నా పట్టని అధికారులు


ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వకాలు, టిప్పర్లతో రవాణా చేస్తున్న దృశ్యం

చీరాల, మార్చి 14: ఎక్కడో మారుమూలన కాదు.. చినగంజాం, కడవ కుదురు మధ్య రైల్వేట్రాక్ సమీపంలో ఆర్‌వోబీ పక్కన ఇసుక అక్రమతవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అటుగా రాకపోకలు సాగించే వారందరూ ఈ అక్రమతవ్వకాలను చూసి విస్తుపోతున్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఆ ప్రాంతానికి కేఎస్ఎఫ్(కడవకుదురు శాండ్ ఫీల్డ్స్) అని పేరు కూడా పెట్టారు. ఇంత జరుగుతున్నా అధికారులకు మాత్రం అక్కడ జరుగుతున్న ఇసుక తవ్వకాలు కనిపించడం లేదు. ఇసుక అక్రమ తవ్వకాలతో కొండలను తలపించే ఇసుక దిబ్బలు కనుమరుగవుతున్నాయి. భారీ గోతులు ఏర్పడుతున్నాయి. ఎన్‌జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) ఉత్తర్వులు బేఖాతరు చేస్తూ ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు, భారీ స్థాయిలో రవాణా జరుగుతోంది. వీటికి సంబంధించి ఎవరన్నా ప్రశ్నిస్తే మైనింగ్, ఎస్ఈబీ(సెబ్), పోలీస్, రెవెన్యూ అధికారులు పొంతనలేని సమాధానాలు చెప్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఒకవేళ తవ్వకాలు, రవాణాకు అనుమతులు ఉంటే అధికారులు బహిరంగ ప్రకటన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విజిలెన్స్ అధికారుల హల్‌చల్


సంతమాగులూరు మండలం గురిజేపల్లి వద్ద కామేపల్లి ఎక్స్‌పోర్ట్స్‌లో తనిఖీలకు వచ్చి మూతవేసి ఉండటంతో బయట ఉన్న విజిలెన్స్ అధికారులు


క్వారీలు పని చేయటం లేదని అంటించిన నోటీస్

బల్లికురవ, మార్చి 14: బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల పరిధిలో వందల సంఖ్యలో ఫ్యాక్టరీలు, పదుల సంఖ్యలో గ్రానైట్ క్వారీలు పనిచేస్తున్నాయి. అయినా విజిలెన్స్ అధికారులు వాటి జోలికి వెళ్లలేదు. టీడీపీ టీడీపీ సానుభూతి పరుడు, అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్ సమీప బంధువు అయిన కామేపల్లి లక్ష్మీప్రసాద్ నిర్వహిస్తున్న గ్రానైట్ ఫ్యాక్ట రీలు, క్వారీలే లక్ష్యంగా విజిలెన్స్ అధికారులు తనిఖీలతో హల్‌చల్ చేస్తున్నారు. నష్టాలతో మూసివేసి ఉన్న లక్ష్మీప్రసాద్ క్వారీల్లో తనిఖీలు చేసి, ఎలాగైనా జరిమానాలు విధించా లని విజిలెన్స్ అధికారులు శత విధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం గురిజేపల్లి, మల్లాయపాలెం గ్రామాల పరిధిలోని లక్ష్మీప్రసాద్‌కు చెందిన కామేపల్లి ఎక్స్‌పోర్ట్స్, సాయిలక్ష్మీ, సామ్రాజ్యం గ్రానైట్ క్వారీలలో తనిఖీలకు కృష్ణా జిల్లా విజిలెన్స్ ఏడీ ప్రతాప్‌రెడ్డి 20 మంది సిబ్బందితో పాటు సంతమాగులూరు సీఐ నరసింహారావుతో కలిసి నాలుగు కార్లలో వచ్చారు. నష్టాలతో పనులు నిలిపివేసి మూసివేసిన ఆయా క్వారీల వద్దకు వచ్చిన అధికారులు లోపలికి వెళ్లి తనిఖీలకు సిద్ధమయ్యారు. అయితే లోపలికి వెళ్లే వీలులేక పోవడంతో అక్కడ ఉన్న నోటీస్ బోర్డును ఫొటోలు తీసుకుని వెనుదిరిగారు. నాలుగు రోజుల నుంచి ఇదేమాదిరిగా అధికారులు ఒక వ్యక్తికి చెందిన క్వారీల చుట్టూ తిరగడం ఏమిటని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బంధువు, మచిలీపట్నం ఎంపీ బాలశౌరితో లక్ష్మీప్రసాద్‌కు ఉన్న సంబంధాల నేపథ్యంలో ఆయనను టార్గెట్ చేశారని పలువురు భావిస్తున్నారు. తనకు ఎవరితో సంబంధాలు లేవని క్వారీ యజమాని అంటున్నా ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అధికారులు హడావుడి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.


ఈబీసీ నేస్తం పథకం కింద మహిళలకు చెక్కును అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు

పేద మహిళలకు అండగా ప్రభుత్వం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14 : కులమతాలకు అతీతంగా పేద మహిళలందరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ఈబీసీ నేస్తం పథకంలో భాగంగా మూడో విడత అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాలో సీఎం గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లిలో బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వెంకాయమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అగ్రవర్ణాలకు చెందిన పేద మహిళలు 38,001 మందికి రూ.57.11 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, మేయర్ గంగాడ సుజాత, మెప్మా పీడీ రవికుమార్, సచివాలయాల నోడల్ ఆఫీసర్ ఉషారాణి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులు నడపాలి

ఒంగోలు(విద్య), మార్చి 14: జిల్లాలో ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి కోరారు. రవాణా సౌకర్యం లేని కారణంగా ఏ విద్యార్థి నష్టపోకూడదన్నారు. టెన్త్ పరీక్షల ఏర్పాట్లు, విద్యార్థులకు రవాణా సౌకర్యాలు తదితర అంశాలను ఆమె గురువారం సమీక్షించారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి వై.వెంకట్రావు, ఎంఈఓ పి.సరస్వతి, ఆర్టీసీ మేనేజర్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ మాధురి, బీసీ సంక్షేమశాఖ అధికారి అంజలా, జగన్నాథం, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాస్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు ప్రభుత్వ హైస్కూల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

ఎన్నికలు సజావుగా జరిగేలా పటిష్ట చర్యలు

● కలెక్టర్ దినేష్‌కుమార్

కనిగిరి, మార్చి 14: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ సూచించారు. తొలుత ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేకంగా ఎన్నికల సామగ్రి కోసం ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులు, నోడల్, సెక్టార్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈసీ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. అనంతరం మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితా కీలకమని, వివిధ రాజకీయ పార్టీల నుంచి, ప్రజల నుంచి ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులను నియోజకవర్గాల వారీగా నిశితంగా పరిశీలించి క్లియర్ చేసినట్లు చెప్పారు. కనిగిరి నియోజకవర్గంలో స్ట్రాంగ్ రూంల ఏర్పాటు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాల పరిశీలనలో భాగంగా ప్రభుత్వ హైస్కూల్, ఏఎంసీ మార్కెట్ యార్డులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వేశ్వరరావు, కనిగిరి రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జాన్‌ఇర్విన్ పాల్గొన్నారు.

31 మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు

ఒంగోలు(విద్య), మార్చి 14: ఒంగోలులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 31 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. పలుప్రైవేటు కంపెనీలు నిర్వహించిన ఈ ప్రాంగణ ఎంపికలో ఒంగోలు, ఈతముక్కల, కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు, ప్రైవేటు పాలిటెక్నిక్ విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన 31 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి రూ.3లక్షల వార్షిక వేతనం, భోజన వసతి, ప్రయాణసదుపాయం కల్పిస్తారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను శివప్రసాద్ అభినందించారు.

సీఏఏను రద్దు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14 : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సిటిజన్ అమెండెమెంట్ యాక్ట్ (సీఏఏ)ను వెంటనే రద్దు చేయాలని సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ డిమాండ్ చేశారు. స్థానిక బిలాల్‌నగర్ జంక్షన్‌లో గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఫలించిన బాబు కసరత్తు

జిల్లాలో టీడీపీ అభ్యర్థుల ఎంపికపై అంతా సానుకూలమే

పార్టీ శ్రేణులు, ప్రజలతో మమేకమయ్యే వారికే అవకాశం

రెండో విడతలో ముగ్గురికి ఖరారు

ఇక మిగిలింది రెండు అసెంబ్లీ స్థానాలే

నమ్మకం నిలబెట్టింది!

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల ఎంపికలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు చేసిన కసరత్తు ఫలించింది. రెండు విడతల్లో కలిపి ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల అభ్యర్థులను ప్రకటించగా, అన్ని చోట్ల పార్టీశ్రేణుల నుంచి సానుకూలత వ్యక్తమైంది. తొలి జాబితాలో ఏడు స్థానాలకు ప్రకటించగా, గురువారం ప్రకటించిన రెండో జాబితాలో మరో మూడుచోట్ల అభ్యర్థులను ఎంపిక చేశారు. తాజా జాబితాలో గిద్దలూరుకు ముత్తుముల అశోక్‌రెడ్డి, మార్కాపురానికి కందుల నారాయణరెడ్డి, కందుకూరుకు ఇంటూరి నాగేశ్వరరావును ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల అభ్యర్థులు పూర్తికాగా, దర్శి, చీరాలపై కసరత్తు సాగుతోంది. అధికార వైసీపీలో అభ్యర్థుల ఎంపికలో లొల్లి దాదాపు అన్ని స్థానాల్లో ఇంకా కొనసాగుతుండగా, టీడీపీ అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి అసంతృప్తులు, అసమ్మతులు లేకపోవడం విశేషం.



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇటు పార్టీ శ్రేణులు, అటు ప్రజలతో మమేకమై పని చేస్తున్న వారికే తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసే అవకాశం లభించింది. గత ఐదేళ్ల నుంచి జిల్లాలోని టీడీపీ నేతలు అన్ని అంశాల్లో సమైక్యంగా ముందుకుసాగుతూ రాష్ట్రంలో ఆదర్శవంతంగా నిలిచిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వారీ పరిస్థితులను సమీక్షించుకుంటూ పార్టీ ఇన్‌చార్జులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని హెచ్చరిస్తూ ఆయా విభాగాల్లో ఉన్న మార్కులు వేస్తూ అధినాయకత్వం తగు చర్యలు తీసుకుంది. తదనుగుణంగా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాల్లోనూ ప్రజల పక్షాన పనిచేస్తూ వైసీపీ ప్రభుత్వ దమనకాండపై పోరాడిన నేతలకు ఆయన అవకాశమిచ్చారు. తొలి జాబితాలో ఏడుగురికి తిరిగి అభ్యర్థులుగా ప్రకటించారు. ఆ సమయంలో ఎక్కడా ఇసుమంతా అసంతృప్తిగానీ, వ్యతిరేకతగానీ వ్యక్తం కాలేదు. తాజాగా ప్రకటించిన మూడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికలోనూ అదే రకమైన సానుకూలత వ్యక్తమైంది. కందుకూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో ఒకరిద్దరు నేతలు కొంత అయిష్టతను వ్యక్తం చేసినా ముందుగానే వారందరికీ సూచనలు చేసి అభ్యర్థుల ఎంపికను సాఫీగా నిర్వహించారు.

పార్టీశ్రేణుల సంబరాలు

రెండో జాబితాలో ప్రకటించిన ముగ్గురికి మద్దతుగా గురువారం ఆ పార్టీశ్రేణులు నియోజకవర్గాల్లో సంబరాలు చేసుకున్నారు. ఆ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, కందుకూరు ఇన్‌చార్జి నాగేశ్వరరావులు మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా సమన్వయంతో ముందుకెళ్లి విజయం సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు. ఇక దర్శి, చీరాల అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానం తుది కసరత్తు చేపట్టింది. తొలుత దర్శిని జనసేనకు కేటాయించినప్పటికీ తాజాగా ఆ స్థానం టీడీపీకి దక్కడంతో అక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న వారిపై పార్టీశ్రేణులు, ప్రజల నుంచి అభిప్రాయం తెలుసుకునే సర్వేలు చేపట్టారు. బలహీనవర్గాలకు చెందిన నాయకుడిని చీరాల నుంచి రంగంలోకి దింపే క్రమంలో భాగంగా ప్రస్తుత ఇన్‌చార్జి కొండయ్యవైపే అధిష్ఠానం మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. అక్కడ ఉన్న కొన్ని పరిస్థితుల నేపథ్యంలో మరికొన్ని అంశాల ఆధారంగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన కుమారుడు రాఘవరెడ్డి వారి అనుచరులతో కలిసి శనివారం టీడీపీలో చేరనున్నారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా రాఘవరెడ్డి పేరును ఖరారు చేశారు. బాపట్ల ఎంపీ అభ్యర్థిగా మాదిగ సామాజిక వర్గం నుంచి కొత్త అభ్యర్థిని రంగంలోకి దింపే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఈ కసరత్తు కూడా పూర్తిచేసి శనివారం సాయంత్రానికి మిగిలిన రెండు అసెంబ్లీ స్థానాలు, లోకసభ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది.


ఉగ్ర సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న పామూరు ఎంపీటీసీ సభ్యుడు, తదితరులు


మార్కాపురంలో కందుల నివాసం వద్ద బాణసంచా కాల్చుతున్న కార్యకర్తలు

టీడీపీలో భారీ చేరికలు

కనిగిరి, గిద్దలూరు, వైపాలెంలో వైసీపీకి షాక్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో టీడీపీలోకి ప్రారంభమైన వలసల పరంపర రోజురోజుకూ పెరిగిపోతోంది. గురువారం కనిగిరి, గిద్దలూరు, వైపాలెం నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, ఎరిక్షన్‌బాబుల సమక్షంలో పెద్దసంఖ్యలో వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. కనిగిరి నియోజకవర్గం పామూరులో ఒక ఎంపీటీసీ సభ్యుడు, అతని అనుచరులు టీడీపీలో చేరగా, వెలిగండ్ల మండలం వెల్లలచెరువు, మొగళ్లూరులో వైసీపీకి గుడ్‌బై చెప్పిన వందలాది మంది టీడీపీలో చేరారు. గిద్దలూరు నియోజకవర్గంలోని పాపినేనిపల్లిలో ఒక ఎంపీటీసీ సభ్యునితో పాటు కంభం మండలంలోని రెండు గ్రామాలకు చెందిన వందలాది మంది అధికారపార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. వైపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండలం తెల్లగట్ల, గంగవరం, కొత్తూరు గ్రామాల్లో బలహీనవర్గాలకు చెందిన వందలాది మంది ఎరిక్షన్‌బాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే ఎర్రగొండపాలెం మండలం అమానుగుడిపాడులోనూ పలు కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ కండువాలు కప్పుకున్నారు.


గిద్దలూరులో బాణసంచా కాల్చుతున్న టీడీపీ శ్రేణులు

గిద్దలూరులో టీడీపీ జెండా ఎగురవేస్తాం



- ముత్తుముల అశోక్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి

గిద్దలూరు టౌన్, మార్చి 14 : 'గిద్దలూరు నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో టీడీపీ జెండా రెపరెపలాడుతుంది. ఈ సారి నేను గెలిచి చంద్రబాబునాయుడికి ఈ గెలుపును కానుకగా ఇవ్వనున్నాను. ఐదేళ్ల జగన్ పాలనలో అభివృద్ధి లేదు. వారితో జనం విసిగిపోయారు. 2014-19 టీడీపీ హయాంలో నేను నియోజకవర్గంలో రూ.1300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాను. అవన్నీ జనానికి స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత టీడీపీ పాలన, ఇప్పటి జగన్ పాలన బేరీజు వేసుకుంటున్నారు. అభివృద్ధి అప్పుడే జరిగింది. ఇప్పుడేమి జరగలేదని జనం నిర్ధారిస్తున్నారు.' అని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు.

వలంటీర్లు, వీవోఏలకు తాయిలాలు

గెలుపు కోసం వైసీపీ అభ్యర్థుల దొడ్డిదారి వ్యూహాలు

వారితో ఓటర్లకు నగదు పంపిణీకి సన్నాహాలు

కట్టడి చేయాలని ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు విజ్ఞప్తి

దర్శి, మార్చి 14 : అధికార పార్టీ గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతోంది. తమ గెలుపునకు పని చేయాలని వలంటీర్లకు, వీవోఏలకు తాయిలాలు అందజేస్తోంది. కొన్నిచోట్ల అంగన్‌వాడీ కార్యకర్తలను తమవైపు తిప్పుకునేందుకు అధికారపార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సన్నాహాలను ముమ్మరం చేస్తున్నారు. మధ్యవర్తులుగా వలంటీర్లను, వైకేపీలో పనిచేస్తున్న వీవోఏలను వినియోగించుకుందుకు ఎర వేస్తున్నారు. వలంటీర్లకు రూ.5వేలు నగదు, డిన్నర్ సెట్, వాటర్ బాటిల్‌ను బహుమతులుగా వైసీపీ అభ్యర్థులు అందజేస్తున్నారు. వీవోఏలకు కూడా డిన్నర్ సెట్లు పంపిణీ చేశారు. ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో ఇప్పటికే పంపిణీ పూర్తయింది. మిగిలిన మండలాల్లో కూడా దశలవారీగా ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు నేతలు సిద్ధమవుతున్నారు. అనేకచోట్ల ఏకంగా వైకేపీ కార్యాలయాల్లోనే గిఫ్ట్‌ల నిల్వలను ఉంచినట్లు సమాచారం. ముందుగా వారిని సంతృప్తిపరచి వారి ద్వారా ఓటర్లకు డబ్బులు, మద్యంను పంపిణీ చేసేందుకు వ్యూహాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే వలంటీర్లు, వీవోఏలలో చాలామందికి తాయిలాలు అందాయి. మిగిలిన వారికీ అందజేసి ఆ తర్వాత ఓటర్లకు తాయిలాలు అందజేసేందుకు వీరిని వాడుకోనున్నారు. కాగా కొంతమంది వీవోఏలు తాయిలాలు తీసుకునేందుకు నిరాకరించినట్లు సమాచారం. ఇదిలావుండగా ఎలక్షన్ కమిషన్ నిబంధనలను ఏమాత్రం లెక్కచేయకుండా వైసీపీ నేతలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లను అడ్డుకోవాలని ప్రతిపక్షాలు కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవటం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరగాలంటే అక్రమాలు జరగకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలి.


ముండ్లమూరు వైకేపీ కార్యాలయంలో వీవోఏలకు పంపిణీ చేసేందుకు నిల్వ ఉంచిన డిన్నర్‌సెట్లు


వలంటీర్లకు కానుకలను పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకులు

బహుమతుల మోత

పీసీపల్లి, మార్చి 14 : ఎన్నికల్లో వలంటీర్లను వాడుకునేందుకు వారికి ఆకర్షణీయమైన బహుమతులను పంచుతున్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వైసీపీ నాయకులు వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. 4వవిడత చేయూత చెక్కుల పంపిణీ అని వీవోఏలను పిలిచారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ వలంటీర్లు, వీవోఏలతో మాట్లాడారు. అనంతరం మొయిలేని విధంగా బహుమతులను అందజేశారు.

నేడు ఎంపీ మాగుంట రాక

● రేపు బాబు సమక్షంలో టీడీపీలో చేరిక

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 14 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒంగోలులో జరిగే శుక్ర, శనివారాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందు బాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ఉండవల్లిలో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నివాసంలో తనయుడు రాఘవరెడ్డి, అనుచరులతో కలిసి ఆయన తెలుగుదేశం పార్టీలో చేరుతారు.

ముగిసిన జూనియర్ ఇంటర్ పరీక్షలు

ఒంగోలు(విద్య), మార్చి 14: ఇంటర్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. కీలకమైన అన్ని సబ్జెక్టుల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 22,626 మంది హాజరుకావాల్సి ఉండగా సుమారు వెయ్యి మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఒక్క విద్యార్థి కూడా కాపీయింగ్‌కు పాల్పడుతూ డీబార్ కాలేదు. పరీక్షల నిర్వహణపై ఎటువంటి ఫిర్యాదులు, అభియోగాలు రాలేదు. మొత్తం 69 కేంద్రాలను అధికారులు ఆకస్మింగా తనిఖీ చేస్తూనే ఉన్నారు. పరీక్షలు ముగియడంతో మొదటి సంవత్సరం విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. పరీక్ష ముగియగానే కేరింతలు కొడుతూ కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. ఒంగోలులో హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులతో స్వగ్రామాలకు వెళ్లిపోయారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు పుల్లారెడ్డి

చిలకలూరిపేట సభను విజయవంతం చేయాలి

● టీడీపీ పరిశీలకుడు భేరి పుల్లారెడ్డి

పొన్నలూరు (కొండపి), మార్చి 14 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో 17వ తేదీన జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు భేరి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. పొన్నలూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడనున్నారని చెప్పారు. పేట సభకు మండలం నుంచి భారీగా ప్రజలు తరలిరావాలని కోరారు. కొండపి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు అడకా స్వాములు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం ఖాయమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు నెలలపాటు క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు మండవ ప్రసాద్, సీనియర్ నాయకులు కర్ణా కోటిరెడ్డి, పిల్లి వెంకటరమణారెడ్డి, సన్నమూరి నరసింహారావు పాల్గొన్నారు.

హైవేకు రాజకీయ గ్రహణం

ట్రాఫిక్‌తో అవస్థలు పడుతున్న ప్రజలు

పుష్కరకాలం దాటినా పూర్తికాని రోడ్డు

కనిగిరి, మార్చి 14 : కనిగిరికి ప్రధాన హైవే రోడ్డుకు రాజకీయ గ్రహణం పట్టింది. ఈ మార్గం అసంపూర్తిగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పుష్కరకాలం దాటినా హైవే మార్గం పూర్తి కాకపోవడంతో భూములు కోల్పోయిన రైతులు నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. 2011లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నకరేకల్ నుంచి తిరుపతి మీదుగా ఏర్పేడు వరకు నేషనల్ హైవేను మంజూరు చేసింది. అప్పట్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరవ తీసుకొని ఈ రహదారిని కనిగిరి పట్టణానికి దగ్గరగా నియోజకవర్గం నుంచి వెళ్లేందుకు కృషి చేశారు. హైవే నిర్మాణం జరిగితే కనిగిరి అభివృద్ధికి తోడ్పడుతుందని భావించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోకి చినారికట్ల జంక్షన్ నుంచి పెదారికట్ల మీదుగా నందనమారెళ్ల, చల్లగిరగల, దిరిశవంచ, కాశిరెడ్డి కాలనీ, దేవాంగనగర్, టకారిపాలెం మీదుగా చెరువు సమీపంలోని ట్రాక్టర్ షోరూం వరకు హైవే నిర్మాణం జరిగింది. అక్కడి నుంచి 1,300 మీటర్ల దూరం రైతుల పరిహారం విషయంలో నెలకొన్న సమస్యతో ఆగిపోయింది. తిరిగి కొత్తూరు అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి నిర్మాణం జరిగింది.


అసంపూర్తిగా రహదారి

డాక్టర్ ఉగ్ర ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో మంజూరైన రోడ్డు పుష్కర కాలం దాటినా అసంపూర్తిగానే మిగిలిపోయింది. హైవే నిర్మాణంలో భూమిని కోల్పోయిన వారికి తొలుత ఎకరాకు రూ.30లక్షల నష్టపరిహారం ఇచ్చేందుకు హైవే అథారిటీస్ ముందుకు రాగా అందుకు రైతులు నిరాకరించి కోర్టును ఆశ్రయించారు. టీడీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల చొరవతో ఎకరా రూ.76లక్షలకు పెంచేలా హైవే అథారిటీస్ నుంచి ఒప్పందం చేశారు. ఈలోపు 2019లో ఎన్నికలు రావడంతో దానికి బ్రేక్ పడింది. ఆతర్వాత ఎమ్మెల్యేగా గెలిచిన మధుసూదన్‌యాదవ్ నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా నిరాదరణకు గురైంది. దీంతో కనిగిరి ప్రాంత వాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు.


అసంపూర్తిగా ఆగిపోయిన హైవే రోడ్డు నిర్మాణం

నిత్యం నిలిచిపోతున్న ట్రాఫిక్

కడప, బెంగళూరు, తిరుపతి తదితర ప్రధాన నగరాల నుంచి హైవేపై భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. అసంపూర్తిగా మిగిలిపోయిన హైవే కారణంగా ఆయా వాహనాలు పట్టణంలో నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో నిత్యం కనిగిరికి ప్రధాన సెంటరైన పామూరు బస్టాండ్ కూడలి వద్ద ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ కారణంగా ప్రజలు, వాహనదారులు నరకాన్ని చవిచూస్తున్నారు. అంతేకాకుండా పామూరు బస్టాండ్ సెంటరు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరగడంతో భారీ వాహనాలు మలుపు తిప్పే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం అసంపూర్తిగా ఉన్న హైవేనిర్మాణాన్ని పూర్తి చేసి ట్రాఫిక్ కష్టాలను తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.



అధికారంలోకి రాగానే హైవే పూర్తి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రజలు ఇబ్బందులు పడుతుండడం చూస్తున్నాను. నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో హైవేకు శ్రీకారం చుట్టాం. కనిగిరి ప్రాంతం నుంచి రవాణా సౌకర్యం ఉండాలన్న ఉద్దేశంతో నేను ఇక్కడి నుంచి హైవే వెళ్లేలా చొరవ తీసుకున్నా. ఇన్నేళ్లయినా పనులు పూర్తికాలేదు. 2024 ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన వెంటనే హైవే 565 రోడ్డును పూర్తి చేస్తా.

లోకేష్‌ను కలిసిన శ్రీనివాసరావు


లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసరావు

చీరాల, మార్చి 14: టీడీపీ చీరాల అసెంబ్లీ టిక్కెట్ ఆశిస్తున్న తిరువీధుల శ్రీనివాసరావు గురువారం ఉండవల్లిలో ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. గత కొంతకాలంగా చీరాల నియోజకవర్గం లో తాను నిర్వహించిన కార్యకలాపాలను లోకేష్‌కు వివరించినట్లు ఆయన అనుయాయులు చెప్పారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

చీరాలటౌన్, మార్చి 14: పదో తరగతి పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నాయి. ఆయా పోలీస్ స్టేషన్‌లకు సెట్ 1, సెట్ 2 ప్రశ్నపత్రాలు చేరాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 2068 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఏరోజు జరిగే పరీక్ష పేపర్‌ను అదేరోజు గంట ముందు మాత్రమే స్టేషన్ నుంచి తీసుకురానున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

చినగంజాం, మార్చి 14: ప్రతిఒక్కరూ పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కోట్ల కీర్తిసరోజ్ అన్నారు. 104 ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా కడవకుదురు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌కు ఫ్యాను, చాప, గ్రామంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలకు చాపలను వైద్యాధికారి తన సొంత నిధులతో అందజేశారు. కార్యక్రమంలో 104 డీఈవో పొదిలి రాఘవ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వదన, ఎం.రమ్య, మర్రి శారద, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

మార్టూరు, మార్చి 14: మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు గురువారం పూర్వ విద్యార్థులు పరీక్ష సామగ్రిని అందజేశారు. హైస్కూల్‌లో ఉన్న 60 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ చేతులమీదుగా పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాపారాయుడు, లక్ష్మయ్య, శైలజ, ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు రామకోటి, శ్రీను, రవి పాల్గొన్నారు.

యద్దనపూడి ఎస్ఐగా జీవీ చౌదరి బాధ్యతల స్వీకరణ

యద్దనపూడి(మార్టూరు), మార్చి 14: యద్దనపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జీవీ చౌదరి గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. 2019 నుంచి 2021వరకు ఇక్కడ ఆయన ఎస్ఐగా పనిచేశారు. మరల రెండోసారి ఎస్ఐగా యద్దనపూడి స్టేషన్‌కు వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన నాగ శ్రీను స్థానంలో జీవీ చౌదరి ఎస్ఐగా బదిలీపై వచ్చారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

పంగులూరు, మార్చి 14: సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుత వాతవరణంలో నిర్వహించేలా ప్రజలందరూ సహకరించాలని కోరుతూ గ్రామాలలో బీఎస్ఎఫ్ దళాలు గురువారం మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. మండలంలోని చందలూరు, నూజెళ్లపల్లి గ్రామాలలో జరిగిన మార్చ్‌ఫాస్ట్ సందర్భంగా సీఐ శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ప్రతివ్యక్తి స్వేచ్ఛగా తన ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది, బీఎస్ఎఫ్ దళాలు పాల్గొన్నారు.

చీరాల వైసీపీలో ఆమంచి కలకలం!

చీరాల, మార్చి 14: గత కొంతకాలంగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ వేస్తున్న అడుగులపై వైసీపీలో కలకలం సాగుతోంది. ఆమంచి అనుచరులకు కూడా స్పష్టత లేకుండా పోతోంది. రోజుకో పుకారు షికారు చేస్తోంది. వైసీపీ నుంచి వైదొలగినట్లా, కొనసాగుతున్నట్లా, వైదొలిగితే ఏపార్టీ నుంచి పోటీ చేస్తారు.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారా అనే అంశాలపై చర్చ సాగుతోంది. ఈనేపథ్యంలో గురువారం ఆయన సమీప బంధువు చీరాల కూరగాయల మార్కెట్ సెంటర్లో ఏర్పాటు చేసిన నూతనమాల్ ప్రారంభోత్సవానికి ఆమంచి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు పలువురు ఆమంచి అనుచరులు ఆయన వాహనానికి ముందు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈక్రమంలో స్థానిక ప్రజల్లో ఆమంచి వర్గం అడుగులుపై చర్చ జరిగింది. ఇప్పటికే ఆమంచి వర్గంలోని పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్‌లతో జతకట్టారు. అయితే మిగిలిన వర్గం ఆమంచినే అనుసరిస్తున్నారు. ఈనేపథ్యంలో వైసీపీ కలహాల కాపురంగానే కొనసాగుతుందని భావిస్తున్నారు.

చిరు దుకాణాలపై సర్వే

బల్లికురవ, మార్చి 14: గ్రామాలలో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుచేసి చిరు దుకాణాలు నిర్వహిస్తున్న వివరాలపై సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని 21 పంచాయతీలలో జిల్లా పరిశ్రమల శాఖ ఆదేశాలతో ఈ సర్వే జరుగుతుంది. గురువారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో ఉన్న దుకాణాలు, పాలకేంద్రాల వివరాలను సేకరించారు. ఎలాంటి సబ్సిడీ రుణాలు వచ్చాయి, లైసెన్స్‌లు పొంది ఉన్నారా లేదా అనే వివరాలను సేకరంచి ప్రత్యేక యాప్‌లో పంపుతున్నారు. ఈ సర్వే ద్వారా వ్యాపారులకు మునుముందు ప్రభుత్వ పథకాలు అందుతాయని సర్వే అధికారులు చెబుతున్నారు. అన్నివివరాలు సేకరించడంపట్ల చిరు దుకాణాల వారు మాత్రం మునుముందు ప్రభుత్వం తమపై పెనాల్టీలు వేసే అవకాశం ఉందని ఆందోళనలో ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


ఎమ్మెల్యే ఏలూరిని సత్కరిస్తున్న పర్చూరు నియోజకవర్గ గిరిజనులు

మార్టూరు, మార్చి 14: రాష్ట్రంలో గిరిజనుల బలోపేతం లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ పని చేస్తుందని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. గురువారం మండలంలోని ఇసుకదర్శిలోగల క్యాంపు కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ గిరిజన ఆత్మీయ సమావేశంలో ఏలూరి మాట్లాడారు. గిరిజనులను ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేయడమే టీడీపీ లక్ష్యమన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసేందుకు టీడీపీ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. వచ్చే తెలుగుదేశం ప్రభుత్వంలో గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్టీలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా వారి ఆర్థిక పరిపుష్టి కోసం కృషి చేస్తామన్నారు. సమావేశానికి నియోజకవర్గం నుంచి భారీగా గిరిజనులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు తిరుమల శెట్టి శ్రీనివాసరావు, పాలపర్తి కోటేశ్వరరావు, రామూరి కుమార్, పొన్నరసు వెంకటేశ్వర్లు, పాలపర్తి శ్రీనివాసరావు, ఆవుల వెంకటేశ్వర్లు, కుంభ ప్రసాద్, సూర్య నాయక్, యందేటి కోటేశ్వరరావు, మల్ల వెంకటేశ్వర్లు, అద్దూర్ వెంకటేశ్వర్లు, ఇండ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సమాజం యువత ఓటుతోనే సాధ్యం


మార్టూరులోని వీరగంధం డిగ్రీ కళాశాలలో యువ ఓటర్లతో ఎమ్మెల్యే ఏలూరి

మెరుగైన సమాజం కావాలంటే నవతరం, యువతరం ఓటర్లు తమ ఓటును వజ్రాయుధంలాగా ఉపయోగించి సమాజాభివృద్ధికి కృషిచేసే వారిని ఎన్నుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం మార్టూరులోని వీరగంధం శ్రీనివాస డిగ్రీ కళాశాలలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకునే యువతీ యువకులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు యువత తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉందన్నారు. సమాజం పట్ల బాధ్యత గలిగిన వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. ఉపాధి కోసం యువత వలసబాట పట్టడానికి సీఎం జగన్ కారణ మన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి పదవిలోకి వచ్చిన జగన్ అరాచకపాలనకు భయపడిన కంపెనీలు రాష్ట్రం నుంచి పరారయ్యాయన్నారు. అమరావతి రాజధానిగా ఉన్నట్లయితే ఎంతో మంది యువతకు మనదగ్గరే ఉపాధి లభించేదన్నారు. ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్రానికి దూరదృష్టి గలిగిన ముఖ్యమంత్రి అవసరమన్నారు. ఎంతో కష్టపడి చదువుకుని, సమాజానికి ఏదైనా చేయాలనే లక్ష్యంతో సొంతంగా వ్యవసాయ అనుబంధ పరిశ్రమ ఏర్పాటుచేసి వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించానని చెప్పారు. రాజకీయంగా సేవ చేయాలనే లక్ష్యంతో రెండు సార్లు ఎమ్మెల్యేగా పర్చూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఏలూరి సాంబశివరావుకు కళాశాల డైరెక్టర్ వీరగంధం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పొగడదండ రవి కుమార్, కన్నెగంటి శ్రీనివాసరావు, షేక్ ఫరూక్, మువ్వా శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలి

» జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్


మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్

పర్చూరు, మార్చి 14: నిరంకుశ, విధ్వంసకర వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపటమే లక్ష్యంగా పనిచేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పర్చూరులో గురువారం తెలుగుదేశం, జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తొలుత స్థానిక బొమ్మల సెంటర్‌లోని వంగవీటి మోహన్‌రంగా, ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, జనసేన మండల కన్వీనర్ విన్నకోట అజయ్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకే జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా ఏర్పడిందన్నారు. కలసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కారంపూడి సందీప్ తేజ, శంకరశెట్టి చిరంజీవి, తోట మణి, తులసి సునీల్, దీర్ఘాల రమేష్ నాయుడు, కొసనా యశ్వంత్, అచ్చుకోలు సతీష్, కందా సురేంద్ర, శీలం కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు కోడూరి శేషబ్రహ్మంచారి, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, దూళిపల్లి వెంకటస్వామి, అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, చెరుకూరి శ్రీధర్(చింపయ్య), మామిడిపాక హరిప్రసాద్, శ్రీరాం వెంకటసుబ్బారావు, షేక్ గౌస్, శిరిగిరి నాగేశ్వరరావు, కోటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చీరాల: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల పార్టీ జెండాలను ఎగురవేశారు. చీరాల ఏరియా వైద్యశాలలో గర్భిణులకు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చినగంజాం: మండలంలోని కడవకుదురులో గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన మండల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి హరిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కట్టిబోయిన సుబ్బారావు, తోట అశోకచక్రవర్తి, జి.వసంతరాయుడు, షేక్ షబీర్, తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ సమావేశం

» అధికార పార్టీ కౌన్సిలర్లు అత్యుత్సాహం
» టీడీపీ కౌన్సిలర్లు సమస్యలపై ప్రశ్నిస్తుండగా జోక్యం
» మధ్యలోనే ముగించివెళ్లిన చైర్‌పర్సన్


సమావేశంలో వాదులాడుకుంటున్న అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు

అద్దంకిటౌన్, మార్చి 14: అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. గురువారం కౌన్సిల్ హాల్‌లో జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశం కేకలు, అరుపులతో ప్రారంభమైన కొద్దిసేపటికే ముగిసింది. సమావేశానికి చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షత వహించారు. ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్లు తిరుపతమ్మ, రజినీ సమస్యలపై గళమెత్తారు. అయితే, జీరో అవర్ సమయంలోనే సమస్యలను తెలియజేయాలని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. జీరో అవర్‌లో సభ్యులెవరూ ఉండకపోతుండటంతో ఆయా వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ముందుగా వివరిస్తున్నట్టు చెప్పారు. ఆ సమయంలో 20వ వార్డు అధికార పార్టీ కౌన్సిలర్ కోటేశ్వరరావు జోక్యం చేసుకుని సిబ్బంది అందరూ పనిచేస్తున్నారని కేకలు వేయడంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. తమ సమస్యలపై చైర్‌పర్సన్, అధికారులు స్పందించకుండా అధికార పార్టీ కౌన్సిలర్ స్పందించడంతో టీడీపీ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ సమయంలోనే మిగిలిన వైసీపీ కౌన్సిలర్లు కూడా మాట్లాడటంతో టీడీపీ కౌన్సిలర్లు కల్పించుకోవడంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. దీంతో సమావేశంలో ఏమి జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ సమావేశంలో పెట్టిన 15 అంశాలను ఆమోదిస్తున్నట్టు చెప్పి సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో సమావేశంలో సభ్యులందరూ మిన్నకుండడంతో సమావేశం ముగిసింది.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


మాట్లాడుతున్న కొండయ్య

వేటపాలెం(చీరాల), మార్చి 14: రాష్ట్రం బాగుపడాలన్నా, యువత భవిష్యత్ బాగుండాలన్నా చంద్రబాబు మరలా ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. వేటపాలెం మండలం పందిళ్లపల్లిలోని నెహ్రూ బొమ్మ రోడ్డులో గురువారం రాత్రి బూత్ ఇన్‌చార్జ్‌లు, కుటుంబ సాధికారులు, తదితరులతో నిర్వహించిన శిక్షణ సమావేశంలో కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌తో బీసీ సాధికారితకు మార్గం సుగమమైందన్నారు. సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధికి సంపదను సృష్టించగల వ్యక్తి చంద్రబాబు ఒక్కరేనన్నారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొగ్గుల పార్థసారధి, నాసిక వీరభద్రయ్య, గుత్తి వీరప్రసాదరావు, కొతవరపు జనార్దనరావు, గుత్తి రామాంజనేయులు, వీరబ్రహ్మం, లింగమూర్తి, కిరణ్‌కుమార్, బండారు వెంకటసుబ్బారావు, గంజి పురుషోత్తమ్, బుర్ర కవిత, యర్రా శివనాగమల్లేశ్వరి, బుద్ధి దుర్గామల్లేశ్వరి, దేవన విజయలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

పర్చూరు, మార్చి 14: ఎన్నికల విధులు, నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, రెవెన్యూ డివిజన్ అధికారి గంథం రవీందర్ అన్నారు. గురువారం స్థానిక అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపంలో ఎన్నికల నిర్వహణకు నియమితులైన సెక్టార్ అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యాదర్శులు, బీఎల్‌వోలకు కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసీసీ) అమలు, ఈవీఎం పని విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఆర్వో రవీందర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఎలాంటి అసాంఘిక చర్యలకు తావు లేకుండా పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా గుర్తించిన సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, కె.సంధ్యశ్రీ, వై.నాగరాజు, మెహర్‌బాబు, ఎం.ప్రవీల, ఫణీంద్ర బాబు, ఎంపీడీవోలు శ్రీనివాసరెడ్డి, శ్రీదేవి, వరప్రసాద్, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు అందరి హక్కు

చీరాలటౌన్, మార్చి 14: ఓటు హక్కు ఒక వజ్రాయుధమని, ప్రజాస్వామ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి హక్కు అని తహసీల్దార్ నాసరయ్య అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాల యంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం - ఓటరు విజ్ఞాన చైతన్యం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు విలువను తెలుసుకుని వారి హక్కును రక్షించుకోవాలన్నారు.

కార్యక్రమంలో ప్రతినిధులు కోట వెంకటేశ్వరరెడ్డి, నాగవీరభద్రాచారి, యలమందారెడ్డి, రామారావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, శర్మ, మేడా ప్రసాద్, నిర్మలమ్మ, కళ్యాణి, ప్రసాదరావు, మణిబాబు, హరిబాబు, బాబురావు, లోహియా తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం

కారంచేడు(పర్చూరు), మార్చి 14: ఎన్‌హెచ్ 167 కింద భూములు కోల్పోయిన రైతులకు నేషనల్ హైవే యాక్ట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించటం జరుగుతుందని చీరాల ఆర్‌డీవో సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలు, భూమి విస్తీర్ణం, నష్టపరిహార వివరాలు తదితర అంశాలపై సంబంధిత రైతులతో ఆర్‌డీవో గురువారం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది ద్వారా రైతుల వివరాలు, కోల్పోతున్న విస్తీర్ణాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మెహర్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ఇంకొల్లు, మార్చి 14: ఇంకొల్లు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని గంగవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్షా సామగ్రి అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నార్నె సమత, ఉపాధ్యాయులు దుర్గ, సుమలత, విజయలక్ష్మి, రాధ, జానకి, జయశంకర్, కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై అవగాహన

చీరాల, మార్చి 14: మండలంలోని తోటవారిపాలెంలో గురువారం ఔత్సాహిక రైతులకు తేనెటీగల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, ప్రొఫెసర్ ఎస్ఆర్ కోటేశ్వరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుశీల, ప్రొటెక్ట్ సంస్థ ప్రతినిధి చంద్రారెడ్డి తేనెటీగల పెంపకంలో మెలకువలను వివరించారు. అందుకు ప్రభుత్వపరంగా అందే చేయూతను వివరించారు. ఆదాయ వనరులను తెలుపుతూ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు తేనెటీగల పెంపకం దోహదపడుతుందన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వరసిద్ధి వినాయకుడు

బల్లికురవ, మార్చి 14: బల్లికురవ గ్రామంలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠ జరిగిన వరసిద్ధి వినాయక స్వామి దేవాలయ 16 రోజుల పండగ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా గ్రామస్థులు పెద్దఎత్తున దేవాలయానికి చేరి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వరసిద్ధి వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

బల్లికురవ, మార్చి 14: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు జాగ్రత్తగా సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు, బల్లికురవ ఎస్ఐ నాగ శివారెడ్డి ఆధ్వర్యంలో గురువారం బీఎస్ఎఫ్ దళంతో పోలీసు కవాతు చేపట్టారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలైన వేమవరం, ఉప్పుమాగులూరు, బల్లికురవ, వైదన గ్రామాలలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఉండేందుకు పోలీసుశాఖ ప్రజలకు అవగాహన కలిగించేందుకు వీధుల వెంట కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ నరసింహారావు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. ఎవరైన చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

17న జరిగే సభకు భారీగా తరలిరావాలి

బల్లికురవ, మార్చి 14: టీడీపీ, జనసేన, బీజేపీలు సంయుక్తంగా ఈనెల 17న బొప్పుడి వద్ద నిర్వహిస్తున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు తరలి రావాలని అద్దంకి నియోజకవర్గ యువ నాయకుడు గొట్టిపాటి కమల్‌కిశోర్ (బాబి) కోరారు. గురువారం వీర్లకొండ వద్ద గల బల్లికురవ మండల టీడీపీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బాబి మాట్లాడుతూ అన్నిగ్రామాల నుంచి కార్యకర్తలు బహిరంగ సభకు వచ్చేలా వారిని కదిలించాలన్నారు. గ్రామాలలో టీడీపీకి రోజురోజుకు ప్రజలలో ఆదరణ పెరుగుతుందని చెప్పారు. అలాగే, దగ్గర గ్రామాల నుంచి ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని అయన సూచించారు. అనంతరం గ్రామాల వారీగా సమీక్షించారు. సమావేశంలో మండల నేతలు కొండేటి ఇజ్రాయల్, మలినేని గోవిందరావు, గొట్టిపాటి లక్ష్మయ్య, దూళిపాళ్ల హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: బొప్పూడిలో ఈనెల 17న జరిగే బహిరంగ సభకు మండలం నుండి పార్టీ శ్రేణులు వేల సంఖ్యలో హాజరయ్యేలా నేతలు సమిష్టి కృషి చేయాలని టీడీపీ మండల నాయకులు నిర్ణయించారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో గల టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం జన సమీకరణపై సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఉదయం ముప్పవరం కార్యాలయంలో కొరిశపాడు, పంగులూరు మండలాలకు సంబంధించిన నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సభ ఏర్పాట్లు, జన సమీకరణకు సంబంధించి సమీక్ష చేస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ తెలిపారు. సమావేశంలో కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేఖర్, మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకులకు చేయూత

అద్దంకిటౌన్, మార్చి 14: పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులు, ఇతర పశు పోషకులకు కల్పించాల్సిన అన్ని వసతులు, సౌకర్యాలు ప్రభుత్వం నుంచి అందించడం జరుగుతుందని పశుసంవర్ధకశాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ ఆర్. అమరేంద్ర కుమార్ అన్నారు. గురువారం అద్దంకి వచ్చిన ఆయన ముందుగా గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మర్మతులు చేసిన పాత భవనాన్ని రైతులతో ప్రారంభింపజేశారు. పశువైద్యశాల నూతన భవనం మధ్య లోనే నిలిచిపోవడం గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గోపాలమిత్రల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. డాక్టర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్‌బీకే కేంద్రాలను ఏర్పాటుచేసి అవసరమైన సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు, బాపట్ల డీఏహెచ్‌వోలు డాక్టర్ బేబిరాణి, డాక్టర్ ఎం.హనుమంతరావు, డాక్టర్ ఏ.రమేష్‌బాబు, డాక్టర్ ఎం.మోహనరావు, డాక్టర్ అశోక్, డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ సైదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తుదిజాబితా విడుదల

అద్దంకిటౌన్, మార్చి 14: రబీ సీజన్‌కు సంబంధించి మండలంలోని ఆయా గ్రామాలలో పంట సాగుచేసిన రైతుల తుది జాబితాను రైతుభరోసా కేంద్రాల్లో ప్రచురించినట్టు మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. గురువారం శింగరకొండపాలెంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఈపంట నమోదు తుది జాబితాను ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో 2,980 మంది రైతులకు 7,895 ఎకరాల్లో ఈ పంట నమోదు చేసినట్టు చెప్పారు.కార్యక్రమంలో వ్యయసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా చక్రవర్తి బాధ్యతల స్వీకరణ


వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చక్రవర్తి

చీరాల, మార్చి 14: చీరాల మున్సిపల్ నూతన కమిషనర్‌గా కె.చక్రవర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చక్రవర్తి విశాఖ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎన్నికల నియమావళి నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న విజయసారధి పాలకొల్లుకు బదిలీపై వెళ్లారు. ఇప్పటివరకు డీఈ ఐసయ్య ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించారు. నూతంగా బాధ్యతలను స్వీకరించిన చక్రవర్తికి కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో సెయింట్‌ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చీరాల, మార్చి 14: సెయింట్ ఆన్స్ కళాశాలలో గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో పాలిటెక్నిక్ 3వ సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈసందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, పాలిటెక్నిక్ డిప్లొమా విభాగ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.విజయభాస్కరరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

బల్లికురవ, మార్చి 14: ఇష్టంతో పాటు కష్టపడి చదివి తల్లిదండ్రుల నమ్మకాన్ని విద్యార్థులు నిలబెట్టాలని చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిసాగర్ అన్నారు. గురువారం పాఠశాల వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దూళిపాళ్ల శేషగిరి, కృష్ణయ్య, రాణి, శ్రీనివాసరావు, బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 12.948 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, మార్చి 14: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి జలాశయంలో 12.948 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



'సంక్షేమ'ంలో సంక్షోభం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 14 : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు ఉన్నాయి. వీటన్నింటిలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉంది. వీటికి భోజన బిల్లులు రూ.కోట్లలోనే పెండింగ్‌లో ఉన్నాయి. నా ఎస్సీలు, నా బీసీలు, నా ఎస్టీలు అని ప్రగల్భాలు పలికే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హాస్టళ్ల విద్యార్థుల సంక్షేమాన్ని గాలి కొదిలేశారు. డైట్ బిల్లుల చెల్లింపునకు గ్రీన్ చానల్ ఉందని ప్రకటించినా అమలుకు నోచుకోవడం లేదు. పైగా బిల్లులు ట్రెజరీకి వెళ్లినా అవి ఆమోదానికి నోచుకోవడం లేదు.

● ఎస్సీ హాస్టళ్లకు రూ.4.3 కోట్లు

జిల్లాలో 73 ఎస్సీ హాస్టళ్లు ఉండగా, 6వేల మందికి పైబడి విద్యార్థులు చదువుతున్నారు. అయితే, ఈ హాస్టళ్లకు ఆరు నెలలుగా మెనూ బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. ఒక్కో హాస్టల్‌కు నెలకు రూ.6లక్షల వరకు బిల్లుల బకాయిలు ఉన్నాయి. ఈ లెక్కన 73 హాస్టళ్లకు రూ.4.3 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉంది. పిల్లలు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని హాస్టల్ నిర్వాహకులు అప్పులకు సరుకులు తెచ్చి కాలం వెళ్లదీస్తున్నారు.

● 15 ఎస్టీ గురుకులాలు

జిల్లాలో 15 గిరిజన సంక్షేమ గురుకులాలు ఉండగా, 3వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ హాస్టళ్లకు కూడా భోజన బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. కనీసం కాస్మెటిక్ చార్జీల చెల్లింపులూ లేవు. సుమారు రూ.1.5కోట్ల వరకు పెండింగ్ ఉంది. జిల్లా కేంద్రమైన నెల్లూరులో ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలలో 210 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి భోజన బిల్లులు, కాస్మెటిక్ చార్జీల బిల్లులకు ఆరు నెలలుగా చెల్లింపులు జరగలేదు. రూ.12 లక్షల వరకు ఈ ఒక్క పాఠశాలకే బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. అంతేకాదండోయ్.. ఈ పాఠశాల అధికారులు, సిబ్బందికి ఆరు నెలలుగా జీతాలు కూడా ఆగిపోయి ఉన్నాయి. సుమారు రూ.15 లక్షల వరకు జీతాల పెండింగ్ ఉంది.

● బీసీ హాస్టళ్లకు రూ.2.5 కోట్లు

జిల్లాలో 98 బీసీ సంక్షేమ హాస్టళ్లు ఉండగా, 3600 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ హాస్టళ్లకు సుమారు రూ.2.5 కోట్లకు పైబడి బిల్లులు పెండింగ్ ఉంది.

● బియ్యం బిల్లులకు చెల్లింపులు లేవు

హాస్టళ్లకు డీలర్ల ద్వారా బియ్యం సరఫరా చేస్తారు. కిలోకు ఒక రూపాయి చొప్పున డీడీ రూపంలో సంక్షేమాధికారులు చెల్లించాలి. ఈ మొత్తం చెల్లింపులు కూడా సరిగా ఉండటం లేదు. వంట చేసేందుకు గ్యాస్ సిలిండర్లను కూడా సొంత జేబులో నుంచి పెట్టుకోవాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు.

● అందని కాస్మెటిక్ చార్జీలు

హాస్టళ్లలోని విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు కూడా 6 నెలలుగా చెల్లించడం లేదు. 3 నుంచి 6వ తరగతి చదివే బాలబాలికలకు ఒక్కొక్కరికి రూ.155, 7 నుంచి 10వ తరగతి వరకు చదివే బాలురకు ఒక్కొక్కరికి రూ.165, బాలికలకు రూ.175లను చెల్లించాల్సి ఉంది. ఈ చెల్లింపులు ఆరునెలలుగా లేకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ తమ వల్లకాదంటూ సంక్షేమాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, బిల్లుల వ్యవహారంపై జిల్లా సంక్షేమాధికారి వెంకటయ్య మాట్లాడుతూ బీసీ సంక్షేమ హాస్టళ్ల మెనూ బిల్లులను ట్రెజరీకి పంపామని, త్వరలో మంజూరవుతాయని అన్నారు.

> ఆర్నెళ్లుగా అందని భోజన బిల్లులు
>
> అప్పు చేసి సరుకుల కొనుగోలు
>
> కాస్మెటిక్ చార్జీల చెల్లింపులకూ బ్రేక్
>
> లబోదిబోమంటున్న హెచ్‌డబ్ల్యూవోలు
>
> సంక్షేమ హస్టళ్లలో విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణపై పూర్తిగా అలసత్వం అలముకొంది. కనీసం ఒళ్లు రుద్దుకొనే సబ్బులు కొనుక్కొనే పరిస్థితి కూడా హస్టళ్లలో లేదంటే ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతుంది. ఆరు నెలలుగా భోజన బిల్లులు చెల్లించక పోవటంతో హస్టళ్ల వెల్ఫేర్ అధికారులే అప్పులు చేసి మరీ విద్యార్థుల ఆకలి తీరుస్తున్నారు.



ఆనం రామనారాయణరెడ్డి | ఇంటూరి నాగేశ్వరరావు | వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి | లక్ష్మీసాయిప్రియ

యుద్ధానికి సిద్ధం

- ఆత్మకూరుకు ఆనం, కందుకూరుకు ఇంటూరి, కోవూరుకు ప్రశాంతి రెడ్డి
- సర్వేపల్లి మినహా అన్ని స్థానాలకు టీడీపీ అభ్యర్థుల ఖరారు
- వెంకటగిరికి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ

నెల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నుంచి ఎన్నికల బరిలో తలపడనున్న టీడీపీ అభ్యర్థులు దాదాపుగా ఖరారయ్యారు. జిల్లా పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్క సర్వేపల్లి మినహా మిగిలిన అన్ని స్థానాలకు టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించారు. గురువారం టీడీపీ అధిష్ఠానం విడుదల చేసిన రెండో జాబితాలో ఆత్మకూరు, కందుకూరు, కోవూరు నియోజకవర్గాలతోపాటు తిరుపతి- నెల్లూరు జిల్లాల ఉమ్మడి నియోజకవర్గం వెంకటగిరి అభ్యర్థి కూడా ఖరారయ్యారు. ఆత్మకూరుకు ఆనం రామనారాయణరెడ్డి, కందుకూరుకు ఇంటూరి నాగేశ్వరరావు, కోవూరుకు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్లను ఖరారు చేశారు. తొలి జాబితాలో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఉదయగిరి, కావలి నియోజకవర్గ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. గురువారం విడుదల చేసిన రెండవ జాబితాతో నెల్లూరు పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లు అయ్యింది.



● ఒకరు పాత.. ముగ్గురు కొత్త

రెండవ జాబితాలో ప్రకటించిన ఆత్మకూరు, కోవూరు, కందుకూరు, వెంకటగిరి నియోజకవర్గాల అభ్యర్థుల్లో ఒకరు సీనియర్ కాగా మిగిలిన ముగ్గురు తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేస్తున్నారు. ఆత్మకూరు నుంచి పోటీ చేస్తున్న ఆనం రామానారాయణరెడ్డి పరిచయం అక్కర్లేని నాయకుడు. సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు. ఆత్మకూరు నుంచి మూడవసారి బరిలో నిలుస్తున్నారు. 2009లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో పరాజితులయ్యారు. ఆ తరువాత వైసీపీలో చేరి వెంకటగిరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు మూడవ సారి ఆత్మకూరు నుంచి పోటీ చేస్తున్నారు.

● కందుకూరులో ఇంటూరి నాగేశ్వరరావు తొలిసారిగా పోటీ చేస్తున్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్థిరపడిన ఈయన తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. రెండేళ్లుగా కందుకూరు టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.


● రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఆమె తొలిసారిగా ఎన్నికల బరిలో దిగుతున్నారు. భర్త వీపీఆర్ టీడీపీ అభ్యర్థిగా నెల్లూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్నారు. ఆ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని కోవూరు నుంచి ఈమె అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. దక్షిణ భారతదేశంలోని టీడీపీ ఆలయాల పర్యవేక్షణ అధ్యక్షురాలిగా నాలుగేళ్లపాటు కొనసాగారు.

● నెల్లూరు-తిరుపతి జిల్లాల ఉమ్మడి నియోజకవర్గం వెంకటగిరి నుంచి మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ రాజకీయ వారసురాలిగా ఆయన కుమార్తె కురుగుండ్ల లక్ష్మీసాయిప్రియ తొలిసారిగా ఎన్నికల బరిలో తలపడుతున్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ వెంట నియోజకవర్గం మొత్తం కలియతిరిగిన ఈమె తక్కువ రోజుల్లోనే నియోజకవర్గ ప్రజల్లో గుర్తింపు పొందారు. ఎవరూ ఊహించిన రీతిలో టీడీపీ అభ్యర్థిగా ఖరారయ్యారు. కురుగుండ్ల రాజకీయ వారసురాలిగా ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ కోడలిగా తొలిసారిగా వెంకటగిరి నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు.

సర్వేపల్లిని వీడని ఉత్కంఠ

సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎవరనే విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. ఇక్కడి నుంచి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి టికెట్టు ఆశిస్తున్నారు. అయితే రెండవ జాబితాలో కూడా సర్వేపల్లి అభ్యర్థి పేరు ప్రకటించలేదు. రోజుకొక పేరుతో ఐవీఆర్ఎస్ బృందం సర్వే చేస్తోంది. ఒకవైపు రెండు జాబితాల్లోనూ సోమిరెడ్డి పేరు లేకపోవడం, మరోవైపు పలువురు నాయకుల పేర్లతో సర్వేలు నిర్వహిస్తుండటంతో సర్వేపల్లి అభ్యర్థి ఎవరనే విషయంలో మరి కొద్దిరోజుల పాటు సస్పెన్స్ తప్పదనిపిస్తోంది.

కందుకూరులో సస్పెన్స్‌కు తెర



ఇంటూరికి స్వీటు తినిపిస్తున్న నారా లోకేష్

కందుకూరు : నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఇంటూరి నాగేశ్వరరావునే టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం ప్రకటించారు. తొలి జాబితాలోనే ఇంటూరి పేరును ప్రకటిస్తారని భావించగా ఆ జాబితాలో కందుకూరును పక్కన పెట్టడం అనేక ఊహాగానాలకు తెరలేచింది. ఈ సందేహాలకు నివృత్తిగా ఇంటూరి నాగేశ్వరరావునే అభ్యర్థిగా ఖరారుచేస్తూ ప్రకటన వెలువడటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. కాగా, రెండేళ్లుగా టీడీపీ ఇంఛార్జి బాధ్యతల్లో నాగేశ్వరరావు పార్టీ నిర్దేశించిన అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించటంతోపాటు నిత్యం ప్రజల్లో ఉంటూ వచ్చారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇంటూరికి మద్దతుగా నిలవటం, కష్టపడ్డ వారికి న్యాయం చేయడం ద్వారా పార్టీ పట్ల కేడర్‌లో విశ్వసనీయతను కాపాడుకోవటం, యువకులను ప్రోత్సహించటం లక్ష్యంగా తర్జన భర్జనల అనంతరం నాగేశ్వరరావునే అభ్యర్థిగా ఖరారుచేసి అధిష్ఠానం ప్రకటన చేసినట్లు సమాచారం.

ఆయన బరిలో నిలవాల్సిందే!

- ఎమ్మెల్యే మహీధరరెడ్డి అనుచరుల తీర్మానం
- రక్తికట్టిస్తున్న కందుకూరు వైసీపీ రాజకీయం



కందుకూరులో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనుచరులు, అభిమానులు

కందుకూరు, మార్చి 14 : 'కందుకూరులో సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డికి టిక్కెట్ ఇవ్వకుండా వైసీపీ అధినేత జగన్ పెద్ద తప్పు చేశాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయన పోటీలో ఉండాల్సిందే, ఆయన గెలుపే లక్ష్యంగా మనమంతా పని చేద్దాం' అంటూ వైసీపీ నాయకులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. కందుకూరులోని ఓ కల్యాణమండపంలో గురువారం జరిగిన సమావేశంలో పట్టణ ప్రముఖులు, వివిధ సామాజికవర్గాలకు చెందిన వారు పాల్గొన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన మహీధరరెడ్డే ప్రజాప్రతినిధిగా ఉండాలని ఈ ప్రాంత ప్రయోజనాలు నెరవేరాలంటే ఆయన పోటీలో ఉండి తీరాల్సిందేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. మిగిలిన ప్రాంతాల వారిని కూడా కలుపుకుని బరిలో నిలిచేందుకు ఆయనపై ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జనార్ధనస్వామి ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, విశ్రాంత తహసీల్దారు వెంకటేశ్వర్లు, దళిత నాయకుడు పాలేటి కోటేశ్వరరావు, పిడికిటి శంకర్, ఆర్యవైశ్య ప్రముఖులు గుర్రం శింగయ్య, కోట వెంకట నరసింహ్మం, శివ, మురారిశెట్టి శ్రీకాంత్, దామా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.26

సహరి (శనివారం) : 4.53

కిలో పొగాకు ధర రూ.233

కలిగిరి : స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 309 పొగాకు బేళ్ల అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 298 బేళ్ల కొనుగోలు చేశారు. సీఆర్-7, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 11 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.233, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.230.06గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

అటకెక్కిన స్వచ్ఛ సంకల్పం! 8

సమ్మె వేతనాలేవి జగనన్నా!?

- 42 రోజులపాటు అంగన్‌వాడీల ఆందోళన
- ఎట్టకేలకు దిగొచ్చిన ప్రభుత్వం
- 11 ఒప్పందాల్లో ఐదు మాత్రమే అమలు
- సమ్మె కాలానికి అందని జీతం
- రూ.9 కోట్ల వరకు బకాయిలు
- ఆర్థిక ఇబ్బందుల్లో కార్యకర్తలు

నెల్లూరు (వైద్యం), మార్చి 14 : అంగన్‌వాడీల సమ్మె ఒక చారిత్రాత్మకం. తమ డిమాండ్ల సాధన కోసం 42 రోజుల సుదీర్ఘకాలంపాటు విధులకు దూరంగా ఉంటూ ఆందోళనబాటపట్టారు. ఎట్టకేలకు దిగివచ్చిన వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలతో పలు ఒప్పందాలు చేసుకుని హామీలు గుప్పించింది. సమ్మె కాలానికి కూడా వేతనాలు ఇస్తామని అంగీకరించింది. ఇది జరిగి ఒకటిన్నర నెల గడిచినా ఇప్పటి దాకా సమ్మె కాలానికి వేతనాలు అంద లేదు. ఫైనాన్స్ క్లియరెన్స్ పూర్తయినా ముఖ్యమంత్రి చాంబర్‌లోనే వేతనాల ఫైల్ ఉన్నట్టు సమాచారం. పెండింగ్ జీతం ఎప్పుడు వస్తుందోనని అంగన్‌వాడీలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 2,934 కేంద్రాలు ఉండగా, 5,639 మంది అంగన్‌వాడీలు, హెల్పర్లు పని చేస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.11,500, హెల్పర్లకు రూ.7వేలు వేతనం ఇస్తున్నారు. సమ్మె కాలానికి అంటే 42 రోజుల వేతనం రూ.9 కోట్ల వరకు జిల్లాకు రావాల్సి ఉంది. గతేడాది డిసెంబరు 14న అంగన్‌వాడీలు సమ్మె చేపట్టగా జనవరి 24వ తేదీ వరకు కొనసాగింది.

కొన్నింటికే జీవోల విడుదల

కేవలం ఐదు హామీలకు మాత్రం ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. అంగన్‌వాడీలకు గ్యాట్యూటీ సంబంధించి కేంద్రానికి సిఫార్సు చేస్తామని, ఉద్యోగ విరమణ సమయంలో వర్కర్లకు రూ.50వేల నుంచి లక్ష రూపాయలకు పెంచుతున్నట్లు అంగీకరించి వాటిని అమలు చేస్తోంది. విధి నిర్వహణలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, వైఎస్సార్ బీమా, మట్టి ఖర్చులకు రూ. 20వేలు ఇస్తామని అంగీకరించింది.

● సమ్మె ఒప్పందాలు అమలేది!?

అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా 11 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. వాటన్నిటి అమలు చేస్తామని ప్రభుత్వం అంగన్‌వాడీలతో ఒక అంగీకారానికి వచ్చింది. అయితే ప్రస్తుతం 5 డిమాండ్లు మాత్రమే అమలు అవుతున్నాయి. మిగిలిన వాటిని త్వరలో అమలు చేస్తామని ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. అయితే నేటికి అవి అమలు కాలేదు. అంగన్‌వాడీ వేతనాల పెంపు మాత్రం జూలై నుంచి ఉంటుందని ప్రభుత్వం మెలిక పెట్టింది. గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్ష రాసి పెండింగ్‌లో ఉన్న 164 పోస్టుల భర్తీ ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. అయితే, ఎన్నికల కోడ్ త్వరలో వచ్చే అవకాశం ఉన్నందున ఈ ప్రతిపాదన ముందుకు సాగే అవకాశం లేదు. 4 యాప్‌లు కలిపి ఒకే యాప్ రూపొందిస్తామని ప్రభుత్వం వెల్లడించినా ఇప్పటికీ అమలు కాలేదు. వేతనాలతో కూడిన మెడికల్ లీవ్, పోషణ మెనూ చార్జీల పెంపు, గ్యాస్ తదితర సమస్యలకు కమిటీ వేయిస్తామని హామీ ఇచ్చింది. ఇది ఎప్పటికి పూర్తవుతుందో తెలియని స్థితి నెలకొంది. మినీ అంగన్‌వాడీలను మెయిన్ సెంటర్‌లుగా చేస్తామన్న హామీ కూడా అమలుకు నోచుకోలేదు. అంగన్‌వాడీ హెల్పర్లకు పదోన్నతులు, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లు, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచింది.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)



అమలు చేయకపోతే ఆందోళనకు దిగుతాం..

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే మరోసారి ఆందోళనకు దిగుతాం. 42 రోజులపాటు సమ్మె చేశాం. మా సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం అంగీకరించింది. ఇప్పటికే 15 రకాల పనులను అంగన్‌వాడీలు చేస్తున్నాయి. ఇంత పని ఒత్తిడిలోనూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. సరకులన్నీ ఒకేసారి ఇవ్వాలని కోరుతున్నా అది అమలు కావటం లేదు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి

- రెహనాబేగం, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు



సమ్మెలో వేతనాలు రాలేదు..

అంగన్‌వాడీల సమ్మె కాలానికి వేతనాలు ఇస్తామని ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఇప్పటికీ రాలేదు. వాటిని త్వరగా అందించాలి. 11 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచితే కేవలం ఐదింటికి మాత్రమే జీవోలు జారీ చేసింది. మిగిలిన వాటికి ఇంకా మోక్షం రాలేదు. త్వరగా ప్రభుత్వం పరిష్కరిస్తుందని భావిస్తున్నాం.

- సుజాత, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అటకెక్కిన స్వచ్ఛ సంకల్పం!

● నిర్వహణ నిధులు మరిచిన ప్రభుత్వం

● సచివాలయాల్లో మూలుగుతున్న పరికరాలు



మూలకు చేరిన ఫాగింగ్ యంత్రం



సచివాలయానికే పరిమితమైన పిచ్చిమొక్కలు తొలగించే యంత్రం

ఉదయగిరి రూరల్, మార్చి 14: జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకంలో భాగంగా సచివాలయాలలో పారిశుధ్యం మెరుగుదలకు ప్రభుత్వం వేల రూపాయలు వెచ్చించి ఫాగింగ్ యంత్రం, హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్, రుతురుమాళ్ల దహనం, గ్రామాల్లో పిచ్చిమొ క్కలు తొలగించే పరికరాలను అందజేసింది. ప్రస్తుతం వాటిని ఎప్పుడూ వినియోగించక పోవడంతో అవి కార్యాలయంలో మూలకు పరిమితం అయ్యాయి. వీటి నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవంతో.. పరికరాల వినియోగంపై సిబ్బందికి అవగా హన కల్పించకపోవడంతో స్వచ్ఛసంకల్పం లక్ష్యం అటకెక్కింది.

వస్తువుల వినియోగానికి అయ్యే ఖర్చు ఎంతంటే..

ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు పరికరాలు అయితే పంపిణీ చేసింది కాని నిర్వహణ నిధులు మాత్రం మరిచింది. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాన్ని వినియోగించాలంటే 15 లీటర్ల డీజిల్, 5 లీటర్ల పెట్రోల్, మలాథియన్ అవసరం. మేజర్ పంచాయతీల్లో అయితే నిత్యం రూ.2500, చిన్న పంచాయతీల్లో రోజుకు రూ.1000లు వరకు ఖర్చు చేయాలి. గ్రామాల్లో రోడ్ల, నివాసాలు వెంట ఉండే పిచ్చిమొక్కలను తొలగించే యంత్రానికి రోజుకు 4 నుంచి 5 లీటర్ల పెట్రోల్ అవసరం. హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్లను పాఠశాలలు, సచివాలయాలు, పీహెచ్‌సల్లో మరుగుదొడ్లను శుభ్రం చేయడానికి ఉపయోగిం చాలి. పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది వాటిని వినియోగించాల్సి ఉంది. అయితే సిబ్బంది కొరత, వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో వారు వాటితో పనిచేసేందుకు విముఖత చూపడం లేదు. యంత్రాలను కొన్ని నెలలుగా మూలనపడేయడంతో వాటిలో కొన్ని యంత్రాలు తుప్పు పట్టి ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సచివాలయాలకు అందజేసిన పరికరాలు సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ప్రభుత్వం సచివాలయాలకు అందజేసిన పారిశుధ్య పరికరాలను వినియోగించేలా చర్యలు చేపడతామని ఈ మేరకు ప్రతి పంచాయతీ కార్యదర్శికి సైతం ఆదేశాలు జారీ చేశామని ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు.

జీ.చెర్లోపల్లి, వడ్డిపాళెంలో రచ్చబండ

ఉదయగిరి రూరల్, మార్చి 14: జీ.చెర్లోపల్లి, వడ్డిపాళెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ ఓబులరెడ్డి, వెంకటేశ్వ రరెడ్డి, పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన మేకపాటి

ఉదయగిరి: జిల్లా వైసీపీ ఎంపీ అభ్యర్థి విజ యసాయిరెడ్డిని గురువారం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఆయన వెంట మేకపాటి అభినవ్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అనంతసాగరం: గౌరవరం, కామిరెడ్డిపాడు, మంగుపల్లి గ్రామాల్లో గురువారం విజయీభవ యాత్రలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీపీ సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

18 నుంచి ఒంటిపూట బడులు

ఉదయగిరి, మార్చి 14: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈనెల 18వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించామన్నారు. ఆరుబయట చెట్ల కింద తరగతులు నిర్వహించరాదని ఆదేశించారు.

ఎన్నికల నిబంధనలు తప్పనిసరి

ఉదయగిరి, మార్చి 14: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సచివాలయ సిబ్బంది ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మోడల్‌ఆఫ్‌కోడ్ కాంటాక్ట్ నోడ్ అధికారి ఈశ్వరమ్మ అన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో 12 సచివాలయాల పరిధిలోని 17గ్రామ పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, వచ్చిన 24 గంటల్లో పంచాయతీ, సచివాలయాలు, కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, ఫొటోలు, గోడ పత్రికలు, స్లోగన్లు తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు.

సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 14: అన్నారెడ్డిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు సరస్వతిదేవి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు పది పరీక్షలల్లో ఉత్తమ మార్కులు సాధించాలని ఉపాధ్యాయులు దీవించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రయాణికుడి మృతి

సంగం, మార్చి 14: కావలికి చెందిన ప్రభు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. మార్గమధ్యలో వైద్యం ఖర్చుల కోసం కలిగిరిలో దిగి కుమార్తె ఇంటికి వెళ్లి నగదు తీసుకుని వచ్చే క్రమంలో అలసటగా ఉంటే మార్గమధ్యలో సంగం తహసీల్దారు కార్యాలయం ఎదురుగా దిగి బల్లల మీద సేదతీరుతూ స్పృహతప్పి పడిపోయాడు. అతన్ని స్థానికులు వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లిదండ్రులు మృతదేహాన్ని స్వగ్రామం కావలికి తీసుకువెళ్లారు.

అందుబాటులో క్షయవ్యాధి పరీక్షలు

అనంతసాగరం, మార్చి 14: స్థానిక పీహెచ్‌సీలో క్షయవ్యాధి పరీక్షలకు సంబంధించిన ఆర్‌టీపీసీఆర్ యంత్రాన్ని గురువారం అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటినుంచి ప్రజలకు క్షయ పరీక్షలు అందుబాటులోకి వస్తాయని వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ మీరాన్ పాల్గొన్నారు.

ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలి

ఆత్మకూరు: మహిళలు, బాలింతలు, గర్భవతులు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.అనూష తెలిపారు. గురువారం వెన్నవాడ సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మహిళలు రాగిపిండి, బెల్లంతో చేసిన వేరుశనగముద్దలు, పెసరపప్పు పాయసం, తదితర వాటిని ప్రతి రోజు తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నారాయణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సైదా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరులో టీడీపీ శ్రేణుల ఉత్సాహం

ఆత్మకూరు: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేరు ఖరారు కావడంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం పట్టణంలో టీడీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచల చౌదరి ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు, ఆనం అభిమానులు ఆనందోత్సవ సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు మాట్లాడారు. ఆత్మకూరు నియో జకవర్గ అభివృద్ధి ప్రదాత ఆనం రామనారాయణరెడ్డి తిరిగి ఆత్మకూ రులో అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు.



మర్రిపాడు: కృష్ణాపురం సెంటర్‌లో కేట్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



ఆత్మకూరు : ఆనందోత్సవాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు

మర్రిపాడు: మండలంలో కార్యకర్తలు నాయకులు, ఆనం అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. కృష్ణాపురం సెంటర్‌లో కేక్ కట్‌చేసి బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు బంకా సుబ్బారెడ్డి, పెగళ్లపాడు మాజీ సర్పంచ్ శేషం బాబు, బ్రాహ్మణపల్లి రామకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సంగం: పార్టీ నేతలు, కార్యకర్తలు బాణాసంచి కాల్చి హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ జిందాబాద్, ఆనం రామనారాయణరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, షేక్‌బాబు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపుతా : కాకర్ల



దిలావర్‌భాయ్‌వీధిలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న కాకర్ల

ఉదయగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపుతానని ఉదయగిరి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధి, షబ్బీర్ కాలనీల్లో నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తొలుత ఖాన్‌షా వలి దర్గా, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతోపాటు పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పి స్తానన్నారు. ఫ్లోరిడ్‌ప్రాంత ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో టీడీపీ హయాంలో రూ.12 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించి 90శాతం పనులు పూర్తి చేసిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పథకాన్ని మూలన పడేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, నాయకులు రియాజ్, అలీజాన్, నందానీ, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఆనం, వేమిరెడ్డితోనే అభివృద్ధి

అనంతసాగరం: నియోజకవర్గ అభివృద్ధి ఆనం రామనారాయణరెడ్డి, పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితోనే సాధ్యమని గురువారం అనంతసాగరం టీడీపీ నాయకుడు పాతపాటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆనం రామనాయణరెడ్డికి టీడీపీ టికెట్టు కెటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినం



కలువాయి: కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

ఉదయగిరి, మార్చి 14: నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను సమష్టిగా గెలిపించుకోవాలని జనసేన ఉదయగిరి ఇన్‌చార్జ్ భోగినేని కాశీరావు పిలుపు నిచ్చారు. జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక బస్టాండ్ సెంట ర్‌లో జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రస్తుతం అధికార పార్టీ మెట్ట ప్రాంతా న్ని అభివృద్ధి చేయ లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడిం దన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి అలూరి రవీంద్ర, వింజమూరు, సీతారా మపురం, ఉదయగిరి, కొండాపురం మండలాధ్యక్షులు బండారు సత్యనారాయణ, పోలిశెట్టి శ్రీనివాసులు, సురేంద్ర రెడ్డి, రామవేంద్రరావు, బండ్ల హరికృష్ణ పాల్గొన్నారు.

సీతారామపురం: మండలకేంద్రంలోని జనసేన కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ నాయకులు బోగినేని కాశీరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోగినేని కాశీరావు మాట్లాడుతూ టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా రావాలని కోరారు. కార్యక్రమంలో పాలిశెట్టి శ్రీనివాసులు,కాశి రత్తయ్య, విరల నారాయణ, పిచెన్నయ్య, సురేంద్ర, అల్లూరి రవీంద్ర పాల్గొన్నారు.

కలువాయి: స్థానిక బస్టాండులో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వీర మహిళ ప్రవళిక, జనసేన మండల పార్టీ అధ్యక్షులు పెరంకొండ మనోహర్, నాయకులు పువ్వాడి నరేష్, శ్రీహరి, రామకిషోర్, గణేష్, ఆంజనేయులు, తేజ, అనిల్ పాల్గొన్నారు.

మడపల్లి యువత సేవలు అభినందనీయం : ఆనం

చేజర్ల, మార్చి14: గ్రామాభివృద్ధికి నడుంకట్టి ఆదర్శంగా నిలుస్తున్న మడపల్లి యువసేన సభ్యులను మాజీమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి బుధవారం రాత్రి సమావేశమయ్యారు. గ్రామ యువకులు మడపల్లి యువసేన గ్రూప్‌గా ఏర్పడి సమస్యలు పరిష్కరించడం ఎంతో అభినందనీయం అని కొనియాడారు. అనంతరం వైసీపీకి చెందిన పరుశురాం, రాఘవేంద్ర, మస్తాన్‌బాష, వినోద్, వెంకటాద్రి, భానుప్రకాష్, వంశీ, కొండయ్య, ప్రసాద్, బాలు తదితరులకు ఆనం టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నవకృష్ణ చౌదరి, సుధాకరరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పల్లెవాసుల దాహం తీర్చిన దాతలు

ఉదయగిరి రూరల్: లింగంనేనిపల్లి, కృష్ణారెడ్డిపల్లి, బిజ్జంపల్లి గ్రామాల ప్రజలు కొన్నిరోజులుగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం గుర్తించిన దాతలు అంబరవపు బలరామిరెడ్డి, కొండా రాజారెడ్డి, బసిరెడ్డి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ కాకు విజయమ్మలు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రతిరోజు ఈ గ్రామాలకు వైఎస్‌ఆర్ సుజల స్రవంతి పథకం నీటిని సరఫరా చేసేందుకు ట్రాక్టర్‌కు డీజిల్, డ్రైవర్ వేతనం చెల్లించేందుకు ముందుకు వచ్చారు.

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, మార్చి 14: కిడ్నీ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ కె.శేషారత్నం తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గురువారం నిర్వహించిన వరల్డ్ కిడ్నీ డే వేడుకలో పాల్గొని మాట్లాడారు. కిడ్నీ వ్యాధులు వచ్చిన తరువాత, రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యశాల ఆర్‌ఎం డాక్టర్ ఉషాసుందరి, ఏవో శ్రీనివాసులరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పిల్లర్ల దశ దాటని తరగతి గదులు



పిల్లర్ల దశలోనే నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

పలేటివారిపాలెం, మార్చి 14: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాగణంలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం నిధుల్లేక అర్థంతరంగా నిలిచాలి. హైస్కూల్‌లో తరగతి గదుల కొరత తీవ్రంగా ఉండడంతో ప్రభుత్వం ముందుగా 8 అదనపు గదులను నాడు-నేడు రెండో విడతలో మంజూరు చేసింది. సుమారు రూ.90 లక్షలు మంజూరు కాగా 8 బదులు 5 గదులు మాత్రమే నిర్మించాలని ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అయితే ఆ పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. దీంతో అదనపు మంజూరయిన నిధులు ఇతర పాఠశాలలకు మళ్లించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం : శిరీష ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

తరగతి గదుల నిర్మాణానికి నిధులు రాక పనులు ఆలస్యమయ్యాయి. మంజూరయిన నిధులను వేరే పాఠశాలకు మళ్లించారు. మళ్లీ నిధులు మంజూరయ్యాయి త్వరలో పనులు ప్రారంభిస్తాం.

టికెట్ ఖరారుపై 'ఇంటూరి' అభిమానుల సంబరం



కందుకూరు : ఇంటూరి నాగేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కందుకూరు : టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు పేరు వెలువడగానే ఆయన అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. బుధవారం రాత్రే ఇంటూరి మంగళగిరి చేరుకోగా, టికెట్ ఖరారైన వెంటనే పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన నాగేశ్వరరావు గురువారం ఉదయం కందుకూరుకు తిరిగి వచ్చేశారు. మార్గమధ్యంలో పూర్వ ప్రకాశం, గుంటూరు జిల్లాల సరిహద్దులో జాతీయ రహదారిపై బొప్పూడి వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు తదితరులతో కలిసి పూజలు చేశారు. అనంతరం ఒంగోలు సమీపంలోని వల్లూరమ్మ అమ్మవారి ఆలయంలోను పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వాహనాలలో సింగరాయకొండ వద్దకు చేరుకుని ఇంటూరికి ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి వాహన శ్రేణితో ర్యాలీగా కందుకూరుకు రాగా మార్గమధ్యంలో చల్లా స్వగ్రామమైన ఓగూరు వద్ద పార్టీ నాయకులు నాగేశ్వరరావును ఘనంగా స్వాగతించారు. కందుకూరులోను పెద్దఎత్తున వాహనాలు వెంటరాగా ప్రధాన వీధులలో ర్యాలీగా నాగేశ్వరరావు మహనీయుల విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం కందుకూరు గ్రామదేవత అంకమ్మ అమ్మవారి ఆలయంలోనూ ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లింగసముద్రం : కందుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావును ప్రకటించడంతో గురువారం తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎస్ నారాయణ, ఇతర నాయకులు అర్ధాకుల సత్యం, పెదసత్యం, దేవకి సుబ్రహ్మణ్యం తదితరులు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు స్థానిక వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ బాలకోటయ్య, జంపాల శివప్రసాద్, షైల రామకేశవులు, బీ శ్రీనివాసులు, సాదం శ్రీనివాసులు, అడపా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



కొండాపురంలో విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న గంజాం రాఘవేంద్ర

కావలి రూరల్, మార్చి14: విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరవచ్చని శ్రీ చైతన్య సీబీఎస్ఈ క్యాంపస్ ప్రిన్సిపాల్ శైలేష్ కుమార్ పేర్కొన్నారు. కావలి శాంతినగర్‌లోని ఆ పాఠశాలలో గురువారం సరస్వతి పూజ నిర్వహించారు. 1,3వ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులకు హాల్‌టికెట్లతో పాటు ప్యాడ్‌లు, పెన్నులు, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 1వ బ్రాంచ్ ప్రిన్సిపాల్ పీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : విద్యార్థులు మనోధైర్యంతో పరీక్షలకు హాజరు కావాలని ఎంఈవో రవీంద్రనాథ్ అన్నారు. మండలంలోని నార్తుమోపూరు శ్రీచైతన్య విద్యా సంస్థల్లో గురువారం నిర్వహించిన సరస్వతి పూజలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్, డైరెక్టర్ ఖాజారహంతుల్లా, డీఎస్ఆర్ ట్రస్ట్ మేనేజరు అనీల్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, కొప్పు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● **పరీక్ష సామగ్రి పంపిణీ**

కలిగిరి : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు స్థానిక సాయిదత్త ఫర్నీచర్ యజమాని నీలి ఓబయ్య గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ దాతలు విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండాపురం : మండలంలోని కొమ్మి జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు రాగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర మాట్లాడుతూ పదిలో ఉత్తమ మార్కులు సాధించాలన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఎన్నికలకు ఏర్పాట్లు : ఆర్వో

కావలి,మార్చి14: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లను పటిష్టంగా అమలు చేయాలని కావలి ఆర్వో, ఆర్డీవో శీనా నాయక్ తెలిపారు. ఆర్డీవో కార్యాలయ చాంబరులో గురువారం డీఎస్పీ ఎం. వెంకటరమణ, నియోజకవ ర్గంలోని ఏఈఆర్వోలు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావన్‌కుమార్, కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి మండల తహసీల్దార్‌లతో ఆయన ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. నామినేషన్ల సెంటర్ వద్ద, ఆర్వో ఆఫీస్ వద్ద, ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే రిసెప్షన్ సెంటర్ వద్ద, పోస్టల్ బ్యాలెట్ల దగ్గర, స్ట్రాంగ్ రూములు దగ్గర చేపట్టాల్సిన బందోబస్తు గురించి డీఎస్పీతో చర్చించారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, నామినేషన్ల ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్ల ప్రక్రియపై తీసుకుంటున్న చర్యల గురించి ఏఈఆర్వోలతో చర్చించారు.

సీఏఏను రద్దు చేయాలని నిరసన

కావలి, మార్చి14: పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏను) రద్దు చేయాలని కోరుతూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్, వామపక్షాల నేతలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజల మధ్య మతం పేరుతో చిచ్చు పెట్టే బీజేపీ విధానాలను వ్యతిరేకించాలన్నారు. దేశ సార్వభౌమత్వానికి ప్రమాదకరంగా ఉన్న పౌరసత్వ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి చింతాల వెంకట్రావు, సీపీఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, నాగరాజు, సీపీఎం నా యకులు పీ. పెంచలయ్య, న్యూడెమోక్రసీ నాయకులు కరువది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తలనీలాల వేలం పాట

వలేటివారిపాలెం, మార్చి 14: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు తలనీలాలు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. తలనీలాలు వేలం పాట ఇప్పటికే మూడుసార్లు వాయిదా వేశారు. నాల్గోసారి శుక్రవారం జరిగే వేలంలో పాట పాడతారా లేక మరోసారి వాయిదా పడేనా ? అనే అనుమానం అధికారుల్లో ఉంది.

28న ఆర్‌ఎస్‌ఆర్‌లో టెక్నోపల్స్ 2కే24

బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల ఆర్‌ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 28న టెక్నోపల్స్ 2కే24 పేరుతో టెక్నికల్ ప్రోగ్రామ్ నిర్వహిం చనున్నట్లు ప్రిన్సిపాల్ పీవీఎస్‌రెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, చురుకుతనం, విశ్లేషణ వంటి గుణాలను వెలికి తీసేందుకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్వీ రమణారెడ్డి, కన్వీనర్ డాక్టర్ ఎన్ కృష్ణచైతన్య, ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్లు పీ.సునీల్ రెడ్డి, పీవీ రామ్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, కే.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును గెలిపించుకుందాం..



బిట్రగుంట : రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించి, చంద్రబాబును గెలిపించుకుందామని మండల టీడీపీ ఎన్నికల ఇన్‌చార్జి దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో గురువారం సాయంత్రం టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలతో మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎల్ సుధీర్‌బాబు, ఎంపరవికుమార్, అహ్మద్‌బాషా, జానకిరామయ్య, హరిబాబు, బీజేపీ నాయకులు ఎన్ శ్రీనివాసులు యాదవ్, జీ.వెంకటేశ్వర్లు, వీ జయప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న క్రిష్ణారెడ్డి

కావలి,మార్చి14: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడటంతో టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి గురువారం కావలి నమస్కార్ కాన్ఫరెన్స్ హాల్‌లో బీజేపీ నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేద్దామని చర్చించుకున్నారు. అనంతరం బీజేపీ నేతలు కావ్య క్రిష్ణారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలతోపాటు బీజేపీ నాయకులు కే బ్రహ్మానందం, సీపీసీ సత్యం, కమల, కంచర్ల మురళి, మందా కిరణ్, వింతా రంగారెడ్డి, పరుసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● **న్యాయవాదుల మద్దతు**

కావలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు న్యాయవాదులు కావ్య క్రిష్ణారెడ్డి మద్దతు తెలిపారు. అనంతరం పలు సమస్యలను న్యాయవాదులు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోట్లూరు శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఐవీ రామిరెడ్డి, కార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు.

● **టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కృషి**

కావలిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కృషిచేస్తానని, వస్త్రవ్యాపార కేంద్రంగా కావలిని అభివృద్ధి చేస్తానని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని అరుణోదయ, నవోదయ, శుభోదయ వస్త్రమార్కెట్ల సముదాయాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

కాపు రిజర్వేషన్ కోసం పోరాడిన యోధుడు రమేష్‌బాబు



రమేష్‌బాబు చిత్రపటానికి కాపు నాయకుల నివాళి

బిట్రగుంట, మార్చి 14: కాపుల రిజర్వేషన్ కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు మెతుకు రమేష్‌బాబు అని కాపు సంఘం రాష్ట్ర నాయకులు శ్రీహరినాయుడు అన్నారు. బోగోలులో గురువారం జరిగిన రమేష్‌బాబు ఉత్తరక్రియల్లో రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్దన్, జేఏసీ నాయకులు రాఘవయ్య, కొక్కిరాల సంజీవ్, మార్కండేయులు, విజయకుమార్, వేర్పురి శ్రీనివాసరావులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. అలగే మండల బీజేపీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, వైసీపీ నాయకులు పోలిశెట్టి శ్రీనివాసులు, బీనరేంద్రరెడ్డి, స్వచ్ఛంద సంస్థల నాయకులు రామిశెట్టి వెంకటసుబ్బారావు, బోగిరి ప్రభాకర్ తదితరులు రమేష్‌బాబు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళర్పించారు. కాపు నాయకురాలు మెతుకు రాజేశ్వరికి ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కోరం లేక గంట ఆలస్యంగా వీవీపాలెం మండల మీట్

● **అరగంటలోనే ముగింపు**

వలేటివారిపాలెం మార్చి 14 : మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సమావేశంలో గ్రామాల్లోని సమస్యలపై సభ్యులెవరూ కూడా అ్ధదికారులను ప్రశ్నించలేదు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి 21 మంది సర్పంచులు రావాల్సి ఉండగా నలుగురు మాత్రమే హాజరయ్యారు. 10 మంది ఎంపీటీసీలకుగానూ నలుగురే హాజరయ్యారు. కోరంలేక గంట ఆలస్యంగా సమావేశాన్ని ప్రారంభించారు. పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. రెవెన్యూ, ఇరిగేషన్, అటవీశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, రోడ్ల భవనాల శాఖాధికారులు సమావేశానికి హాజరుకాలేదు. ప్రారంభమైన అరగంటలోపే ముగించి అధికారులు చేతులు దులుపేసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ పీ మౌనిక, జడ్పీటీసీ ఇంటూరి భారతి, ఎంపీడీవో రఫీక్‌అహ్మద్, ఎంపీటీసీలు స్వర్ణ నరసింహం,సీహెచ్ యానాది, సీహెచ్ రవీంద్ర, సర్పంచులు ఇరపని సతీష్, అనుమోల అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సుధాకర్, తదితరులు

కావలిటౌన్, మార్చి14: పట్టణ జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అ ళహరి సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా సుధాకర్ పార్టీ జెండా ఆవిష్కరించి, అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నేతలకు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఇల్లు కాలి ఇబ్బంది పడుతున్న జనసేన వీర మహిళకు రూ. 20,000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.